thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 20 సంచిక - 169 కరీంనగర్ బుధవారం, 27 ఆగష్టు 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి : ఖర్గే

దేశంలో గుత్తాధిపత్యం కారణంగా సామాన్యుల సంపద ధనికుల జేబుల్లోకి వెళ్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పేర్కొన్నారు. ఖర్గే కీలక వ్యాఖ్యలు చేశారు. 'ఎన్నికల సంస్థలతో సహా అన్నింటిలోనూ కేంద్రం జోక్యం చేసుకుంటోంది. అన్నిచోట్లా తన ఆధిపత్యాన్ని నెలకొల్పు తోంది. ఎలక్ట్రానిక్ టెక్నాలజీ కారణంగా ఎన్నికల్లో మోసాలు జరుగుతున్నాయి. ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంలను వదిలి బ్యాలెట్ వైపు మొగ్గు చూపుతు న్నాయి. ప్రపంచంలో ఎక్కడా ఈవీఎంలు అందుబాటులో లేవు. 140 కోట్ల మంది ప్రజలు ప్రజాస్వామ్యాన్ని నమ్ముతున్నారు. త్వరలోనే ఈ దేశ యువత మేలుకొని బ్యాలెట్‌లకు మద్దతుగా ఈవీఎంలకు వ్యతిరేకంగా తమ గొంతు వినిపిస్తారు' అని ఖర్గే పేర్కొన్నారు.




# మోదీ తెగింపు

## 50% పన్ను అమలుకు ఇంకా 2 రోజులే.. మీరు 100% పన్ను వేసినా పర్వాలేదు..

### మా దగ్గర ప్లాన్ బి సిద్ధంగా ఉంది.. ఇది యువ భారతదేశం ట్రంప్.. మీరు ఏమీ చేయలేరు..!

ప్రపంచ వాణిజ్యంపై పెద్ద ప్రభావం చూపగల అమెరికా-రష్యా సమావేశం ఇటీవల జరిగింది. ఈ సమావేశం యొక్క ఫలితాలు, భారతదేశానికి వ్యతిరేకంగా 50% అదనపు పన్నులు కొనసాగుతాయా లేదా రద్దు చేయబడతాయా అనేది నిర్ణయించవచ్చు. అయితే, ఈ నిబంధనల ఫలితాల కోసం వేచి ఉండకుండా, భారతదేశం తన ప్లాన్ బిని నిశ్శబ్దంగా సిద్ధం చేస్తోంది. ఈ ప్రణాళిక, పన్నుల ప్రభావాన్ని భర్తీ చేయడంతో పాటు, భారతదేశ ఆర్థిక వృద్ధిని ముందుకు తీసుకువెళ్లే విధంగా రూపొందించబడింది.

**భారతదేశం ఎందుకు ఈ చర్య తీసుకుంటోంది?...** రష్యా-ఉక్రెయిన్ యుద్ధం మధ్య, రష్యా నుండి భారతదేశం తక్కువ ధరకు ముడి చమురు కొనడాన్ని వ్యతిరేకిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారతదేశంపై 50% అదనపు పన్నులు విధిస్తానని ప్రకటించారు. ఇది భారతీయ ఎగుమతిదారులకు ఒక పెద్ద ముప్పు. అయితే, భారత దేశ విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, మాస్కోకు వెళ్లి, రష్యాతో భారతదేశ సంబంధాలు ఏ అడ్డంకి వల్ల ప్రభావితం కావని స్పష్టం చేశారు.

**ప్లాన్ బి యొక్క ముఖ్య లక్షణాలు:** 1. ఎగుమతి మార్కెట్‌ను విస్తరించడం: అమెరికా వంటి ఒకే మార్కెట్‌పై ఆధారపడకుండా, భారతదేశం తన ఎగుమతులను కొత్త దేశాలకు విస్తరించాలని ప్రణాళిక వేస్తోంది. యూరోప్, కెనడా, లాటిన్ అమెరికా, మరియు ఆసియాన్ దేశాలు వంటి అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలతో అనుకూలమైన వాణిజ్య ఒప్పందాలను చేసుకోవడానికి భారతదేశం కృషి చేస్తోంది. ఇది, అమెరికా పన్నుల ప్రభావాన్ని తగ్గించి, భారతీయ ఉత్పత్తులను ప్రపంచ మార్కెట్‌లో పోటీతత్వంతో ఉంచడానికి సహాయపడుతుంది.

2. రక్షణ మరియు రాయితీలు: బట్టలు, ఉక్కు మరియు ఎలక్ట్రానిక్స్ వంటి ముఖ్య ఉత్పత్తి రంగాలను, పన్నుల ప్రభావం నుండి రక్షించడానికి భారతదేశం అనేక చర్యలు తీసుకుంటోంది. ఈ రంగాలకు ప్రత్యేక రాయితీలు మరియు రుణ సదుపాయాలను అందించడం గురించి కూడా ప్రభుత్వం ఆలోచిస్తోంది. చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు అవసరమైన సహాయం అందించడం ద్వారా, పన్నుల ప్రభావాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం నమ్ముతోంది.

3. డిజిటల్ వాణిజ్య ఒప్పందాలు: వస్తువుల వాణిజ్యానికి మాత్రమే కాకుండా, భారతదేశ సేవా రంగం యొక్క ఎగుమతిని కూడా నిర్ధారించడానికి డిజిటల్ వాణిజ్య ఒప్పందాల ద్వారా భారతదేశం కొత్త మార్గాలను సృష్టిస్తోంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో, భారతదేశ సేవా రంగం యొక్క ఎగుమతి ఒక ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఈ రంగం అమెరికా పన్నుల కిందకు రాదు, కాబట్టి ఇది భారతదేశ ఆర్థిక వృద్ధికి ఒక భద్రతను అందిస్తుంది.

4. స్వావలంబన మరియు దేశీయ బలోపేతం: అధిక పన్నులు విధించబడే దిగుమతులను తగ్గించి, దేశీయ ఉత్పత్తిని పెంచడానికి కూడా ప్రణాళికలు అమలులో ఉన్నాయి. ఉదాహరణకు, మహారాష్ట్ర ప్రభుత్వం, పన్నుల సవాళ్లను ఎదుర్కోవడానికి, పరిశ్రమలకు మద్దతుగా 100 కంటే ఎక్కువ సంస్కరణలను చేపట్టాలని ప్రణాళిక వేస్తోంది. ఇది, ఎగుమతిదారులకు ప్రోత్సాహాన్ని ఇవ్వడంతో పాటు, దేశీయ ఉత్పత్తిని బలోపేతం చేస్తుంది.

**భారతదేశం నుండి స్పష్టమైన సందేశం:** మొత్తంగా, భారతదేశం యొక్క ఈ ప్లాన్ బి ప్రపంచానికి ఒక స్పష్టమైన సందేశాన్ని పంపుతోంది: భారతదేశం యొక్క అభివృద్ధి ప్రయాణం, విదేశీ దౌత్యాల వల్ల ప్రభావితం కాదు. వాణిజ్య అడ్డంకులు మరియు ఒత్తిళ్లను ఎదుర్కోగల సామర్థ్యాన్ని మరియు తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునే దృఢత్వాన్ని భారతదేశం ప్రదర్శిస్తోంది.

ఇది, అంతర్జాతీయ రాజకీయ మరియు ఆర్థిక పోకడలలో భారతదేశం ఒక ముఖ్యమైన శక్తిగా ఎదుగుతోందని చూపిస్తుంది.

## అల్పపీడనం ఎఫెక్ట్.. తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు.. ఎప్పటివరకంటే..

అమరావతి, ఆగస్టు26 : వాయువ్య బంగాళాఖాతంలో ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీరాల వెంబడి అల్పపీడనం ఏర్పడిందని.. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమ వాయువ్య దిశగా కదిలి మరింత బలపడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు సూచించారు.


**తెలంగాణలో మూడు రోజులు భారీ వర్షాలు...** మరోవైపు.. తెలంగాణ రాష్ట్రంలో రాగల మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. నిన్న వాయువ్య బంగాళాఖాతం, దాని పరిసరాల్లో ఒడిశా వెస్ట్ బెంగాల్ తీరాలకు సమీపంలో ఉపరితల ఆవర్తనం కొనసాగిందని.. దీని ప్రభావంతో ఈరోజు(మంగళవారం) ఉదయం అదే ప్రాంతంలో ఒక అల్పపీడన ప్రాంతం ఏర్పడిందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. దీనికి అనుబంధంగా ఉన్న ఉపరితల చక్రవాత ఆవర్తనం సగటు సముద్ర మట్టం నుంచి




7.6 కిలోమీటర్ల ఎత్తువరకు కొనసాగుతూ.. ఎత్తు పెరిగే కొద్దీ నైరుతి దిక్కుకు వాలి ఉందని తెలిపారు. ఈ అల్పపీడనం రాగల రెండు రోజుల్లో వాయువ్యదిశలో కదిలి మరింత బలపడే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. రుతుపవన ద్రోణి ఈరోజు గంగానగర్, శిరసా, ఆగ్రా, బండ, సిద్ధి, సంబల్పూర్, వాయువ్య బంగాళాఖాతం ప్రాంతంలో ఉన్న అల్పపీడన ప్రాంతం కేంద్రం, ఆ తర్వాత తూర్పు ఆగ్నేయ దిశలో తూర్పు, మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్రం మట్టం నుంచి 1.5 కిలోమీటర్ల ఎత్తులో కొనసాగుతోందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

**మూడు రోజులకు వాతావరణ సూచన...** ఈరోజు(మంగళవారం) తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు చాలా చోట్ల కురిసే అవకాశం ఉందని తెలిపారు. రేపు(బుధవారం), ఎల్లుండి(గురువారం) రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు.

**వాతావరణ హెచ్చరికలు..** ఈరోజు(మంగళవారం) రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వివరించారు. రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. ఈరోజు, రేపు, ఎల్లుండి రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో ఉరుములు, మెరుపులు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు పేర్కొన్నారు.







# తెలంగాణ మహిళలు సిద్ధమా..?

## అకౌంట్ లోకి రూ. 2,500..

### విధి విధానాలను సిద్ధం చేస్తున్న అధికార గణం!!

హైదరాబాద్ : తెలంగాణ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేస్తోంది. ఎన్నికల్లో ఆరు గ్యారంటీల ద్వారా ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చుకుంటూ వస్తోంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేశారు. ఆ తర్వాత 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ప్రారంభించారు. అనంతరం రూ. 500 లకే గ్యాస్ సిలిండర్ పథకాన్ని ప్రారంభించారు. తాజాగా రాష్ట్రంలోని మహిళల కోసం మరో పథకాన్ని అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం అవుతోంది. తెలంగాణలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులనే చేయడమే తమ ప్రభుత్వ ధ్యేయం అని సీఎం రేవంత్ రెడ్డి చాలా సార్లు ప్రకటన చేశారు. అందులో భాగంగానే మహిళలకు ఆరు గ్యారంటీల రూపంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తూ వస్తుంది రాష్ట్ర ప్రభుత్వం. తాజాగా మహాలక్ష్మి పథకంలో భాగంగా 18-55 ఏళ్ల మహిళలకు నెలకు రూ. 2,500 ఆర్థిక సాయం అందించే దిశగా కాంగ్రెస్ సర్కార్ సిద్ధం అవుతోంది. ఈ మేరకు అధికారులు విధి విధానాలను రూపొందిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే మహిళల ఖాతాల్లోకి రూ. 2,500 జమ కానున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే రైతులకు రైతు భరోసా నగదు జమ చేసిన ప్రభుత్వం.. మహిళలకు సైతం ఈ పథకాన్ని అమలు చేసి ఎన్నికల్లోకి వెళితే మరింత లాభసాటిగా ఫలితాలు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే అధికారులు సెర్ప్, మెప్మా నుంచి మహిళల వివరాలను తీసుకున్నట్లు సమాచారం అందుతోంది. తెల్ల రేషన్ కార్డు కలిగిన మహిళలను లబ్ధిదారులుగా ఎంపిక చేయనున్నారు. ప్రస్తుతం మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాల చెక్కులను పంపిణీ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం. ఈ నెల 18 వరకు మహిళా సంఘాల ఖాతాల్లో వడ్డీ సొమ్ము జమ చేసింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.344 కోట్లు విడుదల చేసింది. ఇందులో రూ.300 కోట్లు గ్రామీణ మహిళా సంఘాలకు, రూ.44 కోట్లు పట్టణ మహిళా సంఘాలకు విడుదల చేసింది. సీఎం రేవంత్ రెడ్డి ఇటీవల మాట్లాడుతూ.. తెలంగాణలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యం అని తెలిపారు. అందుకు అనుగుణంగా ఇందిరా మహిళా శక్తి పాలసీ-2025 ను రూపొందించారు. మహిళల ఆర్థిక స్వేచ్ఛ, ఉపాధి కల్పన, సంపద సృష్టి ప్రధాన లక్ష్యాలుగా ఈ పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చింది. ప్రస్తుతం స్వయం సహాయక సంఘాలు గ్రామాల్లో సెర్ప్, పట్టణాల్లో మెప్మా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నాయి. అయితే తాజాగా నూతన విధానంలో మహిళా శక్తి సంఘాలన్నింటినీ ఒకే గొడుగు కిందకు తీసుకొచ్చిన విషయం తెలిసిందే.


చురకలు






## ఆకట్టుకుంటున్న 'ఆపరేషన్ సిందూర్' గణేశుడు

హైదరాబాద్‌లోని పాతబస్తీ లలిత బాగ్ డివిజన్‌లో 'ఆపరేషన్ సిందూర్' స్ఫూర్తితో ఏర్పాటు చేసిన వినాయకుడి విగ్రహ అందరినీ విశేషంగా ఆకర్షిస్తోంది. మల్లికార్జునస్వామినగర్ యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినూత్నంగా ఈ గణపతి ప్రతిమను నిలిపారు. వైమానిక అధికారి వేషధారణలో ఉన్న గణనాథుడి విగ్రహం చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. సుమారు రూ.10 లక్షల ఖర్చుతో ఈ విధంగా ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.




కరీంనగర్: ఓట్ల చోరీ అంటూ కాంగ్రెస్ నేతలు చేస్తున్న ఆరోపణలు అర్ధరహితమని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. 30 ఏళ్లుగా తాను ప్రజాప్రతినిధిగా ఉన్నానని చెప్పారు. వార్డు మెంబర్ కానివాళ్లు కూడా విమర్శించడం సరికాదన్నారు. ఇటీవల టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ చేసిన ఆరోపణల నేపథ్యంలో బండి సంజయ్ స్పందించారు. కరీంనగర్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. "దొంగ ఓట్లు అంటూ కాంగ్రెస్ నేతలు చేసే దుష్ప్రచారం ప్రజలను అవమానించడమే. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పంచాయతీలకు ఒక్క పైసా అయినా ఇచ్చిందా? కేంద్రం నిధులు ఇస్తుందనే ఇప్పుడు స్థానిక ఎన్నికలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు రాత్రిపూట యాత్రలు చేయడం ఏమిటో అర్థం కావడం లేదు. కరీంనగర్‌లో ప్రతి ఓటూ పరిశీలించి దొంగ ఓట్ల తీసేయాలి. రెండు చోట్ల ఓటు వేయడం ఎవరికైనా సాధ్యమా?అవగాహన లేకుండా ఇష్టారీతిన మాట్లాడుతున్నారు. పీసీసీ అధ్యక్షుడు ఓట్ల చోరీ గురించి కాకుండా సీట్ల చోరీ గురించి మాట్లాడాలి. రొహింగ్యాల విషయంలో ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారు. దేశం ముఖ్యమా? ఓటు బ్యాంకు ముఖ్యమా?అప్పుడు భారత రాష్ట్ర సమితి.. ఇప్పుడు కాంగ్రెస్.. రెండూ అదే తరహా రాజకీయాలు చేస్తున్నాయి" అని బండి సంజయ్ విమర్శించారు.




హైదరాబాద్: తెలంగాణలో భాజపా వ్యవహారంపై ఆ పార్టీ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. భాజపా రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ తివారీకి కానుకగా ఫుట్‌బాల్ ఇచ్చి నిరసన తెలిపారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పార్టీ వ్యవహారంపై విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలో తనను ఫుట్‌బాల్ ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ తివారీని కలిస్తే.. రామచందర్ రావును కలవమంటున్నారు. రామచందర్‌రావును కలిస్తే.. అభయ్ పాటిల్‌ను కలవమంటున్నారు.

ఒకరిని కలిస్తే మరొకరి పేరు చెబుతున్నారని మండిపడ్డారు. జిల్లా అధ్యక్షుల తీరు, పార్టీ కార్యక్రమాల్లో సమన్వయ లోపంపై తన అసంతృప్తిని వ్యక్తం చేశారు.




## రైతులు ధర్నాలు చేస్తుంటే.. సీఎం, మంత్రులు ఎక్కడ?: కేటీఆర్

హైదరాబాద్: యూరియాను కాంగ్రెస్ ఎంపీలు తేలేరు.. భాజపా ఎంపీలు అడగరు అని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. రైతులు యూరియా కోసం అనేక పాట్లు పడుతున్నారని అన్నారు. ఈ మేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. "యూరియా కోసం రైతులు ధర్నాలు చేస్తుంటే.. సీఎం మంత్రులు ఎక్కడున్నారు?సమస్యలు ఇక్కడుంటే సీఎం, మంత్రులు ఉండేది దిల్లీ, బిహార్‌లలోనా?జాతీయ పార్టీలకు ఓట్లు.. రాష్ట్ర ప్రజలకు పాట్లు" అని కేటీఆర్ పేర్కొన్నారు.



## రాహుల్‌తో కలిసి 'ఓటర్ అధికార్' యాత్రలో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి

పట్నా: ఓటర్ల జాబితాలో లోపాలను ఎత్తిచూపుతూ బిహార్‌లో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేపట్టిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సుపోల్‌లో నిర్వహించిన పాదయాత్రకు రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో కలిసి ఆయన హాజరయ్యారు. సీఎం రేవంత్‌తో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, డీసీసీ అధ్యక్షుడు రోహిన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## గాంధీ కుటుంబమే నాకు దైవం: ఆర్‌ఎస్‌ఎస్ గీతం వివాదంపై డీకే శివకుమార్

బెంగళూరు: కర్ణాటకలో ఒకవైపు 'సీఎం మార్పు' అంశంపై ఊహాగానాలు వినిపిస్తుండగా.. మరోపక్క ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. దాంతో కాంగ్రెస్ నేతలంతా ఆశ్చర్యానికి గురయ్యారు. ఈ వ్యవహారంపై తాజాగా డీకే స్పందించారు. "భాజపాను విమర్శించేందుకే నేను ఆ పాట పాడాను. కానీ కొందరు దీనిద్వారా రాజకీయ లబ్ధి పొందాలని అనుకుంటున్నారు. ప్రజల్లో గందరగోళం సృష్టించాలని చూస్తున్నారు. నేను ఎవరి మనోభావాలు దెబ్బతీయాలని అనుకోవడం లేదు. ఈ వ్యవహారంతో ఎవరైనా బాధపడిఉంటే.. అందుకు చింతిస్తున్నాను. నేను క్షమాపణలు చెప్తాను. అయితే అవి రాజకీయ ఒత్తిడివల్ల చెప్పే క్షమాపణలు కాదు" అని డీకే వెల్లడించారు. అలాగే గాంధీ కుటుంబం , కాంగ్రెస్ పార్టీపై తనకున్న నిబద్ధత తిరుగులేనిదని వ్యాఖ్యానించారు. "నేను కాంగ్రెస్ వ్యక్తిగానే జన్మించా.. అలాగే మరణిస్తా. గాంధీ కుటుంబం నాకు దైవంతో సమానం. నేను వారి భక్తుడిని" అని స్పష్టం చేశారు.

**శృతి తప్పిన 'శివ'రాగం...** ఇటీవల చిన్నస్వామి క్రీడా మైదానంలో తొక్కిసలాట అంశంపై బదులిస్తున్న సందర్భంగా డీకే శివకుమార్ ఆర్‌ఎస్‌ఎస్ ప్రార్థనా గీతాన్ని ఆలపించటం సభను కాసేపు ఆలోచనలో పడేసింది. తనపై విపక్ష సభ్యులు చేస్తున్న ఆరోపణలు సహేతుకంగా లేవని, భాజపా పాలిత రాష్ట్రాల్లో సంభవించిన తొక్కిసలాట ఘటన వివరాలు తన వద్ద ఉన్నాయన్నారు. ఈ సందర్భంగానే 'నమస్తే సదా వస్తలే మాతృభూమే' అంటూ ఆ సంస్థ ప్రార్థన గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా భాజపా సభ్యులు బల్లలు చరుస్తూ మద్దతిచ్చారు. సభ రికార్డుల నుంచి ఈ గీతాన్ని తొలగించరాదంటూ వారు నినదించారు. డీకే శివకుమార్ ఇలా వ్యవహరించడం ఇదే తొలిసారి కాదు. గతంలో అమిత్ షాతో కలిసి సమావేశంలో పాల్గొనడం, కుంభమేళాలో పుణ్య స్నానం, ఇటీవల ప్రధాని మోదీతో దిల్లీలో భేటీ, యడియూరప్పతో తరచూ మంతనాలు, తాజాగా ఆర్‌ఎస్‌ఎస్ గీతం పాడటం అధిష్ఠానానికి ప్రత్యేకంగా సంకేతాలు పంపడం కిందికే వస్తుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. నాయకత్వ మార్పు అంశం తెరపైకి వచ్చినప్పుడు, తనపై పార్టీలో వ్యతిరేకత పెరిగినప్పుడు భాజపాతో సఖ్యతగా ఉన్నట్లు సందేశాలు పంపుతుంటారు. తనకు భాజపా నుంచి మంచి అవకాశాలున్నాయన్నట్లు తమ పార్టీకి తెలియజేయటమే లక్ష్యమని పలువురు నేతలు వ్యాఖ్యానిస్తున్నారు.




అమెరికాలోని ఫ్లోరిడాలో జరిగిన ఒక్క రోడ్డు ప్రమాదం అక్కడ పని చేయాలనుకొన్న విదేశీ కమర్షియల్ డ్రైవర్ల జీవితాల్లో చీకటి నింపుతోంది. దీనిని సాకుగా చూపించి ట్రంప్ సర్కారు విదేశీ ట్రక్కు డ్రైవర్లకు వర్క్ వీసాలు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్‌ల జారీని నిలిపివేసింది. అమెరికాలో మోటార్ వాహన రంగంలో స్థిరపడాలని కలలు కన్న వేలాది మంది భారతీయులకు ఇది శాపంగా మారింది. ముఖ్యంగా పంజాబ్, హరియాణా ప్రాంతాల నుంచి డ్రైవర్లు వెళుతుంటారు. అమెరికా లోని రవాణారంగం చాలామంది డ్రైవర్లను ఆకర్షించడానికి ప్రధాన కారణం భారీగా ఆదాయం ఉండటమే. అక్కడ పెద్ద మొత్తంలో వేతనాలు ఇవ్వడంతోపాటు.. సురక్షితమైందిగా భావిస్తారు.

**ఏటా కనీసం రూ. 40 లక్షల ఆదాయం..!...** అమెరికా లో డ్రైవర్లకు మైళ్ల ఆధారంగా రేటు చెల్లిస్తుంటారు. ఒక్కో మైలుకు ప్రాంతాన్ని బట్టి 0.60 డాలర్ల నుంచి 0.70 డాలర్ల వరకు గిట్టుబాటు అవుతుంది. ప్రతి డ్రైవర్ రోజుకు 500–600 మైళ్లను సులువుగా ప్రయాణిస్తాడు. ఈ లెక్కన భారతీయ కరెన్సీలో నెలకు రూ.4.2 లక్షల నుంచి రూ.6.7 లక్షల వరకు సంపాదిస్తారు. కొన్ని సంస్థలు మాత్రం డ్రైవర్లకు గంటల చొప్పున లెక్కగట్టి ఇస్తారు. గంటకు రూ.1,680–రూ.2,520 వరకు ఇస్తారు. దీనిలో అనుభవం, లొకేషన్, యజమాని వంటి స్వల్ప మార్పులు ఉంటాయి. సగటున ఏటా ఒక డ్రైవర్ రూ.40 లక్షలు సంపాదిస్తాడు. ఇక వాల్‌మార్ట్, అమెజాన్ వంటి కంపెనీలు అయితే సీజనల్ డ్రైవర్లకు ఏటా రూ.92 లక్షల వరకు చెల్లిస్తాయి.

**డ్రైవర్లకు తీవ్రమైన కొరత..** అమెరికాలో ట్రక్కు డ్రైవర్ల కొరత తీవ్రంగా ఉంది. భారత్‌లోని పంజాబ్ నుంచి యువత ఎక్కువగా అక్కడికి వెళ్లి డ్రైవర్లుగా స్థిరపడుతున్నారు. నార్త్ అమెరికన్ పంజాబీ ట్రక్కింగ్ అసోసియేషన్‌లో 1,400 మంది సభ్యులు ఉన్నారు. వీరికి మొత్తం 9,000 ట్రక్కులు ఉన్నాయి. దీని సీఈవో రామన్ దిల్లాన్ ఓ పత్రికతో మాట్లాడుతూ అమెరికాలో డ్రైవర్ల కొరతను పంజాబీలు భర్తీ చేస్తున్నారని చెప్పారు. అమెరికా ట్రాన్స్‌పోర్టు రంగ నిపుణుడు బ్రెంట్ అలైన్ కూడా విదేశీ డ్రైవర్లపై వీసా బ్యాన్ స్వల్పకాలమే ఉంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. కొత్త డ్రైవర్లకు శారీరక ధారుఢ్య పరీక్ష, సరైన శిక్షణ ఇచ్చి లైసెన్స్‌లు జారీ చేయాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రస్తుతం అమెరికాలో అవసరమైన దానికంటే చాలా తక్కువ కమర్షియల్ డ్రైవర్లు ఉన్న విషయాన్ని గుర్తుచేశారు. 2025 బడ్జెట్ సంవత్సరంలో అమెరికాలో విదేశీ డ్రైవర్లకు 1,490 హెచ్–2బీ వీసాలను జారీ చేశారు. అంతకుముందు ఏడాదికి 1,400 మాత్రమే ఇచ్చారు.

**ఎంతమంది భారతీయులపై ప్రభావం..?...** అమెరికాలో 2021 లెక్కల ప్రకారం 7.2 లక్షల మంది విదేశీ కమర్షియల్ డ్రైవర్లు ఉన్నారు. అమెరికా ట్రక్కింగ్ రంగంలో ఇది 18 శాతానికి సమానం. భారత్‌లోని పంజాబ్, హరియాణా నుంచి పెద్దసంఖ్యలో యువకులు ఇక్కడికి వస్తుంటారు. 2018లో గణంకాల ప్రకారం కేవలం రెండేళ్ల వ్యవధిలోనే 30,000 మంది భారతీయ సిక్కులు ట్రక్కింగ్ రంగంలో చేరారంటే అర్థం చేసుకోవచ్చు. తాజాగా ట్రంప్ సర్కారు చర్యలతో విదేశీ డ్రైవర్లకు వీసాలు, వర్క్‌పర్మిట్లు, కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్స్ జారీ నిలిచిపోయింది. చట్టపరమైన అనుమతులతో ఇప్పటికే పనిచేస్తున్న వారికి వచ్చిన ఇబ్బందులు ఏమీ లేకపోయినా.. వీసా పునరుద్ధరణ సమయాల్లో మాత్రం చిక్కులు తప్పేలా లేవు. దీంతో వేల మంది భారతీయులు భవిష్యత్తులో ఉద్యోగాలను కోల్పోవాల్సి ఉంటుంది.

## రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్దామా: మహేశ్ కుమార్ గౌడ్‌కి రఘునందన్ రావు సవాల్

హైదరాబాద్: తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్ బాధ్యత మరిచి మాట్లాడుతున్నారని భాజపా ఎంపీ రఘునందన్‌రావు విమర్శించారు. మా పార్టీ ఎంపీలందరం రాజీనామా చేసి మళ్లీ ఎన్నికలకు వెళ్తాం.. దానికి మీరు కూడా సిద్ధమా అని సవాల్ విసిరారు. రాజీనామా చేసే దైర్యం ఉందా అని ప్రశ్నించారు. ఓటు చోరీపై పీసీసీ అధ్యక్షుడు చేసిన వ్యాఖ్యలపై రఘునందన్‌రావు ఘాటుగా స్పందించారు. "పీసీసీ అధ్యక్షుడిగా ఏది పడితే అది మాట్లాడితే కుదరదు. ఓటు చోరీ చేస్తే దేశంలో ఉన్న అన్ని పార్లమెంట్ స్థానాల్లో మేమే గెలుస్తాం కదా. మీరెందుకు 8 ఎంపీ స్థానాలు గెలుస్తారు? అసదుద్దీన్ ఎలా గెలుస్తారు. దమ్ముంటే మీ 8 మంది ఎంపీలతో రాజీనామా చేయించండి. మేమూ రాజీనామా చేస్తాం. కొత్త ఓటర్ లిస్ట్‌తో మళ్లీ ఎన్నికలకు వెళ్దాం. అప్పుడు వాస్తవాలు ఏంటో ప్రజలకు తెలుస్తాయి. భాజపాను అడిగి కామారెడ్డి డిక్లరేషన్ హామీ ఇచ్చారా? కుంటి సాకులు చెప్పకుండా బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలి. కాళేశ్వరంపై నిజాయితీగా కమిషన్ నివేదికను రాష్ట్ర ప్రజల ముందు ఉంచాలి. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ లోపంతోనే యూరియా కొరత ఏర్పడింది. ఇతర రాష్ట్రాల్లో లేని యూరియా కొరత తెలంగాణలోనే ఎందుకు వచ్చింది?" అని రఘునందన్‌రావు ప్రశ్నించారు.






## అత్యాచారం కేసులో నల్గొండ కోర్టు సంచలన తీర్పు

నల్గొండ: బాలికపై అత్యాచారం కేసులో నల్గొండ పోక్సో కోర్టు సంచలన తీర్పు వెలువరించింది. నిందితుడికి 50 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు ఇన్‌ఛార్జి జడ్జి రోజారమణి తీర్పు వెలువరించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలపై 2021లో తిప్పర్తి పీఎస్‌లో మహ్మద్ ఖయ్యూమ్ అనే వ్యక్తిపై పోక్సో కేసు నమోదైంది. 2022 నుంచి జిల్లా కోర్టులో వాదనలు కొనసాగగా.. తాజాగా తీర్పు వెల్లడైంది.

# అజరామరాలు... ముకేష్ పాటలు - ఆగస్టు 27... హిందీ సినీ గాయకుడు ముకేష్ వర్ధంతి



ముకేష్ చంద్ మాథుర్ అంటే ఎవరు అని అడిగితే, భారత దేశంలో దాదాపు దేశ ప్రజలు తెలియదనే అంటారు. హిందీ సినీ నేపథ్య గాయకుడు ముకేష్ పేరు తెలియని వారు దాదాపు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. హిందీ సినీ గాయకునిగా సుపరిచితుడైన ముకేష్ పూర్తి పేరు ముకేష్ చంద్ మాథుర్ అంటే ఔనా అనే వారే తప్ప ఔను అనే వారు బహు అరుదుగా వుంటారు. హిందే సినీ సంగీతానికి మరపురాని మధుర గీతాలను అందించిన విలక్షణ గాయకుడు ముఖేష్. అతి పిన్న వయసులోనే లోకం వదిలి వెళ్లినా, జీవిత చరమాంకం వరకు ముఖేష్ పాడుతూనే వున్నారు. భౌతికంగా దూరమైనా, ఆయన పాడిన పాటలు అజరామరాలై, సంగీత ప్రియుల నోళ్ళలో దశాబ్దాలుగా నానుతూనే ఉన్నాయి. ముకేష్ (జూలై 22, 1923 – ఆగస్టు 27, 1976) 1950 నుండి 1970 ల మధ్యకాలంలో భారతీయ హిందీ సినిమా రంగం నేపథ్య ప్రముఖ గాయకుడు. ముకేష్, కొద్ది పాటలు పాడినా, నేటికినీ మరపురాని గాయకునిగా చిరస్మరణీయుడు. ఆయన పాటలు ఎన్నిసార్లు విన్నా, విసుగు రాకుండా ప్రతి సారీ ఆయన గాత్రంలో లీనం అవుతుండ దాన్ని బట్టి ముఖేష్ ప్రత్యేకత స్పష్టం అవుతున్నది. జూలై 22, 1923న ఢిల్లీ నగరంలో జోరవర్ చాంద్ మాథుర్, చంద్రాణి దంపతులకు ఆరవ సంతానంగా జన్మించారు. తండ్రి ఇంజనీరుగా ఉద్యోగం చేసేవారు. ముఖేష్ అక్క సుందర్ ప్యారికి సంగీతం నేర్పేందుకు ఒక పండిట్ వారి ఇంటికి వచ్చేవారు. దూరంగా ఉన్న గదిలో కూర్చొని ముఖేష్ ఆ సంగీత పండితుడు తన అక్కకు సంగీతం ఎలా నేర్పిస్తున్నారో శ్రద్ధగా గమనిస్తూ తనలో తనే పాడుకుంటూ ఉండేవారు. అలా సంగీతం పట్ల ముఖేష్‌కు అభిమానం ఏర్పడింది. మెట్రిక్యులేషన్ పూర్తి కాగానే కాలేజి చదువుకు వెళ్లకుండా ప్రభుత్వ నిర్మాణ శాఖలో ఉద్యోగంలో చేశారు. వుద్యోగం చేస్తూనే తన సంగీతాభిరుచికి మెరుగులు దిద్దుకునే ప్రయత్నం చేశారు. హార్మోనియం వంటి కొన్ని వాద్య పరికరాలను ఎలా వాయించాలో శిక్షణ తీసుకున్నారు. ముకేష్ దూరపు బంధువు, సినీ నటుడు మోతిలాల్‌కు ముఖేష్ స్వరం కొత్తగా, వినూత్నంగా తోచింది. తండ్రి అనుమతితో ముఖేష్‌ను బొంబాయి తీసుకెళ్లి పండిట్ జగన్నాథ్ ప్రసాద్ వద్ద సంగీత పాఠాలు నేర్పించారు. ఆ సంగీత పండిట్ వద్దకు హిందీ సినిమా పరిశ్రమకు చెందిన వాళ్లు వచ్చిపోతూ వుండేవారు. దర్శకుడు వీరేంద్ర దేశాయ్ ముఖేష్‌ను చూసి 1941లో 'నిర్దోష్' అనే సినిమాలో హీరోగా పరిచయం చేశాడు. ముఖేష్ సరసన నళిని జయవంత్ హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాలో ముఖేష్‌ది ఒక గాయకుడి పాత్ర. నీలకంఠ తివారి పాట రాయగా, అశోక్ ఘోష్ స్వరపరచిన 'దిల్ హి బుఝా హువా హెూ తో ఫసి–యే–బహార్ క్యా' అనే పాటను ముఖేష్ తొలిసారి పాడారు. రెండవ సినిమా వి.సి. దేశాయ్ నిర్మించిన 'ఆదాబ్ అర్'లో కూడా నళిని జయవంత్ సరసనే హీరోగా ముఖేష్ నటించారు. తర్వాత రామ్ దర్యాని దర్శకత్వంలో వచ్చిన 'దుఃఖ్ సుఖ్' (1942) సినిమాలో హీరోగా సితారాదేవి సరసన నటించారు. ఖేమ్ చంద్ ప్రకాష్ సంగీత దర్శకత్వం వహించిన ఈ సినిమాలో సితారాదేవితో కలిసి రెండు యుగళ గీతాలు పాడారు. 'అబ్ దేర్ న కర్ సాజన్ పూలోం సే జో మిల్నా హై, మేరీ అటరియా పే ఆజావో పరదేశి పంఛీ' అనే ఈ రెండు పాటలు పాపులర్ అయ్యాయి. రాజకపూర్‌తో సాన్నిహిత్యం పెరిగిన తర్వాత 'ఆహ్' సినిమాలో క్యారేజ్ డ్రైవర్‌గా ముఖేష్ ఒక అతిథి పాత్రలో కనిపించారు. తర్వాత ముఖేష్ నేపథ్య గాయకుడిగా స్థిరపడాలని నిర్ణయించుకొని ఆ దిశగా అడుగులు వేశారు. గాయక నటుడు కె.ఎల్.సైగల్‌కు ముఖేష్ వీరాభిమాని. నేపథ్య గాయకుడుగా పరిచయమైన తొలిరోజుల్లో సైగల్ పంధాను ముఖేష్ అనుకరించే ప్రయత్నం చేసేవారు. నిజానికి సైగల్ ముఖేష్ పాడిన 'దిల్ జల్తా హై' పాటను విని ఆ కొత్త గళాన్ని హిందీ చిత్రసీమకు దొరికిన ఆణిముత్యంగా శ్లాఘించారు. దిలీప్ కుమార్ మహమ్మద్ రఫీని నేపథ్య గాయకుడుగా ఇష్టపడితే, ముఖేష్ రాజ్‌కపూర్‌కు ఆస్థాన గాయకుడయ్యారు. తోటి గాయకుల గళాలతో పోలిస్తే ముకేష్ గొంతుక ప్రత్యేకంగా వుంటుంది. ఆ ప్రత్యేకత అభిమానుల్ని ఆకట్టుకుని మైమరపించే సమ్మోహన అస్త్రంగా మారింది. నేపథ్య గాయకుడిగా శంకర్ జైకిషన్ సంగీత దర్శకత్వంలో ముఖేష్ 133 పాటలు పాడితే, కళ్యాన్ జీ ఆనంద్ జీ ఆధ్వర్యంలో 99 పాటలు పాడారు. ముఖేష్ గెలుచుకున్న నాలుగు ఫిలింఫేర్ బహుమతుల్లో మూడు సినిమాలకు శంకర్ జైకిషనే సంగీత దర్శకులు కావడం విశేషం. అవి 'సబ్ కుచ్ సీఖా హమ్ నే' (అనారి –రాజకపూర్), 'సబ్ సే బడా నాదాన్ వహీ హై' (పెహచాన్ %–% మనోజ్ కుమార్), 'జై బోలో బేయిమాన్ కి' (బేయిమాన్– మనోజ్ కుమార్), 'కభీ కభీ మేరె దిల్ మే ఖయాల్ ఆతా హై' (కభీ కభీ %–% అమితాబ్ బచన్) పాటలు. 1974లో సలీల్ చౌదరి సంగీతం సమకూర్చిన 'రజనీగంధ' సినిమాలో ముఖేష్ పాడిన 'కహి బార్ యూ హి దేఖా హై' పాటకు జాతీయ బహుమతి లభించింది. ముఖేష్ మొత్తం మీద 1300 పాటలు పాడారు. ఒక నాటి మేటి క్రికెటర్లు భగవత్ సుబ్రహ్మణ్య (బి.ఎస్) చంద్రశేఖర్ , సునీల్ మనోహర్ గవాస్కర్, సయ్యద్ కిర్మాణి, గుండప్ప విశ్వనాథ్‌లకు ముఖేష్ పాటలంటే ఎంతో ఇష్టం. డ్రెస్సింగ్ రూమ్‌లో స్ఫూర్తి పొందాలని వాళ్లు ముఖేష్ పాటలు లో గొంతుకలలో హమ్ చేసేవారు. అమెరికా పర్యటనలో వుండగా ముఖేష్‌కు గుండెనొప్పి వచ్చింది. డెట్రాయిట్ (మిచిగన్ రాష్ట్రం)లోని హెూటల్ రూమ్‌లో ముఖేష్ తన 53వ (27 ఆగస్టు 1976) ఏట అసువులు బాశారు. "ముఖేష్ భయ్యాకు వచ్చిన మంచి పాటలు నాకు రాలేదు. ఆయన యెంత అదృష్టవంతుడో" అని కిషోర్ కుమార్ ఓ సందర్భంలో అన్నాడట. ముకేష్ అంటే రాజ్ కపూర్, రాజ్ కపూర్ అంటే ముకెష్ గా సాగింది వాళ్లిద్దరి అనుబంధం. అందుకే ముకేష్ మరణంతో, రాజకపూర్... 'నా గొంతు మూగవోయింది. నా ఆరో ప్రాణం గంగలో కలిసింది' అంటూ రోదించారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# సామాజిక న్యాయ యాత్రలో కాంగ్రెస్ సాహస యత్నం...బీసీలకు 42% రిజర్వేషన్ నిర్ణయం...

## సామాజిక సమానత్వ స్వప్నం - న్యాయపర పరీక్షల మధ్య కాంగ్రెస్ ధృఢ సంకల్పం




భారత దేశంలో రిజర్వేషన్ల వ్యవస్థ స్వాతంత్ర్యానంతరం సామాజిక న్యాయం సాధనకు ఒక ప్రధాన సాధనంగా నిలిచింది. ముఖ్యంగా సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు సమాన అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో రాజ్యాంగం రిజర్వేషన్లను అనుమతించింది. తాజాగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా, సామాజికంగా ప్రాధాన్యమైనదిగా కనిపించినా, అది చట్టపర, న్యాయపర పరిమితుల కఠిన పరీక్షను తప్పనిసరిగా ఎదుర్కోవలసి ఉంటుంది. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 15, 16 ప్రకారం విద్యా, ఉద్యోగ అవకాశాల్లో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వవచ్చు. కానీ ఈ చర్యలు సమానత్వ హక్కును ఉల్లంఘించ రాదు. అందుకే సుప్రీంకోర్టు తీర్పులు అత్యంత ప్రాధాన్యంగా మారాయి. 1992లో ఇంద్ర సాహ్నీ కేసులో సుప్రీంకోర్టు రిజర్వేషన్లు మొత్తం 50 శాతం మించ కూడదని స్పష్టం చేసింది. రిజర్వేషన్లు శాశ్వత పరిష్కారం కాదని, తాత్కాలిక సహాయక చర్యలుగా మాత్రమే ఉండాలని తీర్పు చెప్పింది. తరువాత 2019లో కేంద్రం ఆర్థికంగా బలహీన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగ సవరణ చేసింది. కానీ 50 శాతం పరిమితి ఇప్పటికీ రాజ్యాంగ మౌలిక నిర్మాణంలో భాగమని కోర్టు పునరుద్ఘాటించింది. 2021లో మహారాష్ట్రలో మరాఠా వర్గానికి ప్రత్యేకంగా రిజర్వేషన్ కల్పించగా, మొత్తం రిజర్వేషన్లు 60 శాతం దాటాయి. దీనిని సుప్రీంకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర ప్రభుత్వాలు స్వయంగా కుల గణన చేయలేవని, ఆ అధికారం కేంద్రమే కలిగినదని స్పష్టం చేసింది. ఈ తీర్పు తరువాత 50 శాతం పరిమితి మరింత బలమైన న్యాయపర అవరోధంగా నిలిచింది. రాష్ట్రాల అనుభవాలు కూడా దీనిని బలపరుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రయత్నించినా, 50 శాతం పరిమితి కారణంగా కేంద్ర ఆమోదం లభించలేదు. ఆంధ్ర ప్రదేశ్‌లో కాపులను బీసీ జాబితాలో చేర్చాలని చేసిన ప్రయత్నం కూడా ఇదే కారణంతో అమలులోకి రాలేదని ఉదాహరణలు చూపుతున్నాయి. కేవలం రాష్ట్రం చట్టం చేస్తే సరిపోదుబీ కేంద్ర అనుమతి, రాజ్యాంగ సవరణ, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు తప్పనిసరిగా అనుసరించాలి. కాబట్టి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలంటే మొదట రాష్ట్ర శాసనసభలో చట్టం ఆమోదం పొందాలి. ఆ తరువాత గవర్నర్, రాష్ట్రపతి ఆమోదం అవసరం. ముఖ్యంగా 50 శాతం పరిమితిని ఎత్తివేయాలంటే రాజ్యాంగ సవరణ తప్పనిసరి. ఆ సవరణ కూడా సుప్రీంకోర్టు పరీక్షను తప్పని సరిగా ఎదుర్కోవాలి. ఈ దిశగా కాంగ్రెస్ పార్టీ అనుభవజ్ఞులైన న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటూ ముందుకు సాగుతుందని పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. దీనివల్ల చట్టపరమైన ఆటంకాలను తగ్గించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నేతలు స్పష్టం చేస్తున్నారు. సామాజిక వాస్తవాల పరంగా చూస్తే బీసీలు దేశ జనాభాలో అత్యధిక వర్గమని అనేక అధ్యయనాలు నిర్ధారించాయి. 2023లో బీహార్‌లో జరిగిన కుల గణనలో బీసీలు 63 శాతం ఉన్నారని వెల్లడైంది. దేశవ్యాప్తంగా కూడా బీసీలు జనాభాలో సగానికి మించిన వారని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో బీసీ రిజర్వేషన్ పెంపు డిమాండ్ బలపడుతోంది. కానీ అది నేరుగా అమలు కావాలంటే కేంద్ర ఆధ్వర్యంలో కుల గణన జరగడం, బీసీల వెనుకబాటు తనాన్ని శాస్త్రీయ ఆధారాలతో నిరూపించడం, 50 శాతం పరిమితిని తొలగించేందుకు రాజ్యాంగ సవరణ చేయడం, అంతేకాదు రిజర్వేషన్లతో పాటు విద్య, ఉపాధి, ఆర్థిక వనరులలో బీసీలకు ప్రత్యేక పథకాలు రూపకల్పన చేయడం తప్పనిసరి. కాంగ్రెస్ పార్టీ నిర్ణయం రాజకీయంగా బీసీ ఓటు బ్యాంక్‌ను ఆకర్షించే వ్యూహంగా ఉన్నా, న్యాయపర పరిమితులను అధిగమించకుండా ఇది ఆచరణలోకి రావడం కష్టసాధ్యం. వాస్తవానికి బీసీల శక్తివంతీకరణకు చట్టపర, న్యాయబద్ధ చర్యలతో పాటు ఆర్థిక%–%విద్యా అవకాశాల విస్తరణే ప్రధాన మార్గం. కేవలం రిజర్వేషన్లే కాక సమగ్ర అభివృద్ధి చర్యల ద్వారానే నిజమైన సామాజిక సమానత్వం సాధ్యమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 42 శాతం బీసీ రిజర్వేషన్ల నిర్ణయం సామాజిక న్యాయం వైపు అడుగైనా, అది ఇంద్ర సాహ్నీ తీర్పు, మరాఠా కేసు తీర్పు, రాష్ట్రాల గత అనుభవాల వెలుగులో తప్పనిసరిగా కఠిన న్యాయపర పరీక్షను ఎదుర్కొంటుంది. చట్ట, న్యాయ పరిమితులలో ఉండకపోతే లక్ష్యం నెరవేరదు. కానీ కుల గణన, రాజ్యాంగ సవరణ, ప్రత్యేక అభివృద్ధి పథకాల సమన్వయం జరిగి న్యాయ నిపుణుల సూచనలతో ముందుకు సాగితేనే బీసీలకు వాస్తవ ప్రయోజనం కలుగుతుంది.


**రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇం డిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**




పాకిస్థాన్‌కు సున్నితమైన సమాచారం చేరవేస్తూ దొరికిపోయిన సీఆర్‌పీఎఫ్ అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్ జాట్‌కు పెద్దసంఖ్యలో మన సైన్యం, పారామిలటరీ, ప్రభుత్వ అధికారులతో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. అతడి ఫోన్‌లో 15 మంది నంబర్లను దర్యాప్తు బృందం గుర్తించిందని ఓ ఆంగ్లపత్రిక కథనంలో పేర్కొంది. వీరిలో నలుగురు ఆర్మీ, నలుగురు పారామిలటరీ సిబ్బంది కాగా.. మిగిలినవారు ప్రభుత్వ అధికారులుగా తేలారు. జాట్‌ను మే 27న ఎన్ఐఏ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. దర్యాప్తు బృందాలు ప్రస్తుతం జాట్ ఫోన్‌ను విశ్లేషిస్తున్నాయి. దీనినుంచి అతడు ఇంటర్నెట్ కాల్స్ కూడా చేసినట్లు తెలుస్తోంది. అతడు పాకిస్థాన్‌లో సలీం అనే ఆపరేటివ్‌తో టచ్‌లో ఉన్నాడు. జాట్‌తో మాట్లాడేందుకు వాడే ఫోన్‌లోని సిమ్‌కార్డ్‌ను కోల్‌కతా నుంచి ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. దాని యాక్టివేషన్ ఓటీపీని కూడా అతడు లాహెూర్‌లోని పాక్ ఆపరేటివ్‌తో పంచుకొన్నాడు. సదరు కోల్‌కతా వ్యక్తి పాక్ జాతీయురాలిని పెళ్లి చేసుకొన్నాడు. ఆ తర్వాత అక్కడికి వెళ్లి స్థిరపడ్డాడు. ఏటా రెండుసార్లు కోల్‌కతా వెళ్లి వస్తుంటాడని గుర్తించారు. ఇక మోతీ రామ్ జాట్ నుంచి అత్యంత సున్నితమైన సమాచార పత్రాలను సదరు లాహెూర్ ఆపరేటివ్ తెప్పించుకొన్నాడు. ఇందుకోసం అత్యధికంగా రూ.12,000 వరకు చెల్లించాడు. ఆ డబ్బు భారత్‌లోని దిల్లీ, మహారాష్ట్ర, హరియాణ, యూపీ, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అస్సాం, వెస్ట్‌బెంగాల్‌లోని వివిధ ఖాతాల నుంచి జమయ్యేవి. ఈ నగదు పంపించే వారిలో ఒకరి పేరు షెహజాద్‌గా గుర్తించారు. అతడిని యూపీ పోలీసులు మే లోనే అరెస్టు చేశారు. అతడు పాకిస్థాన్ నుంచి దుస్తులు, సుగంధ ద్రవ్యాలు, కాస్మోటిక్స్ స్మగ్లింగ్ చేసి విక్రయించేవాడు. అయితే షెహజాద్ వాదన భిన్నంగా ఉంది. తాను రైల్లో దిల్లీ నుంచి పంజాబ్ వెళుతున్న సమయంలో తోటి ప్రయాణికుడు ఒకరు జాట్ నెంబర్‌కు రూ.3,500 పంపాల్సిందిగా కోరి.. తనకు ఆ మొత్తాన్ని నగదు రూపంలో ఇచ్చాడని చెబుతున్నాడు.

# ప్రపంచ రికార్డుల ప్రస్థానానికి ఆరంభం: గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ - 1955 తొలి సంచిక

## 1955, ఆగస్టు 27...గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక వెలువడిన దినం




1955 ఆగస్టు 27న బ్రిటన్‌లో వెలువడిన గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ తొలి సంచిక, మానవ చరిత్రలో ఒక కొత్త అధ్యాయం రాసింది. ఇప్పటి వరకు వ్యక్తుల వ్యక్తిగత కీర్తి, దేశాల ప్రత్యేకతలు, ప్రకృతి అద్భుతాలు విడివిడిగా పత్రికల్లో, పుస్తకాలలో నమోదు అయ్యేవి. కానీ వాటిని ఒకే చోట సమీకరించి, శాస్త్రీయంగా వర్గీకరించి, ప్రజలకు సులభంగా అందించే ప్రయత్నం ఇదే తొలిసారి. ఆ తొలి సంచికతోనే ఈ పుస్తకం ప్రపంచ వ్యాప్తంగా అపూర్వ ఆదరణ పొందింది. కాలక్రమేణా ఇది కేవలం ఒక పుస్తకమే కాకుండా, మానవ ప్రతిభ, కృషి, కల్పన, విచిత్రతలకు ప్రతిబింబంగా మారిన వేదికగా నిలిచింది. ఈ ఆలోచనకు బీజం 1951లో ఐర్లాండ్‌లో వేసిన ఒక వేట సంఘటన లో పడింది. గిన్నిస్ బ్రూవరీస్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ హ్యూ బీవర్, తన మిత్రులతో కలిసి వేటలో పాల్గొన్నప్పుడు "యూరప్‌లో అత్యంత వేగంగా ఎగిరే పక్షి ఏది?" అన్న ప్రశ్నపై వాదన ప్రారంభమైంది. వారు అందుబాటులో ఉన్న పుస్తకాలు తిరగేసినా తగిన ఆధారాలతో కూడిన సమాధానం దొరకలేదు. ఈ సంఘటన బీవర్ మదిలో ఒక వినూత్న ఆలోచనకు దారితీసింది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ప్రశ్నలకు, వాదనలకు ముగింపు పలికి, సమగ్ర సమాచారం అందించే ఒక గ్రంథం అవసరమని ఆయన గ్రహించారు. తన ఆలోచనను ఆచరణలోకి తీసుకు వెళ్లేందుకు బీవర్ లండన్‌లో గణాంక సేకరణలో ఖ్యాతి పొందిన కవల సోదరులు నోరిస్ మెక్‌విర్టర్, రాస్ మెక్‌విర్టర్‌లను సంప్రదించాడు. వీరు అప్పటికి ఫాక్ట్ ఫైండర్స్ ఏజెన్సీ పేరిట సమాచార సేకరణ సంస్థను నడుపు తున్నారు. గిన్నిస్ సంస్థ ఆర్థిక సహకారంతో ఈ సోదరులు విస్తృతంగా పరిశోధనలు చేసి, వివిధ రంగాల నుంచి రికార్డులను సేకరించారు. క్రీడలు, ప్రకృతి, శాస్త్రం, సాంకేతికం, మానవ ప్రతిభ, కళలు, వినోదం వంటి విభిన్న విభాగాల్లోని విశేషాలను గణాంకాలతో సమీకరించి, పుస్తక రూపంలో కూర్చారు. అనేక నెలల శ్రమతో సిద్ధమైన ఈ గ్రంథం 1955 ఆగస్టు 27న లండన్ ఫ్లీట్ స్ట్రీట్‌లో విడుదలైంది. 197 పేజీలతో వెలువడిన ఆ తొలి సంచిక అద్భుతమైన విజయాన్ని సాధించింది. విడుదలైన మొదటి రోజే అది ప్రజల దృష్టిని ఆకర్షించింది. నాలుగు నెలల వ్యవధిలోనే అది బ్రిటన్‌లో అత్యధికంగా అమ్ముడైన నాన్–ఫిక్షన్ పుస్తకంగా నిలిచింది. ఆ సంవత్సరం క్రిస్మస్ సీజన్ నాటికి దాదాపు ప్రతి ఇంటికి చేరేంతగా అది ప్రాచుర్యం పొందింది. ఆ తొలి సంచికలోనే అనేక ఆసక్తికరమైన రికార్డులు చోటు చేసుకున్నాయి. అమెరికాకు చెందిన రాబర్ట్ వాడ్లో 8 అడుగులు 11 అంగుళాల ఎత్తుతో అత్యంత పొడవైన మనిషిగా గుర్తింపు పొందాడు. భారత దేశానికి చెందిన గుల్మ్ మహమ్మద్ కేవలం 57 సెంటీమీటర్ల ఎత్తుతో అత్యంత చిన్న మనిషిగా నమోదు అయ్యాడు. బ్రిటన్‌లో నడిచిన "మల్లార్డ్" స్టీమ్ లోకోమోటివ్ గంటకు 126 మైళ్ళ వేగంతో ప్రపంచం లోనే వేగవంతమైన రైలు కీర్తి సాధించింది. కాలిఫోర్నియా లోని బ్రిసిల్ కోన్ పైన్ సుమారు 4,000 ఏళ్ల వయసుతో అత్యంత పాత వృక్షంగా నిలిచింది. ప్రపంచం లోనే ఎత్తైన భవనం న్యూయార్క్ లోని "ఎంపైర్ స్టేట్ బిల్డింగ్"గా పేర్కొనబడింది. ప్రపంచ వ్యాప్తంగా అత్యధికంగా ముద్రించ బడిన పుస్తకంగా బైబిల్ నమోదు అయింది. ఇవన్నీ పాఠకులను ఆకర్షించడమే కాకుండా, భవిష్యత్తు సంచికల పునాది వేయించాయి. ఈ పుస్తకం వెలువడిన రెండవ సంవత్సరానికే, 1956లో అమెరికాలో ప్రత్యేక సంచిక విడుదలైంది. తర్వాత ఫ్రాన్స్, జర్మనీ, జపాన్ తదితర దేశాల్లోనూ అనువాదాలు వచ్చాయి. కేవలం పది సంవత్సరాల్లోనే 3.5 మిలియన్ కాపీలు అమ్ముడై, ఒక అద్భుత ప్రచురణా చరిత్రను సృష్టించింది. 1960ల నాటికి ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ తాజా రికార్డులను సేకరించడం ప్రారంభమైంది. కాలక్రమేణా రికార్డులను సేకరించడం, ధృవీకరించడం శాస్త్రీయ ప్రమాణాలతో కూడిన కఠిన ప్రక్రియగా మారింది. ఈ గ్రంథం ప్రభావం విశేషం. మానవులలోని పోటీ భావన, కృషి, విశ్వాసం, ప్రతిభను వెలికి తీసింది. అనేక మంది వ్యక్తులు, సంస్థలు గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించాలనే తపనతో కొత్త రికార్డులు సృష్టించేందుకు ప్రేరణ పొందారు. ఈ ప్రస్థానం కేవలం రికార్డుల సేకరణకే పరిమితం కాకుండా, మానవ సృజనాత్మకతకు, ధైర్యానికి, పట్టుదలకు వేదికగా నిలిచింది. నేడు గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పేరుతో ఈ పుస్తకం 100కుపైగా దేశాల్లో, 20కుపైగా భాషల్లో ప్రచురించ బడుతోంది. ప్రతి సంవత్సరం కొత్త సంచిక వెలువడుతూ లక్షలాది కాపీలు అమ్ముడవుతున్నాయి. పుస్తకం మాత్రమే కాదు, టెలివిజన్ కార్యక్రమాలు, వెబ్‌సైట్లు, సోషల్ మీడియా వేదికల ద్వారా కూడా విశేష ఆదరణ పొందుతోంది. 1951లో ఒక వేట ప్రయాణంలో పుట్టిన చిన్న ఆలోచన, 1955లో పుస్తక రూపంలో ఆవిష్కృతమై, నేడు ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మందిని ఆకర్షించే అంతర్జాతీయ వేదికగా మారింది. గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ పుస్తకం కేవలం గణాంకాల సంకలనం మాత్రమే కాదు, మానవ కల్పనాశక్తి, కృషి, ప్రతిభ, ధైర్యానికి ప్రతిబింబం. ఇది ప్రపంచ అద్భుతాలను ఒకే అద్దంలో చూపించే చరిత్రాత్మక గ్రంథంగా, నేటికీ అప్రతిహతమైన ఆదరణతో కొనసాగుతోంది. **రామ కిష్టయ్య సంగన భట్ల సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదు: రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్



విశాఖపట్నం: ఆపరేషన్ సిందూర్ ఇంకా ముగియలేదని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ అన్నారు. కొత్తగా తయారు చేసిన యుద్ధ నౌకలు 'ఉదయగిరి(ఎఫ్35)', 'హిమగిరి(ఎఫ్34)'లను విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ సింగ్ జాతికి అంకితం చేశారు. ఈ నౌకలను డిజైన్, స్టెల్త్, ఆయుధాలు, సెన్సార్ వ్యవస్థల్లో అత్యాధునిక సాంకేతికతో తయారు చేశారు. దేశంలోని వేర్వేరు షిప్‌యార్డులలో నిర్మించిన రెండు ఫ్రంట్‌లైన్ సర్ఫేస్ యుద్ధ నౌకలను ఒకేసారి జాతికి అంకితం చేయడం ఇదే ప్రథమం. బ్లూ వాటర్ పరిస్థితుల్లో రక్షణ బాధ్యతలను నిర్వర్తించే సామర్థ్యం ఈ నౌకల సొంతం. ఈ రెండు నౌకలు బహుళ పాత్రలు పోషించనున్నాయని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. "స్వదేశీ యుద్ధనౌక సామర్థ్యానికి ఈ నౌకలు ప్రతీక. ఆత్మనిర్భర్ భారత్‌కి ఇవి నిదర్శనం. సాంకేతిక పరిజ్ఞానం ఈనౌకల తయారీలో ప్రతిబింబిస్తోంది. 2050 నాటికి 200 యుద్ధనౌకలు నిర్మాణం చేస్తాం" అని రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు.

చురకలు

## సంపాదకీయం

### డ్రాగన్ ఫేక్ మార్కెటింగ్... హెచ్.క్యూ-9 సంగతేమిటి చైనా?

'నీ ఫ్రెండ్ ఎవరో చెప్పు నీ గురించి నేను చెబుతాను' అని అంటారు. ఈ విషయంలో పాకిస్థాన్ ని అడిగినా, చైనాను అడిగినా.. ఇరు దేశాల గురించి ఈజీగా చెప్పెయ్యొచ్చు. నవ్విపోదురు గాక నాకేటి సిగ్గు అన్న చందంగా ఆ రెండు దేశాలు చేస్తోన్న ఫేక్ ప్రచారాలు, ఫేక్ మార్కెంటింగ్ లు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. అదేమిటనేది ఇప్పుడు చూద్దామ్..! అవును... ఇటీవల భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్.. పాక్ లోని ఉగ్రశిబిరాలను లక్ష్యంగా చేసుకుని దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా... భారత వైమానిక దళం 23 నిమిషాల్లోనే పాక్ లోని 9 ఉగ్రశిబిరాలను నేలమట్టం చేసింది. ఆ సమయంలో.. పాకిస్థాన్ లోని గగనతల రక్షణ వ్యవస్థలు హెచ్.క్యూ-9 జామ్ అయిన పరిస్థితి. దీంతో.. ఆ 23 నిమిషాల్లోనూ పాకిస్థాన్ గగనతలంలో భారత క్షిపణులు విధ్వంసం సృష్టించాయి. ఆ దేశానికి ఊహించని నష్టాన్ని కలిగించాయి. ఈ సమయంలో రక్షణగా నిలవాల్సిన చైనా మేడ్ హెచ్.క్యూ-9 క్షిపణి వ్యవస్థలు పూర్తిగా విఫలమయ్యాయి. వాటి ఎయిర్ బేస్ లు గట్టి దెబ్బలే తిన్నాయి. .భారత్ కు చెందిన ఒక్క క్షిపణిని కూడా అవి ఆపలేకపోయాయి. ఈ నేపథ్యంలోనే రహీం యార్ ఖాన్ ఎయిర్ బేస్, నూర్ ఖాన్ ఎయిర్ బేస్, రఫీకి ఎయిర్ బేస్ సహా 11 పాక్ ఎయిర్ బేస్ లు తీవ్రంగా ధ్వంసమయ్యాయి. దీనిపై ఇటీవల రాజస్థాన్ సభలో స్పందించిన ప్రధాని మోడీ.. భారత దాడి తర్వాత రహీం యూర్ ఖాన్ ఎయిర్ బేస్ ఇంటెన్సివ్ కేర్ లోకి వెళ్లిందని వ్యాఖ్యానించిన పరిస్థితి. ఈ క్రమంలో భారత్ చేపట్టిన ఆపరేషన్ అనంతరం పాక్ కొన్ని ఫేక్ ప్రచారాలకు తెరలేపింది. ఇందులో భాగంగా.. భారత్ కు చెందిన యుద్ధ విమానాలను కూల్చేశామని చెప్పుకొంది. దీనిపై ఆ దేశ రక్షణ మంత్రిని మీడియా నిలదీస్తే... సోషల్ మీడియాలో ఆ మేరకు ప్రచారం జరుగుతుందని చెప్పుకొన్న పరిస్థితి. ఈ నేపథ్యంలో చైనా ఫేక్ మార్కెంటింగ్ కు తెరలేపింది. ఇందులో భాగంగా... ఆపరేషన్ సిందూర్ సమయంలో భారత్ ఫైటర్ జెట్లను పాకిస్థాన్ పేల్చేసిందని.. ఆ సమయంలో తాము సరఫరా చేసిన జే-10సీ ఫైటర్ జెట్లనే పాక్ ఉపయోగించిందనే భ్రమను.. ప్రపంచం ముందు వాస్తవంగా ప్రజెంట్ చేయాలనుకుంటుంది చైనా. ఈ నేపథ్యంలో చైనా జే-10సీ ఫైటర్ జెట్లపై డాక్యుమెంటరీలు రూపొందిస్తోంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే... చైనా తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు భారత్ కు ఏ మేరకు నష్టం కలిగించిందనే సంగతి కాసేపు పక్కనపెడితే... పాక్ నమ్ముకున్న హెచ్.క్యూ-9 గగనతల రక్షణ వ్యవస్థ మాత్రం భారత క్షిపణులను ఏమాత్రం అడ్డుకోలేకపోయింది.. నేడు పాక్ లో 11 ఎయిర్ బేస్ లు ధ్వంసం అవ్వడానికి హెచ్.క్యూ-9 కారణం. అయితే... ఈ విషయాన్ని చైనా వ్యూహాత్మకంగా దాచే ప్రయత్నం చేస్తూ... తాము తయారు చేసిన జే-10సీ ఫైటర్ జెట్లు అద్భుతమైన పెర్ఫార్మెన్స్ చూపించాయని చెప్పుకుంటూ ఓ డాక్యుమెంట్ తీసి, ప్రపంచంతో నకిలీ మార్కెంటింగ్ చేయాలని భావిస్తోంది! ఇక్కడ గమనించాల్సిన మరో విషయం ఏమిటంటే... ఆపరేషన్ సిందూర్ అనంతరం భారత్ ఉపయోగించిన బ్రహ్మోస్ క్షిపణి, ఎస్-400 రక్షణ వ్యవస్థ గురించి ప్రపంచం మొత్తం చర్చించుకుటోన్న పరిస్థితి. మరోపక్క ఈ యుద్ధంలో పాకిస్థాన్ వాడిన ఆయుధాల్లో 80శాతం చైనా తయారు చేసినవే అని అంటున్నారు. దీంతో.. ప్రపంచ వ్యాప్తంగా చైనా రక్షణ పరిశ్రమ విశ్వసనీయతమపై ప్రశ్నలు తలెత్తాయి. ఈ నేపథ్యంలో.. తన ఆయుధాలను మరోమారు ప్రపంచం ముందు ప్రదర్శనకు పెట్టుకొంటుంది చైనా.

# సకల సంకట నివారకుడు వినాయకుడు



త్రిగుణాత్మకం స్వరూపుడు , త్రైమూర్త్య భావనతో విరాజిల్లుతున్న వినాయకుడు వైదిక కాలం నుండి భారతా వనిలో ఆది దైవ స్వరూపంగా ఉపాసించ బడుతున్నాడు . ప్రకృతిలో రజస్తమో గుణాది స్వరూపు డైన విఘ్నేశ్వరుని ' గుణేశుడు ' అని అభివర్ణించారు. కాలక్రమేణ గణేశుడు అయినాడు . గాణాపత్యం సంప్రదాయానుసారం గణము అనగా సత్య రజస్తమో గుణ సమ్మేళనం. ఈ త్రిగుణాధిపతి విఘ్నేశ్వరుడు పురాణేతిహాసాల బట్టి సకల దేవతా గణాలకు అధిపతి కనుక గణపతి సార్ధక నామధేయం కలిగింది. లింగ పురాణం ప్రకారం బలగర్వితులైన రక్కసులు, స్వర్గ లోకాన్ని ఆక్రమించి, దేవతలను అష్ట కష్టా లకు గురి చేయగా వారు పరమ శివుని ప్రార్ధించగా, ఆయన రాక్షస సంహారానికి గణపతిని సృష్టించి, రాక్షసులను సంహరించ మనగా , అందులో తన ప్రమేయం లేదని, ఆగ్రహించిన పార్వతి, పరమేశ్వరునిపై కోపాన్ని గణపతిపై ప్రదర్శించి, ఏనుగు తలతో , బాన కడుపు తో , వికార రూపుడై ఉండునటు శ పించగా, చింతా క్రాంతుడైన గణేశుని, శివు దూరడించి, సకల దేవత గణాధిపతిగా, సకల విఘ్న నివారణ దైవంగా అనుగ్రహించాడు. మరో కథనం ప్రకారం గజాసురుని సంహరించి, పరమేశ్వరుని అనుగ్రహంతో పార్వతి చేత పిండి బొమ్మగా చేయబడి, ప్రాణాలు కోల్పోయిన గణపతి, గణాసురుని తలతో పునరుజ్జీవితుడైనట్లు ప్రచారంలో ఉంది. పార్వతీ పరమేశ్వరులు విహరిస్తూ కొలనులో ఉండగా , గజదంపతుల శృంగారాన్ని చూచి మైమరచి, తాము అదే రూపాలతో క్రీడించగా గజముఖుడైన గణపతి ఆవిర్భవించినట్లు ఐతిహ్యం. గణపతి, పరమేశ్వరునికి తనయుడే కాకుండా విష్ణు రూపుడు కూడా. " శుక్లాం బరధరం విష్ణుం, శశివర్ణం" అన్న ప్రస్తుతి నిరంతరం పఠితమే. పృధ్వీతత్వం ప్రధానంగా కలవారు పరమేశ్వరుని, జలతత్వం కలవాడు గణపతిని, తేజస్తత్వం కలవారు దుర్గా మాతను, వాయుతత్వం కలవారు సూర్యుని, ఆకాశ తత్వం కలవారు విష్ణువు ను ప్రార్ధిస్తు ఉండగా , కేవలం ఒక దేవతా మూర్తి కి ఏ శుభకార్యంలో నైనా, తొలి పూజ గావించడం పాంచభౌతిక శరీరధారు లైన మానవులు ఆచరించే సంప్రదాయం, ప్రత్యేకం. సకల దేవతా మూర్తి యైన గణేశుని శుభకార్యాలో తొలి పూజార్హుని చేయడం సనాతన ఆచారం. భాద్రపద శుక్లపక్ష చవితి నాడు గజాసుర సంహారం చేసినందున ఆనాటి నుండే గజానన పూజ ప్రారంభ మైనట్లు కథనం. భాద్రపద శుద్ధ చవితినాడు గణా అధిపతియైన విఘ్నేశ్వరునికి యథా విధిగా ఏకవింశతి పత్రాలతో అర్చించి, తరించడం భారతా వనిలో తరతరాలుగా కొనసాగుతున్న సంస్కృతికి ప్రతీక. వినాయక చవితి జాతీయ సమైక్య పర్వదినంగా లో కమాన్య తిలక్ లాంటి నాయకులు నిర్వహించారు. భారత దేశంలోనే కాక , విదేశాలలోనూ వినాయకుని ఆరాధన ఉంది. 13 వ శతాబ్ది నాటి గణపతి విగ్రహం కిరీటా లంకృతునిగా జావాలో లభించింది. సంయాములో లభించిన విఘ్నేశ్వరుడు కూర్మ వాహనుడు. ఒక చేతిలో చింతామణిని ధరించి ఉండడం ఈ విగ్రహ ప్రత్యేకత. ఈ బొమ్మ ఉన్న వ్రాతప్రతి హనో యు లభించింది. జపాన్ సుమో యోధులు కుస్తీ ఫోజులో ఉన్న గణపతి ద్వయ విగ్రహం లభించింది. క్రీ.శ, 14వ శతాబ్దికి చెందిన గణపతి విగ్రహం కంబోడియాలో లభించగా, విద్యా ప్రదాతగా కొలిచే ఈ గణపతి చేతులలో పుస్తకం, గంటంగా ఉపయోగించే దంతం ఉన్నాయి. చైనా , జపాన్ లో లభ్యం కాబడిన గణేశ గ్రహాలు ఒక చేతిలో గొడలి, మరో చేతిలో కేరెట్ పటుకుని ఉండగా , వీటిని గర్భధాతు గణపతు లంటారు. శక్తితో కూడిన హేరంబ గణపతి విగ్రహం టిబెట్ లో లభ్యమైంది. హేరంబ గణపతి పంచభూతాల తత్వాన్ని సూచించే రూపంలో సింహాసనాసీనుడైన, నృసింహ గణపతి తత్వాల మేళవింపుగా అనాది కాలం నుండి పూజార్హమై ఉంది. ధన్వంతరిగా లంబోదరుడు ఉదర సంబంధ వ్యాధులను నయం చేసే దేవతగా కొలువ బడుతున్నాడు. అష్ట వినాయకులుగా ప్రసిద్ధి పొందిన దేవతా రూపాలు మహారాష్ట్రలో నెలకొని ఉన్నాయి.

వికటరాజ రూపంలో మోరేగావ్లో మయూరేశ్వరునిగా, పాలి గణపతి రూపంలో భల్లారే శ్వర్ లో లంబో దరునిగా , మాత్ లో వరద వినాయకునిగా, మహోదర రూపంలో ఓజార్ లో, విఘ్నేశ్వరునిగా విఘ్నరాజ రూపంలో లెన్యాద్రిలో , గిరిజాత్మజ రూపంలో ధూమ్రవర్ణునిగా, తేవూర్లో చింతా మణి రూపంలో వక్ర దంతునిగా , సిద్దిటేక్ లో సిద్ధి వినాయక రూపంలో సిద్దేశ్వర స్వామిగా , రంజన్ గావ్లో మహా గణపతి రూపంలో గజాననునికి మహారాష్ట్ర గణపతి ఆరాధన భూమిగా నిలచి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# విశ్వమంతా వినాయకుడు



విఘ్నాలను పోగొట్టేందుకు ఒక దేవతను పూజించడం అనేది మన దేశంలో మాత్రమే కాకుండా అన్ని ప్రాచీన నాగరికతల్లోనూ కనిపిస్తుంది. గ్రీకు వారు దర్శినస్ అని పిలిచినా, రోమన్లు జేనస్ అని, ఈజిప్షియన్లు గునీస్ అని పిలిచినా వారంతా వినాయక రూపాలే. భారతీయుల వినాయక ఆరాధనా సంప్రదాయాన్ని ప్రపంచం నలుమూలలా విస్తరింప చేశారు. ఒక చేతిలో గొడ్డలి, మరో చేతిలో క్యారెట్ పట్టుకున్న వినాయకుణ్ణి గర్భధాతు గణపతి అంటారు. ఈ గణపతి విగ్రహాలు చైనా, జపాన్ దేశాల్లో లభించాయి. ఆగ్నేయాసియా దేశాలలో భారతీయులకు వాణిజ్య సంబంధాలు ఉండడం వల్ల భారతదేశానికి వెలుపల కూడా మన నాగరికత విస్తరించింది. అందులో ప్రముఖంగా చెప్పుకోవలసింది గణపతి ఆరాధనను గురించే. కొలంబస్ కు ముందు నుంచి... ప్రాచీనకాలం నుంచే అమెరికాలో వినాయకుడి ఆరాధన ఉంది. దివాన్ చమన్ లాల్ తన 'హిందూ అమెరికా' అనే గ్రంథంలో కొలంబస్ అమెరికా ఖండాన్ని కనుగొనే ముందే (1492) హిందువులు అక్కడికి చేరారనీ, వినాయకుని ఆరాధించారని అభిప్రాయపడ్డారు. అమెరికా ఖండంలోని పెరూ, మెక్సికోలలో ఇంకా తెగకు చెందిన ఆదివాసులలో గణపతి ఆరాధన ఉన్నట్లు ఆధారాలు లభిస్తున్నాయి.

**లంకా ద్వీపంలో గణేశుడు..** శ్రీలంకలోని 'పోలిన్నరువ' సమీపంలోని శివాలయంలోని ఒక స్తంభంపైన చతుర్భుజాలు, చేతిలో కుడుమును కలిగి ఉన్న వినాయకుని శిల్పం ఉంది. కొలొంబోకు సుమారు 150 కిలోమీటర్ల దూరంలో 'కటర్ గమ్'లో శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం ఉంది. ఈ ఆలయంలో వినాయకునికి ప్రత్యేక సన్నిధి ఉంది. ఈ వినాయకుడిని హిందువులతో పాటు మహ్మదీయులు, క్రైస్తవులు కూడా పూజించడం విశేషం.

**ఏనుగుల దొర...** చైనా భాషలో వినాయకుడిని 'కువాన్ షి-ఆయేన్' అని పిలుస్తారు. ఇక్కడి శాసనాల్లో వినాయకుని ఏనుగుల దొరగా పేర్కొన్నారు. చైనాలో క్రీ.శ. 531 ప్రాంతానికి చెందిన వినాయకుని శిల్పం ఒకటి 'కుంగ్-హ్సియన్' ఆలయ గోడలపై లభించింది. అలాగే 'తుని హువాన్' గుహలోని గోడలపై వినాయకుని విగ్రహం కనిపిస్తుంది. వీటిలో వినాయకుడు ఒక చేతిలో కమలం, మరో చేత 'చింతామణి' ని ధరించి ఉన్నాడు. అలాగే ఇద్దరు వినాయకులు ఒకరినొకరు కౌగిలించుకున్న రూపంలోని ప్రతిమ కూడా లభించింది. ఈ కవల వినాయక ప్రతిమ జపాన్ వినాయక ప్రతిమను పోలి ఉన్నది.

**బౌద్ధంలో వినాయకుడు...** గణపతి ఆరాధన 10వ శతాబ్దం నాటికి బాగా విస్తృతమైనట్లు తెలుస్తోంది. 'హేరంబ గణపతి'ని నేపాల్ లో ఆరాధిస్తారు. ఇక్కడ అనేక గణేశ కాంస్య విగ్రహాలు లభ్యమయ్యాయి. ఇక్కడ వినాయకునికి మూషికవాహనంతో పాటు సింహం కూడా వాహనంగా కనిపిస్తుంది. కొన్ని విగ్రహాల్లో ఒక కాలి కింద సింహం, మరో కాలి కింద మూషికం ఉండగా, మరికొన్నింటిలో రెండు కాళ్ళ క్రింద రెండు ఎలుకలు ఉండడం కనిపిస్తుంది. కాగా, ఈ దేశంలో బుద్ధుడు రాజగృహం వద్ద తన శిష్యుడైన ఆనందుడికి గణపతినీ స్తుతించే గణపతి హృదయాన్ని ఉపదేశించినట్లు ప్రచారంలో ఉంది. బౌద్ధ ప్రచారానికి శ్రీలంకకు చేరుకున్న మౌర్య సామ్రాజ్య చక్రవర్తి అశోకుడి కుమార్తె అక్కడ వినాయకుడి ఆలయాన్ని కట్టించినట్లు నేపాల్ దేశంలో ప్రచారంలో వుంది.

**మూడు కన్నుల దేవర...** జావాలో అత్యంత ప్రాచీనకాలం నుంచే వినాయక ఆరాధన ఉన్నది. జావాలోని గణపతి విగ్రహాల్లో 'డియాంగ్ ప్లే బ్యూ'లోని విగ్రహం ప్రధానమైంది. 13వ శతాబ్ది నాటి ఈ విగ్రహం కిరీటాలంకృతునిగా కనిపిస్తుంది. బాలిద్వీపంలో 8, 9 శతాబ్దాలనాటి వినాయకుడి విగ్రహాలు అనేకం లభించాయి. వీటికి మూడు కన్నులు ఉండడం విశేషం.

**సుమో యోధుడు...** జపాన్ లో వినాయకుని 'కాంగితెన్', 'వినాయక్ శోదెన్' అని వ్యవహరిస్తారు. కాంగి తెన్' అంటే శుభాన్నీ, సమృద్ధినీ ప్రసాదించేవాడు అని అర్థం. క్రీ.శ 806లో 'కోబోదాయిష్" అనే బౌద్ధమతస్తుడు జపనీయులకు వినాయకుడ్ని పరిచయం చేశారు. ఇద్దరు వినాయకులు ఒకరినొకరు కౌగిలించుకున్న రూపంలోని ప్రతిమలున్నాయి. రెండు, నాలుగు ఆరు, చేతులు కలిగి, వివిధ భంగిమలలో ఉన్న వినాయక విగ్రహాలు కూడా కనిపిస్తాయి. భక్ష్యపాత్ర, గొడుగు, ధనుర్బాణాలు, కందమూలాలను వినాయకుడు చేతులలో ధరించి కనిపిస్తాడు. సుమో యోధులను పోలిన విగ్రహాలు కూడా జపాన్ దేశంలో దర్శనమిస్తాయి.

**ఇస్లాం దేశాల్లో...** ఆఫ్ఘనిస్తాన్లోని కొన్ని ప్రాంతాల్లో నేటికీ గణపతి ఆరాధన సాగుతూ ఉంది. కాబూల్ నగరానికి దగ్గరలో ఉన్న 'సకరేధర్' లో వినాయకుడి విగ్రహం లభించింది. నిలుచున్న ఈ వినాయకునికి ఇరువైపులా రెండు గణాలు కనిపిస్తాయి. చతుర్భుజాలు కలిగిన వినాయకుడు తన రెండు చేతులనూ ఈ గణాలపై ఉంచాడు. ఈ విగ్రహం గుప్తులు లేదా కుషాణుల కాలం నాటిదై ఉంటుందని చరిత్రకారుల భావన.

**నాలుగు తలల గణపతి...** ప్రాచీన కాలం నుంచీ మన దేశంలో సాంస్కృతిక సంబంధాలను కలిగిన కాంబోడియలో గణపతి ఆరాధన అప్పటి నుంచే కనిపిస్తున్నది. 6వ శతాబ్దం నాటి అంకార్ వట్ శాసనం గణపతి ఆలయానికి బానిసలను దానం చేసినట్లు చెబుతున్నది. కాంబోడియాలోని 'చో చుంగ్ డ్రి' లో గణపతి ఆలయ శిథిలాలు ఇంటికి కనిపిస్తున్నాయి. 'కుక్ ట్రాప్యాంగ్ కుల్' దేవాలయంలో వినాయకుని విగ్రహాలు ఉన్నాయి. 'స్టేక్ థార్స్ కెండల్' మ్యూజియంలో నాలుగు తలల గణపతి విగ్రహం ఉంది.

**వియత్నాంలో...** ఈ దేశంలో గణపతి ఆలయాలను నిర్మించినట్లు 8వ శతాబ్దం నాటి శాసనాల్లో ఉంది. లభించిన అనేక వినాయకుడి విగ్రహాల్లో 'ద్విభుజ గణపతి' విగ్రహం అపూర్వమైంది. ఒక చేతిలో మోదకపాత్ర, మరొక చేతిలో చేతికర్రను ధరించిన వినాయకునికి తల బోడిగా ఉండడం, యజ్ఞోపవీతం, ఆభరణాలు లేకపోవడం దీని ప్రత్యేకతగా చెప్పవచ్చు.

**ఇతర దేశాలలో...** మయన్మార్ (బర్మా)లో 11వ శతాబ్దం నాటికే గణపతి ఆరాధన ఉన్నట్లు తెలుస్తున్నది. రంగూన్ మ్యూజియంలో ఆరుచేతుల గణేశ ప్రతిమ ఉన్నది. థాయ్ లాండ్, బ్యాంకాక్ ఆలయంలోని వినాయక విగ్రహం జకార్తా మ్యూజియంలో గణేశ విగ్రహం గణేశారాధనకు నిదర్శనాలు. మంగోలియాలో నాట్య గణపతి విగ్రహాలు లభించాయి. ఇండోనేషియాలో గణపతి బొమ్మతో ఉన్న కరెన్సీ వాడకంలో ఉన్నది. సయామ్ లో లభించిన వినాయకుడు కూర్మ వాహనుడు. ఆయన చేతిలో చింతామణి ఉండడం ఒక విశేషం.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్... 9440595494**

# నిషేధానికి గురైన తొలి తెలుగు చిత్రం 'రైతుబిడ్డ' - ఆగస్టు 27 ...1939న విడుదలైన సినిమా



తెలుగు సినిమా చరిత్రలో ప్రభుత్వం ఆంక్షలకు, నిషేధానికి గురైన మొట్ట మొదటి చిత్రం 'రైతుబిడ్డ'. ఆ రోజుల్లో జమీందారీ వ్యవస్థకూ, విధానాలకూ వ్యతి రేకంగా ఈ చిత్రం చేయడం ఒక రకంగా పెద్ద సాహసమే. ఈ చిత్రంలో జమీందార్ల దౌర్జన్యాలను కళ్ళకు కట్టినట్టుగా చూపించారు గూడవల్లి రామబ్రహ్మం. ఆనాటి జమీందారీ గ్రామాలలో సన్న కారు రైతులు అనుభవిస్తున్న కడ గండ్లను, జమీందారుల అకృత్యాలను, ఈ సినిమాలో కళ్లకు కట్టినట్టుగా చిత్రీకరించాలని, ఈ విషయంలో ఎలాంటి అవాంతరాలు ఎదురైనా తట్టుకుని నిలబడాలని రామబ్రహ్మం ధృఢ నిశ్చయం చేసు కున్నారు. ఈ వాస్తవాన్ని జీర్ణించు కోలేని జమీందారులు ఆగ్రహించి, ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చి చివరికి ఆయా జమీందార్ల ప్రోద్భలంతో నిషేధింప చేశారు. బొబ్బిలి రాజా, వెంకటగిరి రాజా సినిమా నిర్మాత మీద పరువు నష్టం దావా వేస్తామని బెదిరించారు. తెలుగు చలన చిత్రాల్లోని కథా గమనానికి కొత్త స్పూర్తినిచ్చిన ఈ చిత్రంను లక్ష రూపాయలకు పైగా వ్యయంతో మద్రాసులోని ఎం.పి.పి.సి. స్టూడియో ప్రాంతంలో నిర్మించి 27-8-1939న విడుదల చేశారు. 'గూడవల్లి రామబ్రహ్మం... 'దున్నే వాడిదే భూమి', 'జమీందారీ విధానాలు పోవాలి' లాంటి అంశాలను ప్రాతిపదికగా చేసుకుని 'రైతుబిడ్డ' కథ సిద్ధం చేశారు. తాపీ ధర్మారావు నాయుడు, త్రిపురనేని గోపీచంద్ తో కలిసి 'రైతుబిడ్డ'కు మాటలు రాశారు. కొన్ని పాటలను తాపీ ధర్మారావు, సముద్రాల రాఘవాచార్య రాశారు. మల్లాది విశ్వనాథ కవిరాజు హాస్య సంభాషణలు సమ కుర్చారు. అప్పటికే రైతు ఉద్యమం మీద పాటలు రాసిన కొసరాజు రాఘవయ్య చౌదరిని రైతు ప్రతినిధి రామిరెడ్డి పాత్రకు ఎంపిక చేశారు. ప్రముఖ రైతు ఉద్యమ నాయకులు, నెల్లూరు. "జమీన్ రైతు' వార పత్రిక స్థాపకులు నెల్లూరు వెంకట్రామా నాయుడు గేయాలను, తుమ్మల సీతా రామమూర్తి పద్యాలను కూడా ఈ చిత్రంలో రామబ్రహ్మం వినియోగించు కున్నారు. కథానాయకుడైన రైతు పెద్ద నర్సిరెడ్డి పాత్రకు బళ్ళారి రాఘవను ఎంపిక చేసుకున్నారు. ఆయన భార్య పాత్రకు ప్రముఖ రంగస్థల నటి కొమ్మూరి పద్మావతి దేవి ఎంపికయ్యారు. ఆంధ్రకేసరి' టంగుటూరి ప్రకాశం పంతులు సోదరుని కుమార్తె 14 ఏళ్ల టంగుటూరి సూర్య కుమారిని రైతు కుమార్తె పాత్రకు తీసుకున్నారు. 1939 ఆగస్టు 27న 'రైతుబిడ్డ' ఆంధ్ర దేశంలో 11 కేంద్రాల్లో విడుదలైంది. అంతకు ముందే ఆ చిత్ర ప్రదర్శనను ఆపు చేయించాలని కొంత మంది జమీందార్లు న్యాయస్థానం ద్వారా 'స్టే ఆర్డర్' జారీ చేయించారు. కానీ, అప్పటికే సెన్సార్ బోర్డు వారు ఆ సినిమా ప్రదర్శనకు అనుమతి ఇవ్వడంతో సినిమా విడుదలకు ఎలాంటి ఇబ్బందీ కలగలేదు. వెంకటగిరి జమీందార్లు. 'రైతుబిడ్డ' చిత్రం ప్రింట్లు కొన్నింటిని తగలబెట్టించి ప్రదర్శనలను ఆపు చేయించడానికి ప్రయత్నించడంతో అల్లర్లు చోటు చేసుకున్నాయి. జమీందారీ వ్యవస్థలను రద్దు చేయాలని ప్రభుత్వం బిల్లు పెట్టిన కొన్నేళ్లకు ముందే రామబ్రహ్మం 'రైతు బిడ్డ'ను తీసి దర్శకుడిగా తానెంత ముందు చూపు గల వాడినో నిరూపించు కున్నారు. అందుకే మదరాసు అసెంబ్లీలో టంగుటూరి ప్రకాశంగా బిల్లు ప్రవేశ పెట్టడానికి 'రైతు బిడ్డ' సినిమా ఎంత గానో తోడ్పడిందని అప్పట్లో చెప్పుకునేవారు. 'మాలపిల్ల' సినిమాతో తెలుగు సినిమా సంగీతాన్ని ఒక మలుపు తిప్పిన భీమవరపు నరసింహారావు 'రైతుబిడ్డ'తో మరోసారి తన సత్తా చాటుకున్నారు. అలాగే జమీందారు అనుచరుడిగా రైతులను పీడించే ఖాసా సుబ్బన్న పాత్రలో ఆయన నటించారు. కొసరాజు పాటలు రాసి, నటుడుగా కూడా ఆయనకు తన పాత్రకు సంబంధించిన పాటలను తానే పాడుకున్నారు. బళ్లారి రాఘవ కీర్తిని మరింత పెంచింది ఈ సినిమా. ప్రసిద్ధ నృత్య దర్శకుడు వేదాంతం రాఘవయ్య ఈ చిత్రానికి నృత్య సారథ్యం వహించడమే కాక, దశావతార నృత్య సన్నివేశంలో నటించారు కూడా. గూడవల్లి రామబ్రహ్మం కూడా ఈ చిత్రంలో పత్రికా సంపాదకునిగా నటించారు. ప్రముఖ ఆర్ట్ డైరెక్టర్ మాగోఖలే ఈ సినిమా ద్వారానే ప్రవేశిం చారు. మద్రాసు ప్రావిన్స్ ప్రధాన మంత్రిగా వున్న (1930-32) బొల్లిని ముని స్వామి నాయుడికి ఈ చిత్రాన్ని అంకిత మిచ్చారు. ఆయన రైతు పరిరక్షణకు తనవంతు సహాయ సహకారాలు అంద జేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు



## మన మిరపకు విశ్వ 'తేజ'స్సు..!

ఖమ్మం : రాష్ట్రంలో మరో పదకొండు ఉద్యాన ఉత్పత్తులకు భౌగోళిక గుర్తింపు (జియోగ్రాఫికల్ ఐడెంటిఫికేషన్) పొందేందుకు కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం సన్నాహాలు చేస్తోంది. వీటిలో ఖమ్మం జిల్లాకు చెందిన 'తేజ' మిరప ఉండటం విశేషం. ఇక్కడ అత్యధికంగా సాగు చేస్తున్న ఈరకం మిరప వివిధ దేశాలకు ఎగుమతి అవుతోంది.

**పాతికేళ్ల ప్రస్థానం..**

సుమారు పాతికేళ్ల క్రితం తమిళనాడుకు చెందిన ఓ వ్యాపారి తేజ రకం విత్తనాలను తెచ్చి ఉమ్మడి ఖమ్మం జిల్లా రైతులతో ప్రయోగాత్మకంగా సాగు చేయించారు. అంతకుముందు పండించిన రకాలతో పోల్చితే దిగుబడులు అనూహ్యంగా పెరగటంతో రైతులు దీనిపై అసక్తి పెంచుకున్నారు. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో గతేడాది సుమారు 1.50 లక్షల ఎకరాల్లో పండించారు. తెలంగాణలో అత్యధికంగా ఖమ్మం జిల్లాలో తేజ రకం మిరప సాగవుతోంది. ఈ మిరపకు ఘాటు ఎక్కువగా ఉంటుంది. నాణ్యత బాగుంటుంది. ఎక్కువ రోజులు నిల్వ ఉంటుంది. కూరలు, ఔషధాలు, నూనె తయారీలో దీనిని అధికంగా వాడతారు. ఖమ్మం తేజ రకం మిరపకు భౌగోళిక గుర్తింపు లభిస్తే.. ప్రత్యేకత, నాణ్యత కారణంగా మార్కెట్‌లో మంచి ధర పలుకుతుంది. రైతులకు మేలు జరుగుతుంది. నకిలీ ఉత్పత్తులను నిరోధించేందుకు సహాయ పడుతుంది. **వివిధ దేశాలకు ఎగుమతి**



ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో పండించే 'తేజ' మిరపను ఏటా వివిధ దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రధానంగా చైనా, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థాన్ తదితర దేశాలకు పంపుతారు. చైనా దేశస్థులు 15 ఏళ్ల క్రితం ముదిగొండలో 'తేజ' మిరప కోసం ఆయిల్ కర్మాగారం ఏర్పాటుచేశారు. ఖమ్మం మార్కెట్ నుంచి పెద్దఎత్తున సరకును ఈ కంపెనీ కొంటుంది. చైనాతో పాటు మరో 15 దేశాలకు గృహావసరాల నిమిత్తం సరఫరా చేస్తుంది. అందుకే విశ్వవ్యాప్త పంటగా 'తేజ' మిరప గుర్తింపు పొందింది. ములకలపల్లి, కురవి, హైదరాబాద్ వంటి చోట్ల ఔత్సాహికులు ఆయిల్ కర్మాగారాలు ఏర్పాటు చేస్తుండటం గమనార్హం. 'ఖమ్మం తేజ రకం మిరపకు భౌగోళిక గుర్తింపు లభిస్తుందని భావిస్తున్నాం. తద్వారా రైతులకు ప్రయోజనం చేకూరుతుంది' అని ఖమ్మం జిల్లా ఉద్యాన, పట్టుపరిశ్రమశాఖ అధికారి ఎంవీ మధుసూదన్‌కు తెలిపారు.

## కాగితాల్లోనే లెక్కలు.. జాడలేని మొక్కలు

అశ్వారావుపేట : సత్సంకల్పంతో ప్రారంభించిన 'వన మహోత్సవం' చిన్నబోయింది. పల్లెల్లో మొక్కలు పెంచి వాటిని పంపిణీ చేయాలని నెలకొల్పిన నర్సరీలు వెలవెలబోతున్నాయి. కాగితాల్లో తప్ప కార్యస్థానాల్లో చాలాచోట్ల మొక్కలను నాటిన జాడలు కనిపించడం లేదు. అధికారుల అలసత్వం, కిందిస్థాయి సిబ్బంది నిర్లక్ష్యం వెరసి మొక్కల పెంపకం అంతంతమాత్రంగానే సాగింది.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో డీఆర్డీఏ ఆధ్వర్యంలో 2025లో 471 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. సుమారు 1.20 కోట్ల మొక్కలు పెంచేందుకు శ్రీకారం చుట్టారు. సుమారు రూ.7 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేశారు. ఈ ఏడాది 'వన మహోత్సవం'లో జిల్లావ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలనే లక్ష్యం పెట్టుకున్నారు. కానీ క్షేత్రస్థాయిలో నర్సరీలపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేక స్థానిక సిబ్బంది నిర్లక్ష్యం వహించడంతో మొక్కలు పెరగలేదు. రూ.కోట్ల ప్రజాధనం దుర్వినియోగమైందని, ఈ ఏడాది 'వనమహోత్సవం'పై ఉన్నతాధికారులు సైతం చిత్తశుద్ధి చూపక మమ అనిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

**నర్సరీల్లో బెడ్లన్నీ ఖాళీ...**

'వన మహోత్సవం' విజయవంతమైనట్లు రాతల్లో చూపడం తప్ప క్షేత్రస్థాయిలో మొక్కలు నాటిన, ఇళ్లకు పంచిన ఆనవాళ్లు తక్కువగా



ఉన్నాయనే విమర్శలున్నాయి. జిల్లాలో 471 నర్సరీలు ఏర్పాటు చేయగా.. కొన్నింట్లో సక్రమంగా పెంచారు. పంచాయతీ కార్యదర్శులు నర్సరీలను పట్టించుకోకపోవడంతో చాలా వాటిలో మొలవక, మొలిచినవి ఎండిపోయి బెడ్లన్నీ ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

అశ్వారావుపేట నియోజకవర్గంలో 105 పంచాయతీల్లో నర్సరీలు ఏర్పాటు చేశారు. ప్రధానంగా అశ్వారావుపేట మండలంలోని 27 పంచాయతీల్లో నర్సరీలు నెలకొల్పగా.. ఊట్లపల్లి, ఆసుపాక, బచ్చువారిగూడెం, అనంతారం, గాండ్లగూడెం, కోయరంగాపురం, మామిళ్లవారిగూడెం, కావడిగుండ్ల, కొత్తకన్నాయిగూడెం, కేశప్పగూడెం, మద్దికొండ, నారంవారిగూడెం పంచాయతీల్లోని నర్సరీల్లో మొక్కలు ఎండిపోయాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వన మహోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి గ్రామ పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేశాం. వీటిని పరిశీలిస్తున్నాను. మండల స్థాయిలో ఎంపీడీఓలు, ఏపీఓలను పరిశీలించాలని ఆదేశిస్తా. నర్సరీల్లో మొక్కల పెంపకంపై, వన మహోత్సవం అమలుపై నిర్లక్ష్యం వహించినట్లు తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– విద్యాచందన, డీఆర్‌డీఓ

## ఆపినా ఆగరు.. అవగాహన కలిగించరు



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లోని మూడు కమిషనరేట్ల పరిధిలో 78 ప్రాంతాల్లో పెలికాన్ సిగ్నళ్లను ఏర్పాటు చేశారు. ఇవి కొన్ని చోట్ల పనిచేయడం లేదని, రోడ్డు దాటాలంటే ఇబ్బందులు తప్పడం లేదని పాదచారులు వాపోతున్నారు పరిశీలనలో పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి.పాదచారులు రోడ్డు దాటేందుకు పెలికాన్ సిగ్నల్ బటన్ నొక్కినా వాహనదారులు ఆగడం లేదు. పెలికాన్ సిగ్నల్ ప్రారంభించి రెండేళ్లు దాటినా వాహనదారులు ఇంకా వీటిని గుర్తించడం లేదు. పెలికాన్ సిగ్నల్ ఉపయోగించి రోడ్డు దాటొచ్చనే అవగాహన చాలా మందిలో లేదు.ట్యాంక్‌బండ్ వద్ద పాదచారులు రోడ్డు దాటడానికి గతంలో పెలికాన్ సిగ్నల్ అమర్చారు. ఈ పెలికాన్ సిగ్నల్ స్తంభాన్ని తాకారంటే విద్యుదాఘాతానికి గురికావాల్సిందే. ఇటీవల వర్షాలు కరిసిన సమయంలో ఈ స్తంభాన్ని పరిశీలించగా విద్యుత్ సరఫరా అవుతోందని తేలింది. సందర్శకుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉన్న నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలి. ట్యాంక్‌బండ్‌లో ఉన్నా లవ్ హైదరాబాద్ దగ్గర చాలామంది సందర్శకులు వచ్చి ఫొటోలు తీసుకుంటారు. దానికి దగ్గరే ఉన్నా స్తంభానికి అమర్చిన పెలికాన్ సిగ్నల్ బాక్స్ ప్రమాదకరంగా తెరుచుకొని ఉంది.

బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రి వద్ద పెలికాన్ బటన్ నొక్కితే పెలికాన్ సిగ్నల్ గుర్తులు రాకుండా సాధారణ సిగ్నల్ వస్తుంది. చాలామంది వాహనదారులు సిగ్నల్ పడినా ఆగకుండా వెళ్తున్నారు. పెలికాన్ సిగ్నల్ రాక పాదచారులు రోడ్డు దాటాలంటే భయపడుతున్నారు.

బంజారాహిల్స్ విరించి ఆసుపత్రి దగ్గర ఉన్నా పెలికాన్ సిగ్నల్ పనిచేయడం లేదు. నిరంతరం ఒకటే సిగ్నల్ చూపిస్తోంది.

## పనులు, సేవలకు సాంకేతిక దన్ను



హైదరాబాద్ : సాంకేతికతను అందిపుచ్చుకుంటూ జలమండలి తాగు, మురుగు నీటి సరఫరా సమస్యల పరిష్కారంలో ముందుకెళ్తోంది. ప్రమాదకరమైన పరిస్థితుల్లో భద్రత ఉండేలా, తక్కువ సమయంలో ఎక్కువ శ్రమలేకుండా కచ్చితమైన ఫలితాలు అందుకునేలా ఆధునిక యంత్రాలను వినియోగించుకుంటోంది.స్మార్ట్‌వాల్వ్ సాంకేతికత: పలు సమస్యలకు స్మార్ట్ వాల్వ్ సాంకేతికత పరిష్కారం చూపుతుంది. వ్యక్తుల ప్రమేయం లేకుండా నీటిని నిర్ణీత వేళల్లో నిర్దేశించిన పరిమాణం మేరకు, నిర్ణయించిన సమయం వరకు విడుదల చేయడం దీని ప్రత్యేకత. నీటి సరఫరాతో పాటు నాణ్యతను గుర్తిస్తుంది.మినీ సీవర్ జెట్టింగ్ మిషన్: మ్యాన్‌హోళ్లు, మురుగునీటి కాలువలను శుభ్రం చేయడానికి ఈ యంత్రాలు వినియోగిస్తారు. పూడికతీతలో కీలకంగా పని చేస్తున్నాయి. వ్యక్తులు మ్యాన్‌హోళ్లు, మురుగునీటి కాలువల్లో దిగడాన్ని ఇది వంద శాతం లేకుండా చేసింది. నాణ్యతకు ప్రత్యేక చర్యలు: రోజువారీగా నీటి నమూనాలను సేకరించి నాణ్యతను పర్యవేక్షించడం. రిజర్వాయర్ లెవల్ సెన్సార్లు, నిర్దేశించిన స్థాయికి నీరు చేరితే అప్రమత్తం చేయడం వీటి ప్రత్యేకత.

హైడ్రాలిక్ సిల్ట్ గ్రాబర్స్: మనుషుల ప్రమేయం లేకుండా మ్యాన్‌హోళ్ల నుంచి మట్టిని తొలగించడానికి ఈ యంత్రాలు వినియోగిస్తారు.

సీవర్ క్రాక్స్: రోబోటిక్ పరికరాలు, మ్యాన్‌హోల్స్‌లో గట్టిపడిన మట్టిని తొలగించడంలో ఇవి కీలకంగా పని చేస్తున్నాయి.

**హోమో సెప్ సీవర్ రోబోటిక్ యంత్రం**

డ్రైనేజీ మ్యాన్‌హోళ్లలో అవరోధాలు, పూడికను సమర్థంగా గుర్తించి పక్కాగా మురుగునీటి వ్యవస్థను నిర్వహించేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుంది. హోమో సెప్ సీవర్ పేరిట తయారు చేసిన రోబో ద్వారా మ్యాన్‌హోళ్లలోకి దిగే అవసరం లేకుండా, అత్యాధునిక కెమెరాలతో పూడికను గుర్తిస్తుంది. వ్యర్థాలను తీస్తుంది. మ్యాన్‌హోల్ మూత తీయకుండానే పరిస్థితిని అంచనా వేసి సురక్షితంగా పనులు చేయడానికి సాధ్యపడుతుంది.

## ఏటా తనిఖీలు.. వెలుగులోకి అక్రమాలు



బొంరాస్‌పేట : బొంరాస్‌పేట మండలంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన రూ.7.70 కోట్ల ఉపాధిహామీ పనులపై ఈనెల 18న మండల కేంద్రంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. చేసిన పనుల్లో పలు అవకతవకలు జరిగినట్లు తనిఖీ సిబ్బంది గుర్తించారు. దీనికిగాను సిబ్బందికి రూ.76 వేలు జరిమానా విధించారు. రూ.6.71 లక్షలు రికవరీ చేయాని ఆదేశించారు.

రెణ్నెల్ల కిందట పూడూరులో నిర్వహించిన సామాజిక తనిఖీ ప్రజావేదికలోనూ తప్పులు వెలుగులోకి వచ్చాయి. రూ.48 వేలు జరిమానా వేశారు. రూ.1.20 లక్షల రికవరీకి ఆదేశించారు. దోమ మండలంలో నిర్వహించిన సామాజిక తనిఖీలోనూ రూ.52 వేలు జరిమానా విధించారు.గ్రామీణ ప్రాంతాల్లో కూలీలకు పనులు కల్పించడానికి అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో లోపాలు బయటపడుతున్నాయి. ఏటా రూ.కోట్ల పనులు చేస్తున్నారు. పారదర్శకంగా జరుగుతున్నాయా.. లేదా నిర్ధారించడానికి ఏటా సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నారు. తనిఖీ సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి చేసిన పనులను పరిశీలించి పలు లోపాలను గుర్తించి ఎత్తి చూపుతున్నారు. సంబంధిత సిబ్బందికి జరిమానాలు విధించి సొమ్ము రికవరీకి ఆదేశాలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా పనుల నిర్వహణలో మాత్రం మార్పు రావడం లేదు. అవే తప్పులు పునరావృతమవుతున్నాయి.

**విజిలెన్స్ కమిటీలు కాగితాలకే పరిమితం..**

ఈ పథకంలో అవకతవకలను అరికట్టడానికి కొన్ని నెలల కిందట ప్రభుత్వం గ్రామస్థాయిలో అయిదుగురితో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలిచ్చింది. వాటిని కాగితాలకే పరిమితం చేశారు. సభ్యులకు అవగాహన కల్పించి బలోపేతం చేస్తే నిధుల దుర్వినియోగం, బోగస్ కూలీల నమోదు వంటి వాటికి చెక్‌పెట్టడానికి అవకాశం ఉంటుంది.

**ఏటా రూ.కోట్లతో పనులు..**జిల్లాలో ఉపాధిహామీ పథకంలో ఏటా రూ.కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయి. సిమెంటు రోడ్ల నిర్మాణం, నీటి నిల్వ కట్టడాలు, మొక్కల పెంపకం, పాటు కాలువల మరమ్మతులు, ఇంకుడు గుంతల నిర్మాణం వంటి ఎన్నో పనులు చేస్తున్నారు. ఈ పనులు చేయడానికి జాబ్‌కార్డు ఉన్న కూలీలు హాజరవుతున్నారు. కొన్నిచోట్ల కూలీలు రాకున్నా వచ్చినట్లు హాజరు వేయడం, పని కొలతల్లో ఎక్కువ, తక్కువ నమోదు చేయడం, గ్రామ పంచాయతీ తీర్మానాలు లేకుండా చెల్లింపులు.. వంటివి సాగుతున్నాయి. ఆయా పనులపై క్షేత్రస్థాయిలో నిఘా, పర్యవేక్షణ లోపించడం వల్లే ఇలాంటివి చోటుచేసుకుంటున్నాయన్న విమర్శలున్నాయి.

## డెంగీ జ్వరం.. భయం భయం

వికారాబాద్ : జిల్లాలో డెంగి మహమ్మారి పంజా విసురుతోంది. వర్షాలు కురిసి నిలిచిపోవటంతో కేసులు అధికమయ్యాయి. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలో 40 కేసులు నమోదయ్యాయి. వాటిలో 32 జులై, ఆగస్టు నెలలవే ఉన్నాయి. వికారాబాద్, తాండూరు పట్టణాల్లోనే ఎక్కువగా జ్వరాల బారిన పడుతున్నారు. వికారాబాద్ పుర పరిధి కొత్తగడి, ఆలంపల్లి, శివారెడ్డిపేటలోని కొన్ని ప్రాంతాలు పూర్తిగా అపరిశుభ్రంగా మారడంతో రెండ్రోజుల్లో ముగ్గురికి నిర్ధారణ అయింది.**పల్లెలు, పట్టణాల్లో..**జిల్లాలో జూన్ వరకు పూడూరు, వికారాబాద్, తాండూరు, ధారూరు, నవాబ్‌పేట, బొంరాస్‌పేటలో 8 కేసులు నమోదయ్యాయి. జులై, ఆగస్టు నెలల్లో 32 నిర్ధారణ అయ్యాయి. పల్లెలు, పట్టణాలనే తేడా లేకుండా జిల్లాలో అక్కడక్కడా డెంగీ కేసులు వెలుగు చూస్తున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం 2023లో 89, 2024లో 125, 2025 జనవరి నుంచి ఇప్పటి వరకు 40 కేసులు బటయపడ్డాయి. అనధికార లెక్కల ప్రకారం ఏటా సుమారుగా 140కిపైనే డెంగీతో ఇబ్బంది పడ్డారు.మిగతా జిల్లాలతో పోలిస్తే తక్కువే..మిగతా జిల్లాలతో పోలిస్తే వికారాబాద్‌లో డెంగీ కేసులు తక్కువే నమోదయ్యాయి. ఇతర జిల్లాల్లో ఒకే రోజు 40 కేసుల వరకు వస్తున్నాయి. ఇక్కడ వైద్యాధికారులు తీసుకున్న చర్యల కారణంగా కసుల సంఖ్య తక్కువగా ఉంటోంది. వికారాబాద్‌లోని మూడు ప్రాంతాల్లో ప్రత్యేకంగా పర్యటించి తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించా. డెంగీ వ్యాధి ఉన్నట్లు గుర్తిస్తే ఆ పరిసరాల్లోని 50 ఇళ్ల కుటుంబ సభ్యులకు పరీక్షలు నిర్వహిస్తాం. చుట్టు పక్కల బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.డా.రవీందర్‌యాదవ్, జిల్లా వ్యాధుల నివారణ కార్యక్రమ అధికారి, వికారాబాద్

## గోదా'వర్రీ'

భద్రాచలం : భద్రాచలం వద్ద గోదావరి ప్రమాదకర స్థాయికి చేరుకోవడంతో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. మంత్రులు జిల్లా అధికారులతో మాట్లాడి పరిస్థితిపై ఆరా తీస్తున్నారు. ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేస్తున్నారు. పలుచోట్ల రహదారులపై వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. కొన్ని ప్రాంతాల విద్యార్థులకు ప్రైవేటు సంస్థలు స్వచ్ఛందంగా సెలవులు ప్రకటించాయి. చర్ల, దుమ్ముగూడెం, భద్రాచలం మండలాలతో పాటు పినపాక, మణుగూరు, అశ్వాపురం, బూర్గంపాడు మండలాల్లో 50 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. గతంతో పోల్చితే ఈసారి అప్రమత్తత బాగానే కనిపించింది. భద్రాచలం పట్టణం కొత్తకాలనీ, అయ్యప్ప కాలనీ వద్ద పెద్ద మోటార్లతో వర్షం నీటితో పాటు మురుగు నీటిని పైపుల గుండా గోదావరిలో కలిపేస్తున్నారు. కరకట్టపై వాహనాల రాకపోకలను కట్టడి చేస్తున్నారు.

**కరుణించిన వరుణుడు**

ఇంత వరదొచ్చినా లోతట్టు ప్రాంతాలకు నీరు చేరకపోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఎగువన కురిసిన వర్షంతో గోదావరి పోటెత్తగా స్థానికంగా వర్షం తగ్గుముఖం పట్టడంతో ముంపు బాధ తప్పింది. వరద తరుణంలో భారీ వర్షం కురిస్తే రామాలయ అన్నదాన సత్రం దారితోపాటు పలు లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉండేది. నూతన కరకట్ట స్లూయిస్‌ను మూసేయడంతో వర్షం నీరు భారీస్థాయిలో కట్టకు ఆనుకుని నిలిచి ఉంది. ఎగువ



ప్రాంతంలోని కాళేశ్వరం వద్ద వరద తగ్గుముఖం పడుతుండటంతో ప్రస్తుతానికి ముప్పు తప్పినట్టేనని భావిస్తున్నారు.

**సెక్టోరియల్ అధికారుల నియామకం**

మండలానికో సెక్టోరియల్ అధికారిని నియమించి ఏడు మండల స్థాయి కమిటీలను ఏర్పాటు చేశారు. మొబైల్ బృందాలు, జోనల్ అధికారులు, స్విమ్మర్లు, వైద్యులు, స్వచ్ఛంద సంస్థలు, సామగ్రిని తరలించేందుకు ట్రాక్టర్లతో పాటు లారీలను అందుబాటులో ఉంచాలని నిర్ణయించారు. ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ వేర్వేరుగా స్థానికంగా కొన్ని కాలనీల్లో పర్యటించారు. కరకట్ట వద్ద గోదావరి వరద తీరును పరిశీలించి ఏ మాత్రం అలసత్వం వహించొద్దని సిబ్బందికి సూచించారు.

## సర్వేతో సరిపెట్టొద్దు

భద్రాచలం : వానాకాలంలో మన్యం అంటే గుర్తొచ్చేది కీటక జనిత వ్యాధులు. ప్రధానంగా మలేరియా.. అడవులు, తేమ వాతావరణం, కనీస సదుపాయాల లేమి.. ఏటా ఏజెన్సీలో దోమల వృద్ధికి కారకాలుగా మారుతున్నాయి. మన్యాన్ని మంచమెక్కిస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా తూతూమంత్రం సర్వేలతో కాలంవెలిబుచ్చుతుండట ంతో ఏటా విషజ్వరాలు బాధిస్తూనే ఉన్నాయి. మలేరియా, డెంగీ విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ నెల 7 నుంచి 17 వరకు మన్యంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది ర్యాపిడ్ ఫీవర్ సర్వే చేపడుతున్న నేపథ్యంలో కేసుల గుర్తింపులో పారదర్శకత పాటించాలి. జ్వరం ఉందంటే దాన్ని దాచి పెట్టకుండా నివేదికలను సిద్ధం చేస్తేనే లక్ష్యం సాకారం అవుతుంది. లేకుంటే పాత పరిస్థితులే పునరావృతమవుతాయి.

**ఎలా సాగుతుంది?**

జిల్లాలోని సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతీ రోజు 50 ఇళ్లను సందర్శిస్తారు. ఇలా 11 రోజులపాటు, ప్రతీ ఇంటికి నేరుగా వెళ్లి ఆరోగ్య సమాచారం సేకరిస్తారు. జ్వర లక్షణాలుంటే రక్త పూతలను సేకరించి ప్రాథమికంగా వ్యాధిని నిర్ధారిస్తారు. జ్వరాలు ఎక్కువగా ఉంటే ఆ ప్రాంతంలో వైద్య శిబిరాలను ఏర్పాటుచేస్తారు. ఇంకా ఎక్కువ స్థాయిలో సేవలు అవసరం అనిపిస్తే సమీప ప్రభుత్వ ఆసుపత్రికి బాధితులను తరలిస్తారు.

**ఇవన్నీ లోపాలే**

దోమలు కుట్టకుండా నియంత్రించటంలో దోమతెరలది కీలక పాత్ర. అయిదేళ్ల క్రితం 51వేల దోమతెరలు పంచారు. నాలుగేళ్ల క్రితం 1.6 లక్షల తెరలు వచ్చాయి. 2023 వర్షాకాలం వరకు వీటిని సర్దుబాటు



చేశారు. మళ్లీ లక్ష దోమతెరలు అవసరమని ప్రతిపాదనలు పంపినా, రెండేళ్లు దాటినా వీటి జాడే లేదు.

దోమల మందు పిచికారీలోనూ లోపాలున్నాయి. ఇప్పటికే తొలి విడత ప్రక్రియ పూర్తయింది. సాధారణంగా మలాథియాన్ హైరిస్క్ గ్రామాల్లోని గిరిజనుల ఇళ్లలో చల్లి మిన్నకుంటున్నారు. దీంతో ప్రయోజనం ఉండదు. వారు ఉండే సామూహిక ప్రదేశాల్లోనూ పిచికారీ చేయాలి. రెండో విడతలో అయినా ఈ జాగ్రత్త పాటించాలి.

వెయ్యిమంది జనాభా ఉన్న గ్రామాల్లో రెండు కేసులు నమోదైతే వాటిని హైరిస్క్‌గా గుర్తిస్తారు. ఈ ఏడాది 119 గ్రామాలను ప్రకటించారు. ప్రైవేటు వైద్యశాలల్లో నమోదైన కేసులను పరిగణలోకి తీసుకుంటే బాధిత గ్రామాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. గొత్తికోయ ఆవాసాలు, ఇటుక బట్టీల్లో పని చేసే వలసవాసుల వద్దకు వెళ్లి పూర్తి స్థాయి పరీక్షలు నిర్వహించినా ఈ విషయం అర్థమవుతుంది.

గ్రామాల్లో ప్రతి విధిగా ఫ్రైడే డ్రైడే నిర్వహించాలి. పరిసరాల శుభ్రంతోపాటు రక్షిత నీళ్ల ట్యాంకులను బాగుచేయాలి. ఈ ప్రక్రియ అధ్వానంగా సాగుతోంది. కొన్నిపంచాయతీల్లో నిధులలేమి కారణంగా చెబుతున్నారు. గంబూషియా చేప పిల్లలను ఎక్కడా వదలట్లేదు. వర్షాకా లంలో అయినా విధిగా ఇవన్నీ చేస్తే విష జ్వరాలను అడ్డుకోగలం.

ఈ ఏడాది నమోదైన జ్వరాలు

డెంగీ: 45 మలేరియా: 45

జిల్లాలో పాల్వంచ, చర్ల, దుమ్ముగూడెం, ఇల్లెందు, అశ్వారావుపేట, మణుగూరు, భద్రాచలం వంటి చోట్ల జ్వర కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సర్వే తర్వాత బాధితుల సంఖ్యపై మరింత స్పష్టత రానుంది.

'ర్యాపిడ్ ఫీవర్ సర్వేకు అన్ని ఏర్పాట్లు చేశాం. సిబ్బంది క్షేత్ర స్థాయిలో ప్రతీ ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తారు. కేసుల నమోదులో పూర్తి పారదర్శకత పాటించేలా నిర్దేశించాం. ప్రభుత్వ ఆసుపత్రిల్లో తగిన పరీక్షలతో పాటు చికిత్సలు అందిస్తాం.

డా.సైదులు, భద్రాచలం అడిషనల్ డీఎంహెచ్ఓ

# కొత్త వైద్యులొస్తేనే పాత చిక్కులు తొలిగేది..!

ఖమ్మం : వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను ఏళ్లుగా నిపుణుల కొరత వేధిస్తోంది. ముఖ్య విభాగాల్లో వైద్యులు లేకపోవడంతో రోగులకు 24గంటల సేవలు లభించడం లేదు. కొన్నిచోట్ల కనీసం డ్యూటీ మెడికల్ ఆఫీసర్లు కూడా లేకపోవడంతో బాధితులు ఇతర ఆస్పత్రులు, ప్రైవేటు క్లినిక్‌లకు వెళ్తూ వ్యయప్రయాసలకు గురవుతున్నారు. అత్యవసర సమయాల్లో చికిత్సలు లభించక రోగుల ప్రాణాలకు ముప్పువాటిల్లుతుంది. ప్రస్తుత జ్వరాల సీజన్లో ఓవైపు డెంగీ కేసులు భయపెడుతున్నాయి. ఈ నేపథ్యంలో వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో కాంట్రాక్టు పద్ధతిలో వైద్య నిపుణుల నియామకానికి ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గతానుభవాల దృష్ట్యా అర్హులు విధుల్లో చేరి, ఖాళీలన్నీ భర్తీ అయితేనే ఇబ్బందులు తొలగే అవకాశం ఉంది.

**ఎక్కడెక్కడ, ఏఏ విభాగాల్లో..**

జిల్లాలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యంలో సత్తుపల్లి, పెనుబల్లి, కల్లూరు, నేలకొండపల్లి, మధిర, తిరుమలాయపాలెం సామాజిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. అన్నిచోట్లా వైద్యుల కొరత నెలకొంది. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా, ఆప్తాల్మాలజీ, ఈఎన్‌టీ విభాగాల్లో నిపుణులు లేరు. సివిల్ అసిస్టెంట్ సర్జన్ల పోస్టుల్లో ఖాళీలతో నాడీపట్టే నాథుడు కరవయ్యారు. నిజానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలతో పోల్చితే వీటిలో మెరుగైన సేవలందాలి. జిల్లా ఆసుపత్రిపై భారం పడకుండా ప్రత్యేక నిపుణులు, శస్త్రచికిత్స



వైద్యులు అందుబాటులో ఉండాలి. గ్రామీణుల అవసరాలు తీర్చాలి. ఉన్నత సేవలు అటుంచి సాధారణ జ్వరం, దగ్గు వంటి చిన్నపాటి సమస్యలకూ చికిత్స అందడం లేదు. చిన్నపిల్లలకు సకాలంలో రోగ నిర్ధారణ, చికిత్సలు లభించడం లేదు. స్త్రీ సంబంధిత సమస్యలకు, ప్రసవాలు, గర్భిణులు, తల్లులకు అవసరమైన వైద్యం కోసం జిల్లా కేంద్రానికి వెళ్లాల్సి వస్తుంది. నిపుణుల కొరతతో శస్త్ర చికిత్సలు నిండుకున్నాయి. ఏది ఏమైనా తాత్కాలిక ప్రాతిపదిక స్థానంలో శాశ్వత పద్ధతిలో సిబ్బందిని నియమిస్తే సమస్యకు పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది.

**దరఖాస్తులు ఆహ్వానించాం**

డా. రాజశేఖర్‌గౌడ్, టీవీవీపీ ఆస్పత్రుల సమన్వయాధికారి

జిల్లాలోని అన్ని ఆస్పత్రులు ఆరు గైనకాలజీ, మూడు అనస్తీషియా, రెండు ఆప్తాల్మాలజీ, రెండు పీడియాట్రిక్, ఈఎన్‌టీ, జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్‌లో ఒక్కోటి, ఒక సివిల్ సర్జన్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చాం. అర్హులైన వైద్యులు తమ ఒరిజనల్ ధ్రువపత్రాలతో ఈ నెల 6న ఐడీవోసీలోని జిల్లా ఆస్పత్రుల ప్రధాన కార్యాలయంలో ఉదయం 11గంటలకు జరిగే వాక్ ఇన్ ఇంటర్వ్యూల కు హాజరు కావాలి. ప్రత్యేక నిపుణులకు రూ.లక్ష, సివిల్ అసిస్టెంట్ సర్జన్(ఎంబీబీఎస్)కు రూ.52,351 చొప్పున నెలవారీ వేతనం చెల్లిస్తారు. ఆసక్తి కలిగిన వారు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

# సేవల్లో నాణ్యత భక్తులకు భరోసా

భద్రాచలం : దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామి వారి దేవస్థానంలో భక్తులకు ఆన్‌లైన్‌లో పరోక్షంగా.. ఆఫ్‌లైన్ ద్వారా ప్రత్యక్షంగా సేవలు అందుతున్నాయి. ఏడాదికి 24 లక్షల మంది దర్శనానికి వస్తుండగా వార్షిక ఆదాయం సుమారు రూ.80 కోట్లకు చేరింది. ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించడంతో రద్దీ బాగానే ఉంటోంది. ఇలాంటి చోట అందించే సేవలకు త్వరలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్(ఐఎస్ఓ) ధ్రువీకరణ పొందేందుకు అవసరమైన ప్రక్రియ ఆరంభమైంది. ఐఎస్ఓ అనేది అంతర్జాతీయ ప్రభుత్వేతర స్వతంత్ర సంస్థ. నాణ్యత, భద్రత, సామర్థ్యం పనితీరును నిర్ధారించేందుకు ఈ సంస్థకు నిపుణులు రూపొందించిన మార్గదర్శకాలు ఉన్నాయి. వాటికి అనుగుణంగా ఉంటేనే ఐఎస్ఓ సర్టిఫికెట్‌ను జారీ చేస్తారు. ఇది ఉంటే అదో గొప్పగా పరిగణిస్తారు. ప్రమాణాలు పకడ్బందీగా ఉన్నాయన్న భరోసా ఉంటుంది.

**యాదగిరిగుట్ట తరహాలో...**

సాధారణంగా పెద్దపెద్ద వ్యాపార సంస్థలు, కర్మాగారాలు తమ వినియోగదారుల ఆదరణ పొందేందుకు ఇలాంటివి పొందుతుంటాయి. దేవాదాయశాఖ సైతం తమ భక్తులకు అందించే సేవల విశిష్టతను విశ్వవ్యాప్తం చేసేందుకు ఈ సంస్థ సూచించే ప్రమాణాలను పాటిస్తున్నాయి. ఇప్పటికే యాదగిరి గుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఐఎస్ఓ గుర్తింపు వచ్చింది. వేములవాడ రాజన్న ఆలయానికి త్వరలో ఈ సర్టిఫికెట్ కేటాయించే వీలుంది. వారం కిందట ఈ ప్రతినిధులు భద్రాచలం రామాలయాన్ని సదర్శించి కొన్ని సూచనలు చేశారు. అన్నదానం, ప్రసాదాల తయారీ, శేష వస్త్ర దుకాణం, వివిధ కౌంటర్లలో రికార్డుల నిర్వహణతో పాటు పారిశుద్ధ్య చర్యలనూ పరిగణలోకి తీసుకున్నారు. మరోసారి ఈ బృందం వచ్చి సమగ్ర పరిశీలన చేసి సర్టిఫికెట్ కేటాయించనుందని భావిస్తున్నారు.

**హక్కులు.. ఆహార భద్రత**

ఈ దేవస్థానంలోని ధ్రువమూర్తుల చిత్రాలపై రామాలయానికి మే 23న కాపీరైట్స్ లభించాయి. ప్రధాన కోవెలలో సీతారామ లక్ష్మణుల వారి విగ్రహాలు దర్శనమిస్తాయి. ఇందులో అలంకరణ ఛాయాచిత్రం, అలంకరణ లేకుండా మరోచిత్రం ఎక్కువగా ముద్రణలో, జ్ఞాపికల్లో కనిపిస్తుంటాయి. అనుమతి లేకుండా ఎవరైనా ఈ ఫొటోలను ముద్రించినా.. వీటిని వ్యాపారం కోసం విక్రయించినా చట్టపరంగా చర్యలు తీసుకునేందుకు రామాలయానికి హక్కులు వచ్చాయి. ప్రసాదాలు, అన్నదాన విభాగాలపై మరింత పారదర్శకత ఉండేందుకు ఫుడ్ సేఫ్టీ ధ్రువీకరణను పొందారు.

**కాగిత రహిత పాలన దిశగా...**

భక్తుల సౌకర్యం కోసం ఆన్‌లైన్‌తో పాటు డిజిటల్ సేవలు అందిస్తున్నారు. అలాగే కార్యాలయ నిర్వహణలోనూ కాగిత రహిత పాలనలో భాగంగా వేగంగా దస్త్రాల పరిష్కారానికి 'ఈ-ఆఫీస్' వ్యవస్థను అమల్లోకి తెచ్చారు. ఇది పూర్తిగా కార్యాలయ వ్యవహారాలకు సంబంధించిన పారదర్శకతను చాటేందుకు ఏర్పాటు చేసిన ప్రక్రియ. ఇందులో మొదటగా అకౌంట్స్ విభాగంలో ఈనెల 1న ఆన్‌లైన్ ప్రారంభమైంది. ఇలా మరో పది విభాగాల్లో ఆన్‌లైన్ అమలు చేయనున్నారు. ఇందుకు కార్యాలయంలో ఉన్న కంప్యూటర్లు సరిపోవు. మరో 20 కొనేందుకు రూ.15 లక్షలు అవసరమని అంచనా. కంప్యూటర్ పరిజ్ఞానం లేని సిబ్బందికి శిక్షణ ఇచ్చే వీలుందని ఆలయ వర్గాలు తెలిపాయి.

# నల్లచెరువు సల్లగుండ







హైదరాబాద్ : ఆ చెరువు విస్తీర్ణం రెవెన్యూ రికార్డుల ప్రకారం 28 ఎకరాలు. కానీ మొత్తం ఆక్రమణలకు గురైంది. దాదాపు 12 ఎకరాలు ఆక్రమించి షెడ్లు ఇతర నిర్మాణాలు చేశారు. మిగిలిన ప్రాంతంలో చెత్త, నిర్మాణ వ్యర్థాలను వేసి మొత్తం మెరక ప్రాంతంగా చేశారు. వర్షం వస్తే చాలు.. వరద వెళ్లేందుకు మార్గం లేక ఎగువ బస్తీలు ముంచెత్తేది. ఇళ్లలోకి నీరు చేరి నానా అగచాట్లు పడేవారు. కానీ చెరువు ఆక్రమణల జోలికి మాత్రం ఎవ్వరూ వెళ్లలేదు. ఇది ఏడాది కిందటి మాట. ప్రస్తుతం ఆక్రమణలను తొలగించారు. చెరువు విస్తీర్ణం 28 ఎకరాలకు తీసుకువచ్చారు. చెరువులో వేసిన నిర్మాణ వ్యర్థాలను తొలగించడంతోపాటు 4 మీటర్ల లోతులో పూడిక తీశారు. దీంతో జలకళ సంతరించుకుంది. బోటు షికారు ఏర్పాటు చేస్తున్నారు. మరో ట్యాంకుబండ్ తరహాలో మారుస్తున్నారు. అదే కూకట్‌పల్లి నల్లచెరువు.

**సవాళ్లు అధికమించి..:** హైడ్రా ఏర్పాటు చేసిన తర్వాత తొలి విజయం.. అంబర్‌పేట బతుకమ్మకుంట పునరుద్ధరణ. పూర్తిగా అదృశ్యం అయిన బతుకమ్మకుంటను తిరిగి రప్పించారు. రెండోది కూకట్‌పల్లి నల్లచెరువు. దీన్ని ఆధునికీకరించారు. పర్యాటక ప్రాంతంగా మారనుంది. నగరంలో మొత్తం 13 చెరువుల అభివృద్ధి జరుగుతోంది. మొదటిదశలో 6 చెరువులు చేపట్టింది. ఈ క్రమంలో హైడ్రా ఎన్నో రాజకీయ, అధికార ఒత్తిడులు ఎదుర్కొంది. రెవెన్యూ రికార్డుల ప్రకారం ఎఫ్‌టీఎల్ నిర్ధారణ చేసి ఆక్రమణలను తొలగించింది. చెరువులో మురుగునీరు చేరకుండా ఏర్పాట్లు చేశారు. ఐల్యాండ్, జీవ వైవిధ్యం ఉండేలా ఏర్పాట్లు చేస్తున్నారు. కమ్యూనిటీ హాళ్లను ఏర్పాటు చేయనున్నారు.

**వరదలు లేని నగరంగా..**వరదలు లేని నగరంగా హైదరాబాద్‌ను రపొందించే లక్ష్యంగా పనిచేస్తున్నాం. రెండోదశలో 13 చెరువుల అభివృద్ధి చేపడతాం. కూకట్‌పల్లి నల్లచెరువు పిక్నిక్ పాయింట్‌లా మారింది. ఆక్రమణలను తొలగించే సమయంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. నిందలు పడ్డాం. ఓ మహిళ ఆత్మహత్యను హైడ్రాకు ఆపాదించారు. సవాళ్లను ఎదుర్కొని భారీ షెడ్లను తొలగించాం. ఏవీ రంగనాథ్, కమిషనర్ హైడ్రా

# పెద్దాసుపత్రులకు ప్రత్యేకాధికారులు




హైదరాబాద్ : గ్రేటర్‌లోని గాంధీ, ఉస్మానియా, నిలోఫర్, సరోజనిదేవి, ఎంఎన్‌జే తదితర పెద్దాసుపత్రులకు ప్రత్యేక అధికారుల పాలన కిందకు తెచ్చేందుకు వైద్య ఆరోగ్యశాఖ యోచిస్తోంది. తొలుత గాంధీ ఆసుపత్రిలో త్వరలో ప్రత్యేకాధికారిని నియమించనున్నారు. ఇటీవల గాంధీ ఆసుపత్రిని సందర్శించిన సమయంలో స్వయంగా వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ఈ విషయాన్ని వెల్లడించారు. ఫలితాలను బట్టి మిగతా ఆసుపత్రులకు ఈ సేవలను విస్తరించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**కీలకాంశాలు ఇవీ...**

నగరంలోని కీలక ఆసుపత్రులకు క్రమేపీ రోగుల సంఖ్య పెరుగుతోంది. దాదాపు 30 వరకు విభాగాలు వందల సంఖ్యలో వైద్యులు, సిబ్బంది సేవలు అందిస్తున్నారు. సకాలంలో వైద్యులు విధులకు హాజరవుతున్నారా.. ఎన్ని గంటలు ఆసుపత్రుల్లో ఉంటున్నారు. ఆర్ఎంవోలు విధులు సక్రమంగా నిర్వహిస్తున్నారా.. అంటే లేదనే చెప్పాలి.

గాంధీ, ఉస్మానియా, నిలోఫర్ ఆసుపత్రుల్లో సగం మంది వైద్యులకు బయట క్లినిక్‌లు ఉన్నాయి. కార్పొరేట్ ఆసుపత్రుల్లో కన్సల్టెంట్లుగా పనిచేస్తున్నారు. విధులు ముగిసిన తర్వాత ప్రైవేటు ప్రాక్టీసు చేసుకొనే అవకాశం ఉన్నప్పటికీ కొందరు మధ్యాహ్నం 2 గంటలకే ఆసుపత్రిలో కన్పించడం లేదు.

రోగులకు సక్రమంగా సేవలు అందుతున్నాయో.. లేదో.. చూడాల్సిన ఆర్ఎంవోలు కూడా తమ గదుల నుంచి కదలడం లేదు. స్మార్ట్ ఫోన్లు చేతిలో పట్టుకొని కాలక్షేపం చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొంతమంది డ్యూటీ డాక్టర్లు, పీజీలపై చాలా వరకు భారం పడుతోంది. కొందరు సీనియర్ వైద్యులు తీరు విమర్శలకు తావిస్తోంది.

మరోవైపు ఆసుపత్రిలో పరికరాలు పాడైనా ఎవరూ పట్టించుకోవడం లేదు. గాంధీలో సిటీస్కాన్, ఎక్స్‌రే యంత్రాలు పాడై ఏడాది గడుస్తున్నా.. మరమ్మతులు చేయించే ఆలోచన చేయకపోవడం గమనార్హం.

ఈ నేపథ్యంలో ఐఏఎస్ ర్యాంకుతో కూడిన ప్రత్యేకాధికారుల పాలన కిందకు సర్కారు ఆసుపత్రులను తేవాలనేది యోచనగా ఉంది. వైద్యులు, సిబ్బంది సేవలపై సమీక్ష నిర్వహించడం.. రోగులకు ఎప్పటికప్పుడు నాణ్యమైన సేవలు అందేలా చూడటం వీరి బాధ్యత.

ఆసుపత్రులకు అవసరమయ్యే మౌలిక వసతులు, వైద్యులు, సిబ్బంది సమస్యలు ఇతరత్రా అంశాలపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించడం లాంటి వాటిపై దృష్టి పెట్టనున్నారు. ఫలితంగా రోగులకు నాణ్యమైన సేవలు అందించే వీలు ఉంటుందని భావిస్తున్నారు.

# ఏమాత్రం అశ్రద్ధ వద్దు



హైదరాబాద్ : రోగం తగ్గించాల్సిన ఔషధాలు ప్రాణాంతకంగా మారుతున్నాయి. కొందరు నకిలీ, నాణ్యత లేమి మందులను అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. శివార్లలో, బస్తీల్లోని కొన్ని మందుల షాపుల్లో నకిలీల దందా జోరుగా సాగుతోందని డ్రగ్ కంట్రోల్ అధికారులు తేల్చారు. ఏడాదిన్నర కాలంలో తీసిన శాంపిళ్లను పరీక్షించగా దాదాపు 186 రకాల్లో నాణ్యత కొరవడినట్లు గుర్తించారు. ఇవి నకిలీవని తేల్చారు. వీటిని ఎక్కువగా ఉత్తరాది రాష్ట్రాల్లోని మారుమూల ప్రాంతాల్లోని ఫ్యాక్టరీల్లో తయారు చేసి ఇక్కడికి పంపుతున్నారు. నిత్యం ఎక్కువ మంది వాడే మందులనే కల్తీ చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ మందులు కొనేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని ఔషధ నియంత్రణ శాఖ సూచిస్తోంది.

**ఈ జాగ్రత్తలు ముఖ్యం..**

ఔషధాలు కొనేముందు ప్యాకేజింగ్ పరిశీలించాలి. బ్రాండ్‌లో స్పెల్లింగ్ తప్పుగా ఉండటం, ఫాంట్‌సైజులో తేడా, లోగోలు సక్రమంగా కన్పించకపోవడం లాంటి లోపాలను గుర్తించవచ్చు.

మందులతయారీ, గడువు తేదీ, బ్యాచ్ నంబరులో స్పష్టత ఉండదు. తప్పుడు చిరునామాతో ఉంటాయి. అనుమానాస్పదంగా అనిపిస్తే కంపెనీ అధికారిక వైబ్‌సైట్‌లో చెక్ చేయాలి.

మందులపై కంపెనీల హెూలోగ్రామ్ స్టిక్కర్లు, క్యూఆర్‌కోడ్స్ ఉంటాయి. వీటిని స్కాన్ చేస్తే అసలు కంపెనీ సమాచారం ఉంటుంది. అందుబాటులో లేకపోతే నకిలీదని అనుమానించి అధికారుల దృష్టికి తీసుకెళ్లాలి.

మందుల ప్యాకేజీ, ఔషధం ఉన్న సీసాలు ఉబ్బడం, పాడై ఉండటం, రంగు మారడం, ప్యాకింగ్‌లోపల గోలీలు పిండిలా మారి కన్పిస్తే నకిలీగా గుర్తించి అధికారులు దృష్టికి తీసుకెళ్లాలి.

తక్కువ ధర ఉండటం.. ఎక్కువ రాయితీ ఆఫర్ చేసినా అనుమానించాల్సిందే.

**ఇదీ లెక్క**

ఎక్కువ కేసులు - హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, మెదక్ జిల్లాల్లోనివి

2024 జనవరి నుంచి 2025 జులై వరకు పరిశీలించిన మందుల శాంపిళ్లు - 7,200

ఇందులో నకిలీవి, నాణ్యతలేనివి - 186

2025 జనవరి నుంచి 2025 జులై వరకు తనిఖీలు చేసిన సంస్థలు - 16,481

నిబంధనలు ఉల్లంఘించినవి - 2,827

నమోదు చేసిన కేసులు - 700

# అనుబంధం వద్దు.. పంచాయతీలే ముద్దు

కామారెడ్డి : జిల్లాలో ప్రత్యేక పంచాయతీలు ఏర్పాటు చేయాలని కొన్ని అనుబంధ గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఏడేళ్ల క్రితం గత ప్రభుత్వం జిల్లాలో 208 గ్రామాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. ఎన్నికలు నిర్వహించి పాలకవర్గాలను సైతం ఏర్పాటు చేసింది. ప్రస్తుతం జిల్లాలో పంచాయతీల సంఖ్య 532కి చేరింది. ఇది వరకు కొత్త పంచాయతీలు ఏర్పాటైన నేపథ్యంలో మరిన్ని పంచాయతీల డిమాండు ఊపందుకుంది. ఎమ్మెల్యేలు చొరవ తీసుకుని కొత్త పంచాయతీల ఏర్పాటుకు కృషి చేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

**ఎక్కడెక్కడంటే..**నాగిరెడ్డిపేట మండలం జలాల్‌పూర్ నుంచి ఎర్రారంను కొత్త పంచాయతీగా ఏర్పాటు చేయాలనే ప్రతిపాదన ఉంది.

ఎల్లారెడ్డి మండలం అడివిలింగాల తండాను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని లేదా పాత పంచాయతీలో విలీనం చేయాలని తండావాసులు ఇదివరకే ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేశారు. అడివిలింగాల తండాను కొత్తగా ఆవిర్భవించిన కొక్కొండ పంచాయతీలో విలీనం చేశారు.

భిక్కనూరు మండలం లక్ష్మీనగర్‌తండా జంగంపల్లి పంచాయతీలో ఉ



ంది. ఈ రెండు గ్రామాల మధ్య దూరం మూడు కి.మీలు కావడంతో ప్రత్యేక పంచాయతీ డిమాండ్ నెలకొంది.

మద్నూర్ మండలంలో సలాబత్‌పూర్ ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలనే డిమాండ్ ప్రజల్లో ఉంది. ఇది చిన్నశక్కర్గ పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉంది.

బీబీపేట పంచాయతీకి అనుబంధ గ్రామంగా ఉన్న రాంరెడ్డిపల్లిని ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**ఈ పరిస్థితి ఎందుకంటే..**

కొత్త పంచాయతీల డిమాండ్లు జిల్లాలో అక్కడక్కడ వినిపిస్తున్నాయి. కొందరు జిల్లా పంచాయతీ అధికారులను కలిసి చాలాసార్లు వినతిపత్రాలు అందజేశారు. మరికొందరు వారి ఎమ్మెల్యేల ద్వారా ప్రభుత్వానికి విన్నవించారు. ఈ ప్రత్యేక పంచాయతీల డిమాండ్లకు వివిధ రకాల కారణాలు ఉన్నాయి. చిన్నగ్రామాలు, రెండు మూడు తండాలను కలిపి ఒకే పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఈ రెండు మూడు తండాలు, గ్రామాల మధ్య దూరం రెండు మూడు కి.మీ దూరం ఉంటుంది. దీంతో ప్రతి పనికి పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు వెళ్లాల్సి వస్తోందని కారణం చెబుతున్నారు. మరొక ముఖ్య కారణం నిధుల పంపకాల్లో తేడాలు ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. పంచాయతీ ఉన్న గ్రామానికి లేదా తండాకు మాత్రమే ఎక్కువ నిధులు ఖర్చు చేసి అభివృద్ధి చేసుకుంటున్నారని అనుబంధ గ్రామాల ప్రజల వాదనగా ఉంది. పంచాయతీ ఉన్న గ్రామాల వారికే పదవులు వరించే అవకాశం ఉండడంతో అనుబంధ గ్రామాల వారు అసంతృప్తిగా ఉంటున్నారు.

# హరితం పెంచండి.. ఆదాయం పొందండి

కామారెడ్డి : పర్యావరణ పరిరక్షణ కోసం సర్కారు వనమహోత్సవం కార్యక్రమం ద్వారా జిల్లాలో మొక్కలు నాటుతుంది. అంతకు ముందు హరితహారం పేరుతో మొక్కలు నాటించారు. గతంలో నాటిన మొక్కలు ఇప్పుడు బతికి ఉంటే అవి ఆదాయ వనరులుగా మారనున్నాయి. ప్రభుత్వం తాజాగా కార్బన్ క్రెడిట్ పేరుతో కొత్త పథకాన్ని తీసుకువచ్చింది. దీనిని తెలంగాణ సౌభాగ్యం అని కూడా పిలుస్తున్నారు. ఈ పథకంలో గత మూడేళ్లలో నాటిన మొక్కలు బతికి ఉంటే అవి విడుదల చేసే ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి యజమానులకు డబ్బులు అందనున్నాయి. 2022-23, 2023-24, 2024-25 సంవత్సరాల్లో నాటిన మొక్కలను లెక్కించడానికి త్వరలో సర్వే చేపట్టనున్నారు.

**ప్రభుత్వంతో ఒప్పందం**

ప్రభుత్వం దిల్లీలోని పర్యావరణ సంస్థ ఐఓఆర్ఏతో ఒప్పందాన్ని కుదుర్చుకుంది. పెరిగిన మొక్కలను పరిశీలన చేసి యజమానులకు డబ్బులు చెల్లించడమే దీని ముఖ్య ఉద్దేశం. జిల్లాలో మూడేళ్లలో సుమారు 70 లక్షల వరకు మొక్కలు నాటారు. ఎన్ఐసీ పోర్టల్‌లో నుంచి నాటిన మొక్కల వివరాలను ఆయా మండలాలకు పంపిస్తున్నారు. సాంకేతిక సహాయకులు చరవాణుల్లో ప్రత్యేక యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. వీరు సర్వే చేసే సమయంలో బతికి ఉన్న మొక్కల ఫొటోలు తీసుకుంటారు. ఉపాధిహామీలో వ్యక్తిగతంగా మొక్కలు పెంచితే యజమాని ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతా, పట్టాపాస్ పుస్తకాల వివరాలను తీసుకుంటారు. సర్వే పూర్తయిన తర్వాత ఐఓఆర్ఏ సంస్థ వారు క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారణ చేసుకుంటారు.

**చెల్లింపులు ఇలా..**

సర్వే పూర్తయిన తర్వాత నాటిన మొక్కలు ఏ స్థాయిలో ఉన్నాయి.. అవి ఎంత ఆక్సిజన్‌ను విడుదల చేస్తున్నాయనే విషయాలను సంస్థ వారు లెక్కగడుతారు. ఆక్సిజన్ పరిమాణాన్ని బట్టి లెక్కలు ఉంటాయి. ప్రస్తుతం జిల్లాలో ఇదే అంశంపై కొన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. చాలా మంది రైతులు తమ మొక్కలను ఇతర కంపెనీ వారు కొనుగోలు చేసినట్లా అని ప్రశ్నిస్తున్నారు. అలా కాదని కేవలం ఆక్సిజన్ పరిమాణం ఆధారంగా రైతులకు డబ్బులు చెల్లిస్తారని అధికారులు సమాధానం చెబుతున్నారు. ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాల్లో నాటిన మొక్కలపై పంచాయతీకి డబ్బులు చెల్లిస్తారు. ఈ విషయమై డీఆర్‌డీవో సురేందర్ మాట్లాడుతూ.. కార్బన్ క్రెడిట్ పేరుతో పెరిగిన మొక్కలకు కొన్ని డబ్బులు చెల్లించాలనేది ఈ సంస్థ ముఖ్య ఉద్దేశం. ప్రస్తుతం గ్రామసభలు నిర్వహిస్తున్నాం. తర్వాత వివరాలను రాష్ట్రానికి పంపిస్తాం. పర్యావరణాన్ని సంరక్షించడానికి ఎవరైతే మొక్కలు నాటి పోషిస్తారో వారికి కొంత పారితోషికం అందుతుందని తెలిపారు.

# మట్టి దందా ఆగేదెన్నడో?



ఎల్లారెడ్డిపేట : జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, తంగళ్లపల్లి, వేములవాడ అర్బన్, వేములవాడ రూరల్, కోనరావుపేట, సిరిసిల్ల తదితర మండలాల్లో గుట్టలను అక్రమార్కులు లక్ష్యంగా చేసుకున్నారు. సాధారణంగా మట్టిని రవాణా చేయాలంటే క్యూబిక్ మీటర్ల చొప్పున ప్రభుత్వానికి నిర్ణీత రుసుం చెల్లించాలి. దరఖాస్తు ఆధారంగా రెవెన్యూ, గనుల శాఖల అధికారులు పరిశీలించి, అనుమతులు జారీ చేయాలి కానీ.. జిల్లాలో ఇలాంటివేవీ లేకుండానే విలువైన మట్టి, మొరంను ఇష్టారాజ్యంగా తవ్వేస్తున్నారు. జిల్లాలో ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావడంతోపాటు ప్రైవేటు భవనాలు, పరిశ్రమల నిర్మాణాలు పెద్ద ఎత్తున కొనసాగుతున్నాయి. కొందరు యంత్రాలు, టిప్పర్ల యజమానులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పేరిట మట్టి, మొరంను పక్కదారి పట్టిస్తుండగా మరికొందరు ఎలాంటి అనుమతులు లేకుండా నిర్భయంగానే రవాణా చేస్తున్నారు.

ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్, పోతురెడ్డిపల్లి గ్రామాల నడుమ చీకటిపూట మట్టిని తరలించే టిప్పర్ ఢీకొట్టడం వల్ల అడవి పంది చనిపోయింది. సదరు టిప్పర్ డ్రైవర్ చనిపోయిన అడవిపంది మాంసాన్ని తీసుకెళ్లి, కొంతమేర కళేబరాన్ని అక్కడే వదిలిపెట్టి వెళ్లినట్లు గ్రామస్థులు చర్చించుకున్నారు. వెంకటాపూర్, పోతురెడ్డిపల్లి గ్రామాల మధ్య అటవీ ప్రాంతం ఎక్కువగా విస్తరించి ఉంటుంది. రాత్రి సమయాల్లో అడవిపందులు, జింకలు, దుప్పులు, కుందేళ్లతోపాటు ఎలుగుబంట్లు వంటి జీవులు కూడా తరచుగా కనిపిస్తాయని రైతులు చెబుతున్నారు. అక్రమంగా మట్టిని తరలించే వాహనాలతో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయా గ్రామాల శివారు అటవీ ప్రాంతాల్లోని గుట్టలు, ఎత్తయిన ప్రదేశాలు మాయమవుతున్నాయి. రేయింబవళ్లూ యంత్రాల శబ్దాలు, మట్టి రవాణాతో వన్యప్రాణులు, ఇతర అటవీ జంతువులు తమ ఆవాసాలను కోల్పోతున్నాయి. దీంతో కొత్తగా ఆవాసాన్ని ఏర్పరచుకోవడం కోసం వనాలను వీడి జనావాసాల్లోకి వచ్చి చేరుతున్నాయి. ఎల్లారెడ్డిపేట మండలం పదిర, హరిదాస్‌నగర్, రాగట్లపల్లి తదితర ప్రాంతాల్లో కొద్దిరోజుల క్రితం చిరుతలు సంచరించినట్లు అటవీశాఖ అధికారులు గుర్తించారు. వేములవాడ నుంచి సిరికొండ వైపుగా పెద్దపులి కూడా వెళ్లినట్లు నిర్ధారించారు. గొండగొర్రెలు, అడవిపందులు, మయూరాలు, కుందేళ్లు తదితర అటవీ జీవులు పల్లెల పక్కన ఉండే వ్యవసాయ పొలాల్లోకి వచ్చి చేరుతున్నాయి. ఇలా అడవులను వీడుతున్న వన్యప్రాణులు, అటవీ జీవులు వేటగాళ్ల ఉచ్చులకు అవలీలగా చిక్కే అవకాశాలున్నాయి.

అధికారులు దాడులు చేస్తున్నా మట్టి, మొరం దందా ఆగడం లేదు. చిన్నపాటి గుట్టలు, మైదానాలు, చెరువు శిఖం భూములను కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. మరోవైపు ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. అనుమతులు లేకుండా మట్టి, మొరంను ఇతర ప్రాంతాలకు భారీ వాహనాల్లో తరలిస్తూ సొమ్ముచేసుకుంటున్నా సంబంధిత శాఖల అధికారులు పూర్తిస్థాయిలో పట్టించుకోవడం లేదని, నామమాత్రపు దాడులతో సరిపెడుతున్నారనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

## ఇందిరమ్మ ఇంటికి మోకాలడ్డు

ఇల్లెందు : తిలక్‌నగర్ పంచాయతీ, 21 పిట్ ఏరియాకు చెందిన వాసం విజయకు ఇందిరమ్మ గృహం మంజూరైంది. ఖాళీ స్థలంలో గుంతలు తీసింది. సింగరేణి అధికారులు అడ్డుకోవటంతో ఇంటి నిర్మాణం నిలిచిపోయింది. నూతన గని నిర్వాసిత జాబితాలో అసలు 21పిట్ ఏరియా లేదు. 24 ఏరియాలోనూ ఇదే పరిస్థితి. కుంచపు రాజేశ్వరి తన శిథిలావస్థ ఇంటిని కూల్చేసి ఇందిరమ్మ ఇంటి నిర్మాణం ప్రారంభించింది. అధికారులు ఇది సింగరేణి స్థలం అంటూ అడ్డుకున్నారు. దీంతో ఆ కుటుంబం నిలువ నీడలేక రోడ్డున పడింది. వారి ఇంట్లో ఓ దివ్యాంగుడు సైతం ఉండటంతో రోడ్డు పక్కన జీవనం సాగించలేక కుటుంబం నానా అవస్థలు పడుతుంది.

దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించలేదన్న చందంగా మారింది ఇల్లెందు పరిధిలో కొంతమంది ఇందిరమ్మ గృహ లబ్ధిదారుల పరిస్థితి. 24ఏరియా, 21 పిట్ ఏరియాలో పేదలకు ఇళ్లు మంజూరయ్యాయి. వారు నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న క్రమంలో గని విస్తరణ పేరిట సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారు.

**ఇదీ విషయం..**ఇల్లెందులో ఏకైక జేకే-5 ఓసీలో నిల్వలు నిండుకుంటున్న క్రమంలో బొగ్గుట్ట భవిష్యత్తును కాపాడేందుకు సింగరేణి యాజమాన్యం ఉపరితల గని ఏర్పాటుకు చర్యలు చేపట్టింది.



కోల్‌మైన్ పేరుతో దాదాపు 290 హెక్టార్ల విస్తీర్ణంలో నూతన ఓసీ ఏర్పాటుకు సన్నాహకాలు పూర్తి చేశారు. మండలంలోని విజయలక్ష్మినగర్ పంచాయతీ వాసులను నిర్వాసితులుగా గుర్తించారు. వారితో పూర్తి స్థాయి చర్చలు అనంతరం, పరిహారం అందించాక ఇళ్లను ఖాళీ చేయించి, ఆ ప్రాంతంలో గని విస్తరణ మొదలుపెడతారు. నిర్వాసిత జాబితాలో లేని ఇల్లెందు పట్టణం, మండల పరిధిలోని 21పిట్ ఏరియా, 24ఏరియా, కుమ్మరిబస్తీ, భూపేశ్‌నగర్ ప్రాంతాల్లో కొంతమంది ఇందిరమ్మ ఇంటి పనులు చేపడుతుంటే సింగరేణి అధికారులు అడ్డుకుంటున్నారు. గని విస్తరణ నేపథ్యంలో భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఇక్కడ ఇళ్ల నిర్మాణానికి అంగీకరించబోమని చెబుతున్నారు. లీజు స్థలంలో నిర్మాణాలు చేపడు తున్నారు: అంజిరెడ్డి, ఎస్‌అండ్‌పీసీ అధికారి సింగరేణి సంస్థ లీజు స్థలంలో నిర్మాణాలు చేపడుతున్నందున్న జీఎం ఆదేశానుసారం అడ్డుకు ంటున్నాం. కంపెనీ స్థలాలు కబ్జాకు గురికాకుండా జాగ్రత్తలు చేపడుతున్నాం.

## 'పైసా'చికం..!

సూర్యాపేట :"సూర్యాపేటలో రెండు నెలల క్రితం మోతెకు చెందిన మహిళకు గర్భవిచ్ఛిత్తి వికటించి మృతిచెందిన విషయం విదితమే. ఆమెకు నకిరేకల్‌లో లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు అప్పట్లో పోలీసులు తమ విచారణలో తేల్చారు. చర్చికంపౌండ్ ప్రాంతంలో మెడికల్ షాపు ముసుగులో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న విషయం శుక్రవారం వెలుగు చూసింది. ఏడాది నుంచి ఇక్కడ వందలాది పరీక్షలు నిర్వహించినట్లు సమాచారం. ఇందుకు ఒక్కో గర్భిణి నుంచి రూ.పది వేలు వసూలు చేస్తున్నారు." కఠినమైన చట్టాలు అమలులో ఉన్నప్పటికీ సూర్యాపేట జిల్లా కేంద్రంలో లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలు యధేచ్ఛగా కొనసాగుతున్నాయి. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడిన అక్రమార్కులు పోలీసులకు పట్టుబడినా.. తిరిగి ఇదే దుర్మార్గానికి ఒడిగడుతుండటం గమనార్హం. పీసీపీఎన్‌డీటీ యాక్ట్ లాంటి కఠినమైన చట్టాలు వీరిని ఎందుకు కట్టడి చేయలేకపోతున్నాయన్న ప్రశ్నలు



సామాన్యుడిని తొలచివేస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తుండటంతోనే వీరి ఆగడాలకు అంతు లేకుండా పోతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**వేటు పడినా..**

ఈ వ్యవహారంలో సంబంధిత అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గత డీఎంహెచ్‌వో కోటాచలం హయాంలో నకిలీ వైద్యులు, స్కానింగ్ కేంద్రాలు, అనుమతి లేని ఆసుపత్రులపై పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు తనిఖీలు నిర్వహించి కొన్ని ఆసుపత్రులు, వైద్యులపై చర్యలు తీసుకున్నారు. ఈ నేపథ్యంలోనే నకిలీ వైద్యుల నుంచి లంచం డిమాండ్ చేసి డీఎస్పీ పార్థసారథి, ఇన్‌స్పెక్టర్ వీర రాఘవులు ఏసీబీకి చిక్కిన విషయం విదితమే. అనంతరం డీఎంహెచ్‌వోపై అవినీతి ఆరోపణలు రావడంతో బదిలీ వేటు పడింది. ఆ తర్వాతా లింగ నిర్ధారణ పరీక్షలకు చెక్ పడుతుందని ఆశించినా మళ్లీ వెలుగుచూడటం దిగ్భ్రాంతి కలిగిస్తోంది.

కాసులు కురిపిస్తున్న అక్రమ వ్యాపారం

లింగ నిర్ధారణ పరీక్షలు, భ్రూణ హత్యలపై సంబంధిత అధికారుల పర్యవేక్షణ లోపం కొంత మంది అక్రమార్కులకు కాసుల వర్షం కురిపిస్తోంది. గతంలో ఈ తతంగం ఖమ్మం, మహబూబాబాద్ లాంటి పట్టణాల్లో ఎక్కువగా జరిగేది. ప్రస్తుతం కొందరు ఇక్కడే ఈ అకృత్యాలకు తెరలేపారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు అందిస్తున్న కొంత మంది ఆర్ఎంపీలను మధ్యవర్తులుగా చేసుకొని ఈ వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. వారసుల కోసం తల్లిదండ్రుల ఆశ అక్రమార్కులకు ఆసరాగా మారుతోంది. జిల్లాలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, క్లీనిక్‌లు కేవలం అబార్షన్లు చేసేందుకే ఏర్పాటు కావడం గమనార్హం. ఇప్పటికైనా పోలీసులు, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించి భ్రూణ హత్యల నియంత్రణకు కఠినంగా వ్యవహరించాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం: వెంకటయ్య, ఇన్‌స్పెక్టర్, సూర్యాపేట**

సూర్యాపేటలో అక్రమంగా లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న ఇద్దరిపై వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టాం. అల్ట్రా సౌండ్ స్కానింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నాం. ఈ కేసులో ఎవ్వరినీ విడిచిపెట్టే ప్రసక్తే లేదు. వీరికి సహకరించిన ఆర్ఎంపీలనూ రిమాండ్ చేస్తాం.

## గంజాయి దందా.. అక్రమార్కుల పంథా




పెద్దపల్లి : జిల్లాలో గంజాయి రవాణా జోరుగా సాగుతోంది. పోలీసులు తనిఖీ చేసి పట్టుకుని కేసులు నమోదు చేస్తున్నా.. అడ్డుకట్ట పడటం లేదు. అక్రమార్కులు రోజు రోజుకు తమ రవాణా పంథాను మార్చుకుంటున్నారు. పెద్దపల్లిలో ఆటో కింది భాగంలో ప్రత్యేక అరను ఏర్పాటు చేసుకుని తరలిస్తుండగా రూ.21 లక్షల విలువైన 41.88 కిలోల గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఉమ్మడి జిల్లాకు గంజాయి రవాణా హబ్‌గా పెద్దపల్లి ప్రాంతం మారిందన్న ఆరోపణలున్నాయి. రైలు, రోడ్డు మార్గాలతోపాటు ఒడిశా, చత్తీస్‌గఢ్ కూలీలు గంజాయి రవాణాకు సహకరిస్తున్నారు. వీరి ద్వారా పెద్ద మొత్తంలో రవాణా జరుగుతోంది. మరికొందరు జిల్లాలోని రహస్య ప్రాంతాల్లో గంజాయి మొక్కలు సాగు చేస్తున్నారు. విద్యార్థులు, యువతతోపాటు నిరుద్యోగులు గంజాయికి బానిసలుగా మారుతున్నారు.

**మూలాలు అన్వేషించకపోవడంతో..**

రెండు నెలల కిందట సుల్తానాబాద్‌లోని ఓ బియ్యం మిల్లులో గంజాయి మొక్కలు వెలుగులోకి వచ్చాయి. గతంలోనూ ఇదే మిల్లులో గంజాయి మొక్కలను గుర్తించిన పోలీసులు కేసు నమోదు చేశారు. కానీ మూలాల గురించి అన్వేషణ చేయకపోవడంతో మరోసారి అక్కడే పట్టుబడటం గమనార్హం. ఈ ప్రాంతంలో బియ్యం మిల్లులు, ఇతర పరిశ్రమలు, భవన నిర్మాణం, ఫర్నీచర్ తదితర పనులు నిర్వహించే కూలీలు పని చేయడంతోపాటు గంజాయి వ్యాపారం చేస్తున్నారనే ప్రచారం కొన్ని రోజులుగా సాగుతోంది.

**ఛాయ్ దుకాణాలే అడ్డాలు**

పొడి, ద్రవరూపంలో సులభంగా దొరకడం, పాన్‌టేలాలు, ఛాయ్ హోటళ్లు విక్రయాలకు అడ్డాలుగా మారాయి. గ్రామీణ ప్రాంతాలకు విస్తరించిన కార్పొరేట్ స్థాయిలోని టీ దుకాణాల్లో సిగరెట్ తాగేందుకు ప్రత్యేక గదులను కేటాయిస్తున్నారు. ఈ గదుల్లోనే సిగరెట్‌మాటున యువత గంజాయి తాగుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఛాయ్ తాగడానికంటే గంజాయి తాగడానికే కొన్ని హోటళ్లకు యువత ఎగబడుతున్నట్లు సమాచారం. ఈ పరిస్థితిని నియంత్రించేందుకు పోలీసులు ఛాయ్ దుకాణాల్లోని ప్రత్యేక గదులపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది.

**దొరికితే జైలుకే..**గంజాయి రవాణాపై 2021లో బసంత్‌నగర్ పోలీసులు కేసులు నమోదు చేయగా ముగ్గురికి ఈ నెల 13న పెద్దపల్లి జిల్లా న్యాయమూర్తి 7 ఏళ్ల జైలు శిక్ష, ఒక్కొక్కరికి రూ.20 వేల జరిమానా విధించారు.గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులు 2017లో నమోదు చేసిన గంజాయి రవాణా కేసులో నిందితులు ఇద్దరికి ఈ నెల 24న జిల్లా న్యాయమూర్తి ఒక్కొక్కరికి అయిదేళ్ల జైలుశిక్షతోపాటు రూ.10 వేల జరిమానా విధించారు.


## నాలాల చుట్టూ.. ఆక్రమణల గుట్టు..!

కరీంనగర్ : సాయికృష్ణ థియేటర్ సమీపంలో ఉన్న ఈ నాలా కూడలిలోనే నగరంలోని 40 శాతం వరద కలుస్తోంది. వాస్తవానికి 12 అడుగుల విస్తీర్ణంలో ఉండే ఈ కాలువలో పట్టాల్సిన నీళ్లకన్నా దాదాపు మూడింతల వరద అధికంగా వస్తోంది. నీటి ప్రవాహం ముందుకెళ్లే దిక్కు లేక రోడ్లపై పారుతూ.. ముకురంపుర, కలెక్టరేట్ వరకు నిలుస్తున్నాయి. ఇటీవల కురిసిన వానకు కరీంనగర్ జలమయమైంది. నాలాల నుంచి పొంగిపొర్లిన వరద రోడ్లను ముంచెత్తింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లకు చేరిన బురద జనజీవనాన్ని అస్తవ్యస్తంగా మార్చింది. స్మార్ట్‌సిటీ, అభివృద్ధికి ఐకాన్‌గా చెప్పుకొనే నగరానికి ఇదేమి కర్మ అని జనాలు తిట్టుకునే పరిస్థితి ఎదురైంది. భారీ వానలకు ఇంకెంతటి అనర్థాల్ని ఈ విపత్తు రూపంలో ఎదుర్కోవాల్సి వస్తుందనే దిగాలు ప్రజల్లో నెలకొంది.

**బల్దియా ఏం చేస్తున్నట్లు?**

దాదాపు 32 కి.మీ మేర నగరంలో విస్తరించి ఉన్న నాలుగు పెద్ద నాలాలపైన ఇష్టారాజ్యంగా ఇళ్లు, దుకాణ సముదాయాల్ని నిర్మించేశారు. నిబంధనలకు విరుద్ధంగా కాలువల స్థలాలను కబ్జా చేస్తూ కట్టిన ఇళ్ల విషయంలో బల్దియా వ్యవహరించిన తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అసలు రహదారి, సెట్‌బ్యాక్‌ల ఊసే లేకుండా ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఎలా ఇచ్చారు. దర్జాగా ఆక్రమించిన కట్టడాలను కూల్చే పరిస్థితి లేదు. పైగా ఉన్న నాలాను వెడల్పు చేయడమనేది ఇప్పుడున్న పరిస్థితుల్లో కష్టమైన ప్రక్రియనే. కనీసం నాలాలో పేరుకున్న మట్టిని చెత్తా చెదారాన్ని తీసేందుకు వీలు లేకుండా వీటిపైన భవనాలను కొన్ని చోట్ల నిర్మించారు. ఇప్పుడు ఈ



కాలువల్లోనుంచి నీరు ముందుకు సాగడం కష్టమవుతోంది.

పట్టణ ప్రణాళిక విభాగం తప్పిదాల పాపమే ఇలా ముంపు బెడద రూపంలో ప్రజలను వెంటాడుతోంది. ఇప్పటికైనా బృహత్తర ప్రణాళిక అమలుతో భవిష్యత్తులో వరద ముంపు లేకుండా చూడాల్సిన అవసరముంది.

అసలు పరిమాణం తక్కువగా ఉండటం.. నీటి ప్రవాహం ఇంతకింతకు పెరగడంతో దాదాపు అన్ని ప్రధాన రహదారులకు ఈ సమస్య ఇబ్బందిని కలిగిస్తోంది. చిన్నా చితకా మురుగు కాలువలన్నీ కలిపి 321 కి.మీ పొడవున్నాయి. వీటన్నింటి నుంచి వచ్చే వరద ఈ నాలాల్లో పడి ముందుకెళ్లకపోవడం.. చాలా చోట్ల కొన్నేళ్ల కిందట నిర్మించిన డ్రైనేజీలు వంకర, మలుపులతో నిర్మించడంతో సాఫీగా వాన నీరు వేళ్లే పరిస్థితి లేదు.

## వర్షాభావం.. వరిసాగుపై ప్రభావం

భువనగిరి : జిల్లాలో నెలకొన్న వర్షాభావ పరిస్థితులు పంటల సాగుపై తీవ్ర ప్రభావం చూపింది. ప్రధానంగా వరి సాగు విస్తీర్ణంగా గతేడాది వానాకాలంతో పోల్చుకుంటే సగం కూడా చేపట్టలేదు. కేవలం 42.70 శాతం మాత్రమే సాగైంది. అందులోనూ మూసీ పరివాహక ప్రాంతాల్లోనే ఎక్కువగా సాగు చేశారు. ఆగస్టు మాసాంతం వరకు వరి నాట్లు వేసేందుకు సమయం ఉన్నప్పటికీ రాబోయే రోజుల్లో సమృద్ధిగా వర్షాలు పడితేనే సాధ్యమౌతుంది. గత వారం రోజులుగా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలే మినహా భారీ, అతి భారీ వానలు ఎక్కడా పడలేదు. మెట్ట పంటలకు ప్రయోజనం చేకూరిందే తప్ప వరికి ఒరిగిందేమి లేదు. జిల్లాలో 2024-25లో 2,87,985 ఎకరాల్లో సాగు కాగా.. ఈసారి ఇప్పటి వరకు కేవలం



1,22,978 ఎకరాల్లోనే నాట్లేశారు. గత ఏడాది ఇదే సమయానికి సుమారుగా 2లక్షల ఎకరాల్లో నాట్లు పడ్డాయి.

**ఐదు మండలాల్లోనే అధికం..** ఆసీఫ్‌నహర్ ఆనకట్ట కింద ఎక్కువ సాగు చేశారు. రామన్నపేటలోనే 22 వేల ఎకరాల్లో నాట్లు పడ్డాయి. ఆ తదుపరి వర్షాధారిత ప్రాంతమైన రాజపేట మండలంలో 14,651, వలిగొండ మండలంలో 11,150 ఎకరాల్లో వేశారు. బీబీనగర్, భూదాన్‌పోచంపల్లి మండలాల్లోనూ ఇదే పరిస్థితి. ఇక నారాయణపురం మండలంలో జిల్లాలోనే అత్యల్పంగా 900 ఎకరాల్లో వరి వేశారు. ఈ మండలంలో 26 మీటర్ల లోతుకు భూగర్భజలాలు పడిపోవడం ప్రధాన కారణం. మోత్కూరు మండలం లోనూ అదే పరిస్థితి. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కొండపోచమ్మ, బస్వాపూర్ జలాశయాల నుంచి చెరువులు నింపితే తప్ప వరి సాగు విస్తీర్ణం పెరిగే అవకాశం లేదు. అతి భారీ వర్షాలు కురిసి చెరువు కుంటలైనా నిండాలి. లేదంటే సాగు తగ్గి రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

## మార్గాలకు మహర్దశ..!

నల్గొండ రాష్ట్ర అభివృద్ధికి ప్రధాన సూచిక రహదారులే.. కొన్నాళ్లుగా నిర్వహణ లేకపోవడంతో అవి అధ్వానంగా మారాయి. నల్గొండ, సూర్యాపేట జిల్లాలో ఆర్ అండ్‌బీ రహదారులు పెద్ద సంఖ్యలో దెబ్బతిన్నాయి. గుంతల రోడ్లతో వాహనదారులు ఇబ్బందులు పడుతూ ప్రయాణం చేస్తున్నారు. గమనించిన ప్రభుత్వం తాజాగా రోడ్ల అభివృద్ధిపై దృష్టి సారించింది. హ్యామ్ పద్ధతిలో మెరుగైన రవాణ సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో రోడ్లను రాష్ట్రవ్యాప్తంగా 17 ప్యాకేజీలుగా విభజించి అభివృద్ధి, విస్తరణ చేపట్టాల ని నిర్ణయించింది. అందులో భాగంగా నల్గొండ సర్కిల్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాలో అభివృద్ధి చేపట్టనున్న రహదారులను రెండు ప్యాకేజీలుగా విభజించారు. టెండర్ల ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

**537.78 కి.మీ... రూ.622 కోట్లతో అభివృద్ధి**

నల్గొండ సర్కిల్ పరిధిలోని నల్గొండ, సూర్యాపేట జిల్లాల పరిధిలో 44 రోడ్లను గుర్తించి, 537.78 కి.మీ. మేర రోడ్లు ఉన్నతీకరించేందుకు ప్రతిపాదించారు. సుమారు రూ.622 కోట్లతో అంచనాలు తయారు చేశారు. ప్యాకేజీల వారీగా టెండర్ల ప్రక్రియకు సన్నద్ధమయ్యారు. రెండు జిల్లాల్లో చాలా ప్రాంతాల్లో రద్దీగా ఉండి, అధ్వానంగా మారిన రోడ్ల అభివృద్ధికి తొలి ప్రాధాన్యం ఇచ్చారు. హ్యామ్ పద్ధతిలో వీటి నిర్మాణం పూర్తి చేయనున్నారు.

**రెండో ప్యాకేజీల్లో...**

సాగర్ పీడబ్ల్యూ రోడ్డు-రాజవరం, పడమటపల్లి-శ్రీశైలం రహదారి, మాడ్గులపల్లి-సాగర్, డిండి-దేవరకొండ వయా బాపనకుంట, కొత్తపల్లి-అంజపూర్ వయా ధర్మాతండా, కుక్కడం-పాములపహాడ్, బొత్తలపాలెం-రాగడప, ముకుందాపురం-తుమ్మడం, బరాఖత్‌గూడెం-కాగితా రామచంద్రపురం, కోదాడ-రివర్ రోడ్డు, రాగినిగూడెం-బరాఖత్‌గూడెం, శాంతినగర్-నడిగూడెం, హుజూర్‌నగర్ లింక్‌రోడ్డు, రింగ్ రోడ్డు, దురాజ్‌పల్లి- గరిడేపల్లి, హుజూర్‌నగర్- యాతవాకిళ్ల, కోదాడ- రివర్‌రోడ్డు, హుజూర్‌నగర్- మేళ్లచెరువు, దామరచర్ల-జాన్‌పహాడ్, సూర్యాపేట-నెమ్మికల్, గౌరారంతండా-నెమ్మికల్, మాదారం-చీదెళ్ల రోడ్లను ఉన్నతీకరించనున్నారు

**ఉన్నతీకరించే రోడ్లు ఇవే..!**

నల్గొండ-మహబూబ్‌నగర్, నల్గొండ-చౌటుప్పల్, నల్గొండ-కట్టంగూర్, మునుగోడు-చౌటుప్పల్, మునుగోడు-కొండాపూర్, ఇడికూడ-నారాయణపూర్, కచలపూర్-కిష్టాపురం, ఎంఎన్‌రోడ్డు-యాచారం వయా తుర్కపల్లి, ఎంఎన్ రోడ్డు-నాగార్జునసాగర్ రోడ్డు, నకిరేకల్-మూసీ వయా నోముల, కట్టంగూరు-ఈదులూరు, నకిరేకల్-గురజాల వయా కడపర్తి, కరుమర్తి-శాలిగౌరారం(ఆకారం), ఈదులూరు-తక్కెళ్లపాడు, తక్కెళ్లపాడు-మనిమద్దె.

## ఇంకుడు గుంత.. నిధుల చింత!

పెద్దశంకరంపేట: ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకించి భూగర్భజలాలను పెంచడమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఇంకుడు గుంతల నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. స్వచ్ఛభారత్ మిషన్ కింద చేపట్టే సామాజిక ఇంకుడు గుంతల నిర్మాణాలకు లక్ష్యాలనూ నిర్దేశించింది. 2025-26 ఆర్థికసంవత్సరంలో గ్రామాల్లో ఇంకుడు గుంతలు ముమ్మరంగా నిర్మించాలని నిర్ణయించింది. గ్రామాల్లో మురుగు కాలువల చివరన వదిలేయడంతో అక్కడ దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు విజృంభిస్తుంటాయి. ఈ బెడద లేకుండా ఉండేలా సామాజిక ఇంకుడుగుంతల ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. అయితే నిధుల కొరతతో వెనుకడుగు పడుతోంది.

**ఉపాధి నిధులతో..**

స్వచ్ఛభారత్ మిషన్ కింద మురుగు కాలువల చివర పెద్దవి, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, ఆలయాలు, గ్రామపంచాయతీలు, నీటి ట్యాంకుల వద్ద చిన్నవి నిర్మించాలని నిర్దేశించారు. గ్రామపంచాయతీలలో ప్రస్తుతం నిధులు లేక అడుగు ముందుకు పడటం లేదు. సర్పంచిలు లేకపోవడంతో 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించలేదు. గ్రామ కార్యదర్శులు నిధుల్లేక పారిశుద్ధ్య పనులకే ఇబ్బందులు పడుతున్నారు. మళ్లీ వీటికి సొంతంగా డబ్బు పెట్టే పరిస్థితి లేదు. జిల్లాకు స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 324 నిర్మాణాలు మంజూరయ్యాయి. ఒక్కోదానికి అయ్యే ఖర్చు రూ.92,747. కేంద్రం 70, పంచాయతీ నుంచి 30 శాతం నిధులు వెచ్చించాలి. ఇప్పటి వరకు కేవలం 25 చోట్ల మాత్రమే పనులు ప్రారంభమయ్యాయి. ఇళ్ల వద్ద ఇంకుడు గుంతల నిర్మాణానికి ఉపాధి నిధులు కేటాయించారు.

**అక్టోబరు నాటికి సందేహమే..**

ఉపాధి హామీ కింద వ్యక్తిగత ఇంకుడు గుంతలకు రూ.6500 చెల్లిస్తోంది. సామాజికమైతే రూ.15 వేలు చెల్లిస్తారు. కొన్ని మండలాల్లో నిర్మాణాలకు స్థల పరిశీలన చేసి వదిలేశారు. దీంతో అక్టోబరు నాటికి లక్ష్యాన్ని చేరుకోవడం సందేహమే. 15 రోజుల క్రితం నిర్మాణాలు చేపట్టామని, నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకునేందుకు కృషి చేస్తామని ఎస్‌బీఎం కోఆర్డినేటర్ ఇలియాస్ తెలిపారు.

## జీర్ణకోశ వ్యాధులకు ఆధునిక చికిత్స

విశాఖపట్నం : మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్ల కారణంగా జీర్ణకోశ వ్యాధులు పెరిగాయి. నిత్యం వందలాది మంది ప్రభుత్వ, ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో విమ్స్, కేజీహెచ్‌కు రోగుల తాకిడి అధికంగా ఉంటోంది. ఇక్కడ ఆధునిక వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.

**అందిస్తున్న సేవలు..:** అన్నవాహిక, పొట్ట, కాలేయం, పాంక్రియాస్, పేగుల వ్యాధులకు విమ్స్‌లో అత్యాధునిక చికిత్సలు అందిస్తున్నారు. శస్త్రచికిత్స అవసరం లేకుండా ల్యాప్రోస్కోపి, ఈఆర్‌సీపీ పరీక్షల ద్వారా వ్యాధి తీవ్రతను అంచనా వేసి మందులతో తగ్గిస్తున్నారు. అప్పటికీ తగ్గని వారికి తదుపరి కొలనోస్కోపి, సిగ్మాయిడో స్కోపి లాంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పేగు పూతలు, రక్తస్రావం, హెర్నియా తదితర




సమస్యలు ఉన్న వారికి స్లీవ్ గ్యాస్ట్రెక్టమీ, గ్యాస్ట్రిక్ బైపాస్, పాంక్రియాస్, కాలేయ శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

**ఓపీకి రోజుకు 1200 మంది:** ఈ విభాగంలో ఇద్దరు వైద్యులు, ఏడుగురు సహాయ సిబ్బంది ఉన్నారు. రోజుకు సుమారు 1200 మంది ఓపీకి వస్తున్నారు. ఇన్‌పేషెంట్లుగా సుమారు 150 చికిత్స పొందుతున్నారు. ప్రయివేటు ఆసుపత్రుల్లో ఎండోస్కోపికి రూ.3వేల నుంచి రూ.50వేల వరకు, ఈఆర్‌సీపీకి సుమారు రూ.50వేలు, కొలనోస్కోపికి రూ.5వేల నుంచి రూ.10వేల వరకు, సిగ్మాయిడో స్కోపికి రూ.5వేల వరకు వసూలు చేస్తున్నారు. విమ్స్‌లో ఇవన్నీ ఉచితంగా చేస్తున్నారు.

**వ్యాధి తీవ్రతను బట్టి శస్త్రచికిత్సలు:** జీర్ణకోశ వ్యాధులతో వచ్చేవారికి ముందుగా మందులు అందించి, ఆహారపు అలవాట్లు, పొగ తాగటం, మద్యం, గుట్కా, పాన్ మసాలా మానేయాలని సూచిస్తున్నాం. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉండేవారికి వివిధ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి శస్త్రచికిత్సలు చేస్తున్నాం. డాక్టర్ రాంబాబు, విమ్స్ డైరెక్టర్

## భూ'కాసురులు'


నంద్యాల : అవుకు మండలం సంగపట్నం గ్రామంలో ఎస్సార్బీసీ గట్టు ఆనుకుని ఉన్న ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా కొందరికి ఆన్‌లైన్ చేసేశారు. ఏకంగా 45 ఎకరాలను కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. పేదల పేరుతో పలువురు పెద్దలు కొట్టేశారన్న ఆరోపణలున్నాయి. ఆయా భూముల విలువ సుమారు రూ.6.75 కోట్ల వరకు ఉంటుందని అంచనా.

**న్యాయస్థానం పరిధిలో ఉన్నా..**

సంగపట్నం గ్రామంలోని సర్వే నంబర్లు 603, 334లో ఉన్న భూములు.. ప్రస్తుతం న్యాయస్థానం పరిధిలో ఉన్నాయి. ఆయా కేసులు పూర్తైతేగానీ.. వాటిని పంపిణీ చేయకూడదు. అయినప్పటికీ వీటిని పలువురికి పంచేశారు. 334వ సర్వే నంబరులోని భూములకు సంబంధించిన పట్టాలను మాత్రం అధికారులు పంపిణీ చేయలేదు. అయినప్పటికీ కొందరు నేతలు ఆ సర్వే నంబరులో ఎక్కడి భూమిని, ఎవరికి కేటాయించారన్న విషయాన్ని అనధికారికంగా కొందరికి చెప్పారు. దీంతో ఆయా భూములను పలువురు తమ అధీనంలో ఉంచుకున్నారు.

**వైకాపా నేతల కన్ను**

సంగపట్నం గ్రామ పరిధిలోని కొండ దిగువన పలు సర్వే నంబర్లలో వంద ఎకరాల వరకు ప్రభుత్వ భూములున్నాయి. ఎస్సార్బీసీని ఆ ప్రాంతం మీదుగా తవ్వడంతో ఆయా భూముల విలువ ఒక్కసారిగా పెరిగింది. వైకాపా హయాంలో కొందరు నాయకుల కళ్లు వీటిపై పడ్డాయి. ఎన్నికల ముందు ఈ భూములను పేదలకు పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేశారు. పేదల పేరుతో కొందరు పెద్దలు



దరఖాస్తు చేసుకున్నారు. రాజకీయ ఒత్తిళ్లు భరించలేక స్థానిక అధికారులు అనర్హుల పేర్లను సైతం రాసి భూ పంపిణీకి రంగం సిద్ధం చేశారు. ఎసైన్‌మెంట్ కమిటీలో తహసీల్దారు, ఆర్డీవో, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, జేసీ సంతకాలుండాలి. దస్త్రంపై అప్పటి జేసీ సంతకాలు లేకుండానే కొందరికి పట్టాలు పంపిణీ చేశారు. కొందరికి పట్టాలు ఇవ్వకుండా ఎక్కడి భూములు కేటాయించారన్న విషయాన్ని చెప్పారు. దీంతో పలువురు ఆయా భూములను అనధికారికంగా స్వాధీనం చేసుకుని సాగు చేసుకుంటున్నారు.

**విచారణ చేపట్టకనే..**

సంగపట్నం గ్రామంలోని ప్రభుత్వ సర్వే నంబర్లు 327, 328, 334, 432, 597, 598, 599, 600, 602, 603లలోని మొత్తం 82 ఎకరాలను అధికారులు పంపిణీ చేశారు. వారిలో కూడా పలువురు అనర్హులున్నారన్న విమర్శలున్నా ఆయా ఆరోపణలపై విచారణ చేపట్టలేదు. ఒక్కొక్కరికి 25 సెంట్ల నుంచి మూడు ఎకరాల వరకు పంపిణీ చేశారు. సంగపట్నం గ్రామానికి చెందిన ఓ మహిళ భర్తకు ఏడెకరాల వరకు పొలం ఉంది. అయినప్పటికీ ఆమె నిరుపేద అని చెప్పి 75 సెంట్ల భూమి తీసుకున్నారు.

భూముల పొందినవారి జాబితాలో ఉన్న ఇద్దరు మహిళలు సంగపట్నం గ్రామానికి చెందినవారే కాదు. వారిద్దరికీ ఒకటిన్నర ఎకరం చొప్పున కేటాయించారు. ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు : సాయికిరణ్, మహబూబ్‌వలి, హసన్, సంగపట్నం గ్రామస్థులు

సంగపట్నం గ్రామంలో పలువురు పట్టాలు లేకుండానే ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారు. కొందరు గ్రామస్థులే కాదు. పలువురి పేర్లను అధికారులు అడ్డగోలుగా ఆన్‌లైన్ చేశారు. గ్రామంలో పేదలున్నప్పటికీ వారిని కాదని వేరే గ్రామాలవారికి భూములిచ్చారు.

# 'అధికార' వల.. చేపకు చెర



పత్తికొండ : పత్తికొండ మండలం పందికోన రిజర్వాయర్‌లో చేపలు పట్టేందుకు గ్రామ పంచాయతీకి నిర్దేశించిన పన్ను చెల్లించి.. తర్వాత విక్రయాలు జరుగుతున్నాయి. ఇక్కడ ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ నాయకులే సొమ్ము చేసుకుంటున్నారు.

మత్స్యకారులకు చేదోడుగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం రిజర్వాయర్లు, చెరువులను వారికి అప్పగించింది. నిర్దేశించిన మత్స్యకార సంఘాలు చేపలు పట్టుకోవడం, విక్రయించాలన్నది నిబంధన. ఉమ్మడి జిల్లాలో మత్స్యకార సంఘాలు చేపలను విక్రయిస్తున్నట్లు దస్త్రాల్లో చూపుతున్నా.. వెనుక బడాబాబుల ఆధ్వర్యంలోనే క్రయవిక్రయాలు సాగుతున్నాయి.

**సంఘాల పేరుతో 'పెత్తనం'**

కర్నూలు జిల్లాలో 27, నంద్యాల జిల్లాలో 32 మత్స్యకార సంఘాలున్నాయి. కర్నూలులో 1,642 మంది, నంద్యాల జిల్లా పరిధిలో 2,153 మంది సభ్యులున్నారు. వీరి ఆధ్వర్యంలోనే జలాశయాలు, చెరువుల్లో చేపలు పడుతున్నారు.

వలలు, దాణా, పుట్టీలు తదితరాలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం మత్స్యకారులకు రుణాలు మంజూరు చేస్తుంది. చాలాచోట్ల వీరు కేవలం చేపలు పట్టేందుకు మాత్రమే పరిమితమవుతున్నారు. వీటిని 'బడాబాబులు' నామమాత్రపు ధరకు కొనుగోలు చేసి బహిరంగ విపణిలో ఎక్కువ మొత్తాలకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు.

**అధికారంలో ఏ పార్టీ ఉంటే వారిదే..**

గత కొన్నేళ్లుగా కొందరు నాయకులు రిజర్వాయర్లు, చెరువులను అనధికారికంగా కబ్జా చేశారు. మత్స్యకారుల నుంచి నేరుగా చేపలను కొనుగోలు చేసి అక్కడే ఐస్ డబ్బాల్లో ప్యాక్ చేసి చేపల మార్కెట్లకు తరలిస్తున్నారు. కొన్నిచోట్ల చేపలను మత్స్యకారుల పేరుతో వీరే వేటాడుతున్నారు. మరికొన్నిచోట్ల ఏపార్టీ అధికారంలో ఉంటే ఆ నియోజకవర్గ నాయకుల పెత్తనం సాగుతోంది. కాదంటే చేపలను పట్టుకోలేని పరిస్థితి నెలకొంది.

మంత్రాలయం నియోజకవర్గ పరిధి.. కోసిగి మండలంలోని పులికనుమ రిజర్వాయరు, పెద్దకడబూరు మండలంలోని రాయల చెరువులో పట్టే చేపలను ఏ పార్టీ అధికారంలో ఉంటే ఆ పార్టీ నాయకులు ప్రభావితం చేస్తున్నారు. ఐదేళ్లుగా ఒక నాయకుడి హవా నడిపిస్తే.. గతేడాది నుంచి మరో నేత పెద్దఎత్తున ఆదాయం సమకూర్చుకుంటున్నారు.

శ్రమ ఒకరిది.. లెక్క మరొకరిది

కర్నూలు జిల్లాలో 425.76 ఎకరాల్లో మంచినీటి చేపలు పెంచుతున్నారు. గాజులదిన్నె, కృష్ణగిరి, పందికోన, పులికనుమ రిజర్వాయర్లతోపాటు 52 చెరువుల్లో ఏటా సగటున 57 లక్షల చేప పిల్లలు వదులుతున్నారు.

నంద్యాల జిల్లాలో వెలుగోడు, గోరుకల్లు, అవుకు, శ్రీశైలం రిజర్వాయర్లతోపాటు 124 చెరువుల్లో సగటున 60 లక్షల చేప పిల్లలు వదులుతున్నారు. కర్నూలు జిల్లాలో 10,846 టన్నుల చేపలు, 23 టన్నుల రొయ్యలు, నంద్యాల జిల్లాలో 21,129 టన్నుల చేపలు, 11.61 టన్నుల రొయ్యలు ఉత్పత్తి జరుగుతుంది. ఉత్పత్తి ఆశాజనకంగా ఉన్నా మత్స్యకార సంఘాలకు ఆదాయం చేరడం లేదు. చాలాచోట్ల చేపలను మత్స్యకారులు వేటాడిన తర్వాత బడాబాబులు సగటున కిలో రూ.50 నుంచి రూ.60కు కొనుగోలు చేస్తున్నారు. బహిరంగ విపణిలో రూ.150కు అమ్ముకుంటున్నారు.

# అద్దె భవనం.. యువతకు వసతి కష్టం



కర్నూలు : పేదింటి బిడ్డలు.. ఉన్నత చదువులకు పట్టణాలకొచ్చారు.. 'అద్దె'భారం భరించలేక పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో ఉంటున్నారు. వీరంతా ఇంటర్, డిగ్రీ, బీటెక్ చదువుతున్నవారే. 31 వసతిగృహాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. అక్కడి సమస్యలు యువత చదువుకు ఆటంకంగా మారాయి. ఒక్కో విద్యార్థికి ప్రభుత్వం రూ.1,600 కేటాయిస్తుంది. ఈ నిధులతో మెనూ అమలు చేయడంతో పాటు గ్యాస్, మరమ్మతులకు వెచ్చించాల్సి ఉంటుంది. అద్దె, విద్యుత్తు బిల్లును ప్రభుత్వం చెల్లిస్తుంది. ప్రస్తుతం ధరలు ఆకాశాన్నంటుతుండటంతో మెనూ సక్రమంగా అమలు కావడం లేదు.

**ఐదు వేల మంది..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 28 బీసీ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో 3,031 మంది విద్యార్థులు ఉన్నారు. 17 వరకు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి.. సొంత భవనాలన్నీ శిథిలావస్థకు చేరాయి.

21 ఎస్సీ పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో 2,655 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు. 12 వరకు అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. గిరిజన విద్యార్థులకు సంబంధించి నంద్యాల జిల్లాలో మూడు వసతి గృహాలు సొంత భవనాల్లో నడుస్తున్నాయి. వీటిలో 250 మంది వరకు గిరిజన యువత ఉంటోంది.

**బిల్లులు రావు.. పర్యవేక్షణ లేదు**

బీసీ విద్యార్థులకు సంబంధించి ఐదు నెలల నుంచి డైట్ బిల్లులు రాకపోవడంతో చాలామంది వార్డెన్లు అప్పులు చేసి వసతిగృహాలను నిర్వహిస్తున్నారు. దీంతో మెనూ అమలు కావడం లేదు. విద్యార్థులకు వండే ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించింది. కళాశాల విద్యార్థులతో ఎఫ్‌ఆర్‌ఎస్ హాజరు వేయించాల్సి రావడం తలనొప్పిగా మారిందని వసతిగృహ అధికారులు పేర్కొంటున్నారు. 15 బీసీ వసతిగృహాల వార్డెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాటి బాధ్యత ఇన్‌ఛార్జులే చూస్తున్నారు. దీంతో హాస్టళ్ల నిర్వహణ గాడితప్పింది. జిల్లా అధికారులు ప్రతినెలా వసతిగృహాలను పరిశీలించాల్సి ఉన్నా పట్టించుకోవడం లేదు. పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థుల సమస్యల గురించి పట్టించుకునేవారే కరవయ్యారు.

**మూడు పట్టణాల్లోనే ఎక్కువ**

కర్నూలు, ఆదోని, నంద్యాల పట్టణాల్లో విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉంటోంది. తక్కువ గదులు ఉండటం.. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టు మరుగుదొడ్లు, స్నానం గదులు లేక ఆరుబయట ప్రాంతాలను ఆశ్రయించాల్సి వస్తోంది. కొన్నింటికి నెలల తరబడి అద్దె చెల్లించకపోవడంతో ఆయా భవనాల యజమానుల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తోంది. సంక్షేమాధికారులు వీరికి సమాధానం చెప్పలేక సతమతమవుతున్నారు. అద్దె భవనాల్లో విద్యుత్తు దీపాలు పాడైనా, ఏవైనా మరమ్మతులు చేయించాలన్నా వార్డెన్లు సొంత డబ్బు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం సరిపడా నిధులు ఇవ్వక, అన్ని సౌకర్యాలతో కూడిన అద్దె భవనాలు లభించక అసౌకర్యాల మధ్యే కాలం నెట్టుకురావాల్సి వస్తోంది. బీసీ వసతి గృహాల్లో అక్కడక్కడా నాలుగో తరగతి సిబ్బంది ఉండగా.. ఎస్సీ వసతి గృహాల్లో పూర్తిగా లేరు. విద్యార్థులే సిబ్బందిని నియమించుకుని ఉపకార వేతనాల్లో కొంత చెల్లిస్తున్నారు. వసతి గృహాల్లో మంచినీటి సమస్య తీవ్రంగా ఉంది. ప్రైవేటు ట్యాంకుల ద్వారా నీటిని తెప్పించాల్సి వస్తోంది.

# గోరుకల్లుకు కరకట్టలు



కర్నూలు : గోరుకల్లు జలాశయం కట్ట పటిష్ఠతకు రూ.53 కోట్లు విడుదల చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వం వైకాపా హయాంలో నిర్వహణ చేపట్టక కట్ట కుంగింది.. మరమ్మతులు చేసేందుకు నిధులివ్వాలని అధికారులు అభ్యర్థించినా పట్టించుకోలేదు.. సమస్యను స్థానిక ఎమ్మెల్యే ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. జలాశయం వద్ద నెలకొన్న సమస్యలు పరిష్కరించేందుకు రూ.99 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు రూపొందించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన క్రమంలో తొలిదశలో రూ.58.90 కోట్లు కేటాయించాలని జలవనరుల శాఖ అధికారులు ప్రభుత్వానికి లేఖ పంపారు. ఈ నేపథ్యంలో రూ.53 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చాంది. జలాశయం ప్రధాన కరకట్ట బలోపేతం చేస్తారు. ఇప్పుడున్న బండ్ ఎత్తు 261 మీటర్ల నుంచి 265.40 మీటర్లకు పెంచనున్నారు.

## అతివలకు అండగా..

చోడవరం : కూటమి ప్రభుత్వంలో మహిళలను ఆర్థికంగా సుస్థిరం చేసేందుకు వడిగా అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా మహిళా డెయిరీ సహకార సంఘాల పేరిట గ్రామాల్లో పాలను సేకరించి డెయిరీలకు సరఫరా చేసేలా ఓ పథకానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వం అండతో చేపట్టే ఈ సంఘాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. కమీషన్ రూపంలో వచ్చే నగదుతోపాటు కొలతలో మిగులు పాలను సహకార సంఘాన్ని నిర్వహించేందుకు ఆర్థిక వనరుగా వినియోగిస్తారు. ఈ సంఘాల ఏర్పాటులో పశుసంవర్ధక శాఖ అధికారులు నిమగ్నమయ్యారు. సంఘం ఏర్పాటుకు గ్రామంలో కనీసం 11 మంది సభ్యులు ఉండాలి. వీరిలో ఇద్దరు మహిళలు ప్రమోటర్-1, ప్రమోటర్-2లు ఎంపిక చేసుకుని వారిద్దరి పేరున సంయుక్తంగా బ్యాంకు ఖాతాలను తెరుస్తారు. పాలు సేకరణ, కొలతలు తదితరమైన పనులకు కార్యదర్శి ఉంటారు. సేకరించిన పాలను పలు ప్రైవేటు డెయిరీలకు విక్రయించాల్సి ఉంటుంది. ఏ డెయిరీ అధిక ధరను చెల్లిస్తే దానినే సంఘాలు ఎంపిక



చేసుకోవచ్చు. లావాదేవీలన్నీ సంఘం ఆధ్వర్యంలోనే జరుగుతాయి. మహిళలు సహకార సంఘంగా ఏర్పడితే పశుసంవర్ధక శాఖ సిఫార్సుతో ధ్రువపత్రం అందజేస్తారు. రికార్డులు, గణాంకాలు నిక్షిప్తం చేసేందుకు కంప్యూటర్, పరీక్షలు నిర్వహించే పరికరాలు కేంద్రం ఉచితంగా అందజేస్తుంది.

**సంఘం ద్వారా జరిగే కార్యకలాపాలు ఇలా..**

పశువుల పెంపకం క్షీర సేకరణ, రవాణా, విక్రయం

పాల పరీక్షలు (ఫ్యాట్, ఎస్ఎన్ఎఫ్ వంటి చేయడం)

మహిళలకు శిక్షణ కార్యక్రమాలు జరపడం అవగాహన కల్పిస్తున్నాం: జి.శ్రీనివాస్, జిల్లా నోడల్ అధికారి పాలు సేకరించి డెయిరీలకు విక్రయించడంపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. జిల్లాలో 30 వరకు ఈ సంఘాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇప్పటికి నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటయ్యాయి. ఈ ఏడాది డిసెంబరు నాటికి ప్రక్రియ పూర్తిచేస్తాం.

## జన ఔషధిని మింగేస్తున్నారు

ఆదోని : ఉమ్మడి జిల్లాలో జన ఔషధి కేంద్రాలను మందులోళ్లు మింగేస్తున్నారు. యువతకు స్వయం ఉపాధి కల్పనతో పాటు రోగులకు చౌకగా, మన్నికగా ఔషధాలు అందించాలనే సంకల్పంతో ప్రధానమంత్రి భారతీయ జన ఔషధి పరియోజన కింద వీటిని ఏర్పాటు చేశారు. క్షేత్రస్థాయిలో కేంద్రాలు ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్నాయి. ఓ వైపు ప్రచారలేమి, పెద్ద కంపెనీల ఆధిపత్యం పెరగడం, వైద్యులు ప్రోత్సహించకపోవడం.. తదితర కారణాల వల్ల కేంద్రాల లక్ష్యాలు నీరుగారిపోతున్నాయి.

**జ్వరం నుంచి క్యాన్సర్ వరకు**

ఉమ్మడి జిల్లాలో జన ఔషధి కేంద్రాల సంఖ్య కేవలం 30. ఇదే ప్రైవేటు ఔషధి కేంద్రాలు 3-4 వేలు ఉంటాయి. జన ఔషధి కేంద్రాల్లో సుమారు వెయ్యికి పైగా ఔషధాలు, 200లకు పైగా శస్త్రచికిత్స (సర్జరీ) సామగ్రి అందుబాటులో ఉంచాలి. 50 నుంచి 90 శాతం రాయితీతో అందించాలి. జ్వరం మొదలు కీళ్ల నొప్పుల నుంచి క్యాన్సర్ వరకు పలు రకాలు మందులు అందుబాటులో ఉంటాయి.

**ఏర్పాటుకు ముందుకురాని యువత**

నగరాలు, పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఆ దిశగా అడుగులు పడటం లేదు. గతంలో కేవలం బీ-ఫార్మసీ, ఎం-ఫార్మసీ చేసిన వారికే అనుమతులిచ్చేవారు. ప్రస్తుతం నిబంధనలు సడలించి పొదుపు సంఘాలకూ అవకాశం కల్పించింది. వీరితోపాటు నిరుద్యోగ యువత, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, విశ్రాంత సైనికులు జన ఔషధి కేంద్రాలు ఏర్పాటు చేసుకోవడానికి వీలుంది. కేంద్రాల ఏర్పాటుకు బ్యాంకు రుణ సదుపాయం, రాయితీ ఇస్తారు. వ్యాపారం అనుకూలంగా లేకపోవడంతో యువత ముందుకురావడం లేదు.

**వారు రాసిందే మందు**

బడా మందుల కంపెనీలు మాఫీయాగా మారి జన ఔషధ కేంద్రాలకు ఆదరణ లేకుండా చేస్తున్నారు. బ్రాండెడ్ ఔషధాలతో పోలిస్తే.. జనరిక్ మందులకు ఆదరణ దక్కడం లేదు. రెండింటిలో ఒకే రకమైన ఔషధ లక్షణాలున్నా.. అధిక ధరల్లో లభించే మందులే మేలైనవని, తక్కువ ధరకు లభించే ఔషధం పనిచేయదనే భావన ప్రజల్లో ఉంటోందని వైద్య నిపుణులు పేర్కొంటున్నారు. వైద్యులూ జనరిక్ మందులను సిఫార్సు చేయడం లేదు. బ్రాండెడ్ వాటినే రాస్తున్నారు. ఆయా ఔషధి కంపెనీలు అందించే రాయితీలు, ఆఫర్లు, బహుమతులు వంటి వాటికి ఆకర్షితులవుతున్నారు.

## పేరుకు ప్రాంతీయ ఆసుపత్రి

చీపురుపల్లి : పట్టణానికి చెందిన ఓ గర్భిణిని ప్రసవానికి ప్రాంతీయాసుపత్రికి తీసుకురాగా.. వైద్యులు వెంటనే 30 కి.మీ దూరంలో ఉన్న విజయనగరం ఘోషా ఆసుపత్రికి రిఫర్ చేసేశారు. అక్కడకు వెళ్లిన రెండు నిమిషాల్లోనే ఆమెకు సాధారణ ప్రసవం జరిగింది. గుర్ల మండలం పెనుబర్తి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి శ్వాస సంబంధ సమస్యతో ఆసుపత్రికి వచ్చి వైద్యులను సంప్రదించగా.. వెంటనే 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి పంపారు. చీపురుపల్లి ప్రాంతీయాసుపత్రిలో వైద్యం గగనమవుతోంది. రోజుకు కనీసం 300 మందికి పైగా ఓపీ, ఐపీ సేవలకు వస్తున్నారు. ఎక్కువమందిని వైద్య సిబ్బంది విజయనగరం పంపేస్తున్నారు. రహదారి ప్రమాదాల్లో తీవ్రంగా గాయపడినా ఇదే తీరు.

**100.. ఉన్నవి 30 పడకలే..**

గతంలో 30 పడకలు ఉన్న ఈ ఆసుపత్రిని 2023 డిసెంబరు నుంచి వంద పడకల ప్రాంతీయాసుపత్రిగా ఉన్నతీకరించారు. అందుకు తగ్గ వైద్యులు, సిబ్బంది, భవనాలు, వసతులు, విభాగాలు, పరికరాలేవీ నేటికీ సమకూర్చలేదు. ప్రస్తుతానికి 30 మంచాలే ఉన్నాయి. మొత్తం 18 మంది వైద్యులున్నా సేవలు అంతంతే.

ప్రైవేటు ఆసుపత్రిలో ప్రభుత్వ వైద్యులు

ఇక్కడ పనిచేసే కొందరు వైద్యులు ఉదయం 9 గంటలకు హాజరు వేసుకుని, ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లిపోతున్నారు. చీపురుపల్లిలో ఒక ప్రైవేటు ఆసుపత్రి అంతా ప్రభుత్వ వైద్యులపైనే ఆధారపడి నడుస్తోందనేది పట్టణవాసుల ఆరోపణ.

**ప్రసవాలూ తగ్గుతున్నాయి..**

ఆసుపత్రిలో ప్రసవాలు, సీజర్లు తగ్గిపోతున్నాయి. 30 పడకల ఆసుపత్రిగా ఉన్నప్పుడు మొత్తం ముగ్గురు, నలుగురు వైద్యులతో ప్రతి నెలా 70 నుంచి 100 వరకు వరకు ప్రసవాలు, సీజర్లు జరిగేవి. ప్రస్తుతం ముగ్గురు గైనకాలజిస్టులు, ఇద్దరు మత్తు వైద్యులు, ఆరోగ్యశ్రీ అమల్లో ఉన్నా నెలకు 30 దాటి ప్రసవాలు జరగడం లేదు. ఎముకల విభాగానికి వైద్యుడున్నా పరికరాల్లేవని రోగులను పట్టణంలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాలని సూచిస్తున్నారు.

## పౌష్టికాహారంలో మాయాజాలం

అనంతపురం : శింగనమల ప్రాజెక్టులో గతేడాది జనవరి నుంచి 484 సంచుల్లో ఉండే 3,872 బాలామృతం చిన్నపొట్లాల సంఖ్య తేలలేదు. పొట్లాలు మాయం అయ్యాయా...ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదా అన్న దానిపై విచారణ సాగుతోంది. ఇది పర్యవేక్షణ లోపానికి నిదర్శనం.అంగన్‌వాడీ కేంద్రాల లబ్ధిదారులకు ఇచ్చే కోడిగుడ్లు, పాలు, బాలసంజీవని కిట్లతోపాటు బియ్యం, కందిపప్పు, వంటనూనె, బాలామృతం... వంటి పౌష్టికాహార పంపిణీ లెక్కల్లో భారీ తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. గుత్తేదారుల సరఫరా గణాంకాలు.. సీడీపీఓ, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తల పంపిణీ రికార్డులకు పొంతనే లేదు. కొన్ని చోట్ల ఇండెంట్లోనూ మతలబు ఉన్నట్లు తేలింది. జిల్లాలోని 11 ప్రాజెక్టు కార్యాలయాలు, ర్యాండమ్‌గా కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల దస్త్రాలను ప్రత్యేక బృందం పరిశీలన చేస్తోంది. ఇప్పటికి శింగనమల, నార్పల, అనంత అర్బన్ ప్రాజెక్టుల్లో పరిశీలన ప్రక్రియ



పూర్తయింది.

**20 నెలల్లో..**గతేడాది జనవరి నుంచి 20 నెలల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసిన అన్ని రకాల పౌష్టికాహారం గణాంకాలను పరిశీలిస్తున్నారు. గత వైకాపా హయాంలోనే ఎక్కువ లెక్కలు తారుమారైనట్లు తెలుస్తోంది. గుత్తేదారులు తక్కువ సరఫరా చేసినా.. కేంద్రాల్లో ఎక్కువ నమోదు చేయడం, సూపర్‌వైజర్ల లెక్కల్లోనూ అదే రీతిలో తేడాలు వెలుగుచూ శాయి. బీకే సముద్రం, శింగనమల మండలాల్లో బాలామృతానికి సంబంధించి వ్యత్యాసం ఉన్నట్లు వెలుగుచూసింది. నార్పల ప్రాజెక్టు పరిధిలోని పుట్లూరు, ఎల్లనూరు మండలాల్లోనూ కొన్ని బాగోతాలు ఉన్నట్లు సమాచారం.

**పరిశీలన చేస్తున్నాం..నాగమణి, పీడీ, ఐసీడీఎస్**

కొన్ని అంగన్‌వాడీ కేంద్రాల రికార్డులతోపాటు సూపర్‌వైజర్లు, సీడీపీఓల రిజిస్టర్లను ర్యాండమ్‌గా పరిశీలన చేస్తున్నాం. ఎక్కడ ఎలాంటి పొరపాట్లు జరిగాయో చూస్తున్నాం. అన్ని ప్రాజెక్టులు పూర్తిగానే ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

## కుప్పంలో పట్టాలెక్కిన ప్రగతి!

కుప్పం : ఐదేళ్లలో వైకాపా పాలనలో కుప్పం అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. పేరుకు క్రీడా మైదానం ఉన్నా ఎలాంటి సదుపాయాలు లేకపోవడంతో క్రీడాకారులు నానా అవస్థలు పడేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక కుప్పం అభివృద్ధికి శ్రీకారం చుట్టింది. అసంపూర్తి అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు నాయుడు నిధులు మంజూరు చేయడంతో అవి పట్టాలెక్కాయ్.

**రూ.3 కోట్లతో సుందరంగా శ్మశానవాటిక**

కుప్పంలోని శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు 2017లో తెదేపా ప్రభుత్వం పనులు చేపట్టింది. రూర్బన్ పథకంలో భాగంగా రూ. 1.60 కోట్లతో అంత్యక్రియలకు వచ్చే వారి సౌకర్యార్థం సామాజిక భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో వైకాపా అధికారంలోకి రావడంతో పనులు నిలిచిపోయాయి. ఫలితంగా శ్మశాన భూమిలో పిచ్చిమొక్కలు పెరిగి ఆకతాయిలకు అడ్డాగా మారింది. కూటమి ప్రభుత్వం వచ్చాక పనులకు రూ.3 కోట్లు మంజూరు చేసింది.

**నిర్వహణపై నిర్లక్ష్యం చూపారు..**



కుప్పం పురపాలిక పరిధిలోని వడ్డిపల్లె వద్ద ఎన్టీఆర్ క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో ఉన్న ఒకే ఒక్క క్రీడా మైదానం అభివృద్ధిని వైకాపా పాలనలో పట్టించుకోకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారింది. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో కుప్పం ఎన్టీఆర్ క్రీడా మైదానం అభివృద్ధికి రూ. 22 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మైదానంలోని భారీ బండ రాళ్లను యంత్రాలతో తొలగించి చదును చేస్తున్నారు.

**నిర్దేశిత సమయంలో పూర్తి చేస్తాం: వికాస్ మర్మత్, పీడీ, కడా**

అభివృద్ధిలో కుప్పాన్ని ఆదర్శంగా నిలిపేందుకు శరవేగంగా పనులు చేపడుతున్నాం. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో స్వర్ణ కుప్పం విజన్ దిశగా పనులు చేస్తున్నాం. నిర్దేశించిన లక్ష్యంలోగా పనులు పూర్తి చేస్తాం.

## కూల్చిన చోటే పాగా వేసి..

రేణిగుంట : వైకాపా హయాంలో వాగు పోరంబోకు స్థలంలో అక్రమ నిర్మాణాలు కూల్చిన అధికారులు.. కూటమి ప్రభుత్వం అక్కడే.. అదే చోటా నాయకుడు భారీ నిర్మాణాలు చేపడుతుంటే కళ్లప్పగించి చూస్తున్నారు. తన జోలికి వస్తే ఉపేక్షించబోనని సదరు వ్యక్తి భయపెడుతుండటంతో యంత్రాగం ఆ వైపు చూడటం లేదని సమాచారం. ఈ దందాకు రేణిగుంట మండలం వేదికైంది. మండలంలోని కొత్తపాళెం లెక్కదాఖల సర్వే నంబరు 3లో 1.77 ఎకరాల్లో వాగు పోరంబోకు భూమి ఉంది. అక్కడ ఇప్పటికీ నీరు పారుతోంది. ఇది నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారి ఆనుకుని ఉంది. ఇంత విలువైన భూమిలో ఈ చోటా నేత సిమెంటు రాళ్ల తయారీ పరిశ్రమ నిర్మించారు. పక్కనే ఉన్న వాగు భూమిని సైతం తను ఆక్రమించి షెడ్డు ఏర్పాటు చేసుకున్నారు.

**అప్పట్లో ఏం జరిగిందంటే..**

వైకాపా హయాంలోనూ ఇతను నిర్మాణాలు చేపడితే రెవెన్యూ అధికారులు వాటిని అసంపూర్తిగా కూల్చివేశారు. ఈ క్రమంలో అదే స్థలంలో భారీగా షెడ్డు వేసి గదులు నిర్మించి గేటు కూడా ఏర్పాటు చేశారు. తన వెనుక కీలక ప్రజాప్రతినిధులున్నారని, తన జోలికి వస్తే అంతే సంగతులంటూ యంత్రాంగాన్ని సైతం హెచ్చరిస్తున్నట్లు సమాచారం. **కూల్చివేయిస్తాం..** ఇక్కడ నిర్మాణాలు పరిశీలించాలని సిబ్బందిని పంపిస్తా. రెండు రోజుల్లో అక్రమ నిర్మాణాలు కూల్చివేయిస్తా. చంద్రశేఖర్‌రెడ్డి, తహసీల్దార్, రేణిగుంట

# కోనేరులో ముక్తి మునక ఏనాటికో?



కదిరి : శ్రీఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ, అందుకు అనుగుణంగా ఆదాయమూ పెరుగుతోంది. వసతుల కల్పనలో మాత్రం వేగం పెరగడం లేదు. స్వామి దర్శనానికి వచ్చే భక్తులు కోనేరులో ముక్తి మునకకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. 2019 ఆఖరున మొదలైన ఆధునీకీకరణ పనులతో కోనేరును సిమెంటు తొట్టిలా మార్చారన్న విమర్శలు ఉన్నాయి. రెండు విడతల పనులకు రూ.6 కోట్ల పైచిలుకు నిధులు కేటాయించారు. ఆరేళ్ల కిందటే పనులు మొదలయ్యాయి. పునాదులు తీసి, అడుగు భాగంలో సిమెంటు వేసి, చుట్టూ ప్రహరీ నిర్మించారు. ఇక అంతటితో ఆగిపోయాయి. ఏడాదిన్నర గడుస్తున్నా పనులు మొదలవ్వలేదు.

**ఆధ్యాత్మికత ఉట్టిపడేలా డిజైన్**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆధ్యాత్మికత ఉట్టిపడేలా కోనేరు నిర్మాణానికి డిజైన్ రూపకల్పనకు ఉపక్రమించారు. దీన్ని ఏజెన్సీ ద్వారా చేయిస్తున్నారు. అయితే సకాలంలో ప్రణాళిక తయారీలో జాప్యం జరుగుతోంది. ఈ విషయంపై ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అధికారులతో సమీక్షించారు. అయినా డిజైన్ సిద్ధం చేయటంలో ఆలస్యం అవుతోంది. **పాత ధరలతో పని కాదంటున్న గుత్తేదారు** కోనేరు పనులు ఆగి ఏడాదికిపైగా అయింది. దీంతో టెండరు వేసినప్పటి ధరలకు, ప్రస్తుతానికి వ్యత్యాసం ఎక్కువ ఉంది. పాత ధరలకే పనులు పూర్తి చేయడం కష్టమని గుత్తేదారు, దేవాదాయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయి సుమారు రూ.5 కోట్ల వరకు ఖర్చు చేశారు. ప్రస్తుత నిర్మాణ సామగ్రి ధరలకు అనుగుణంగా అంచనాలు తయారు చేయాలి. ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపి అనుమతులు పొందాల్సి ఉంటుంది. అందుకు పనుల మార్పుతో రూపొందించే డిజైన్ సిద్ధం చేయాల్సి ఉంది. ఇదంతా జరగాలంటే సమయం పట్టేలా ఉంది. దీంతో కోనేటి కథ మళ్లీ మొదటికొచ్చింది. కోనేరు ప్రహరీ నిర్మాణం కోసం తీసిన గుంత ప్రమాదకరంగా మారింది. ఇక్కడ ఎలాంటి రక్షణ లేదు.

**బ్రహ్మోత్సవాలకు ముందే పూర్తి చేస్తాం** శ్రీనివాసరెడ్డి, ఈవో

కోనేరు పనుల్లో జాప్యమైంది. కొత్తగా రూపొందిస్తున్న డిజైన్ రావాల్సి ఉంది. గుత్తేదారుకు సామగ్రి ధరలు పెంచి ఇవ్వటానికి సమస్య లేదు. ప్రహరీ చుట్టూ మట్టి నింపటం, సుందరీకరణ వంటి 20 శాతం పనులు మిగిలాయి. బ్రహ్మోత్సవాలకు ముందే కోనేరును అందుబాటులోకి తెస్తాం.

# తాగునీటి కుళాయిల్లో అవినీతి ధార



అనంతపురం : అనంతపురం నగరంలోని పలు ప్రాంతాల్లో వ్యాపార సముదాయాలు రోజురోజుకు విస్తరిస్తున్నాయి. నిర్మాణ సమయంలోనే నిబంధనలు అతిక్రమించిన భవనాలకు కుళాయి కనెక్షన్లు ఇవ్వరు. తాగునీటి విభాగానికి చెందిన సిబ్బందితో లోపాయికారి ఒప్పందం కుదుర్చుకొని అనధికారికంగా తాగునీటి కనెక్షన్లు తీసుకుంటారు. పట్టణ ప్రణాళికకు సంబంధించిన అన్ని రుసుములు చెల్లించిన తర్వాత స్వాధీనం చేస్తున్నట్లు అధికారికంగా ఉత్తర్వులు ఇస్తారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన హోటళ్లు, బహుళ అంతస్తులు, ప్రైవేటు కళాశాలలు, కళ్యాణ మండపాలు, ఆసుపత్రులు, వ్యాపార సముదాయాలకు మూడు రెట్లు అధికంగా కుళాయి పన్నులు వసూళ్లు చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ లేకపోవడంతో తాగునీరు కుళాయి పన్నుల వసూళ్లలో కొత్త దందా వెలుగులోకి వచ్చింది. చేతితో రాసి ఇచ్చే బిల్లు కావడంతో అక్రమార్కులకు పంట పండుతోంది. పన్ను తగ్గించినందుకు మాకేం ఇస్తావంటూ వసూళ్లకు తెర తీశారు. మళ్లీ బీపీఎస్ వచ్చే వరకు కుళాయి పన్నులు మూడు రెట్లు చెల్లించాలి. పన్ను తగ్గిస్తామంటూ అటు నగరపాలకకు ఆదాయానికి గండి కొడుతూ తగ్గించినందుకు మీకింత మాకింత అంటూ భవన యజమానులతో అందినకాడికి గుంజుతున్నారు.

**బిల్లు రూ.లక్షల్లో బేరం!**

గుత్తిరోడ్డులో ఉన్న ఓ వ్యాపార సముదాయం వద్దకు తాగునీటి విభాగంలో పని చేస్తున్న ఇద్దరు పొరుగుసేవల ఉద్యోగులు రూ. 8.50 లక్షలు కుళాయి పన్నుకు సంబంధించిన బిల్లు ఇచ్చారు. మూడు రెట్లు పన్ను వేశామని ఇది బీపీఎస్ వచ్చే వరకు కట్టాల్సి ఉంటుందని చెప్పడంతో సదరు యజమాని బెంబేలెత్తాడు. తగ్గించే మార్గం చూపాలని కోరడంతో మాకు ఇవ్వాల్సింది ఇస్తే సార్‌తో మాట్లాడి రూ. 2.50 లక్షలకు బిల్లు వచ్చే విధంగా ఇస్తామంటూ నమ్మపలికారు. బిల్లులో కనీసం ఒక్క అధికారి సంతకం లేకుండా ఇవ్వడం అనుమానాలకు తావిస్తోంది. వ్యాపార సముదాయాల నుంచి సంవత్సరానికి రూ. 1.10 కోట్లు పన్నులు వసూళ్లు కావాల్సి ఉంటుంది. ఇంత పెద్ద మొత్తంలో సొమ్ముకు లెక్కల్లేకుండా బిల్లులు ఇస్తుంటే ఎవరికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. నగరంలోని అరవింద్‌నగర్, హౌసింగ్ బోర్డు, రాంనగర్, శారదానగర్, శ్రీనగర్‌కాలనీ, కమలానగర్, గుత్తిరోడ్డు, సుభాష్‌రోడ్డు, తదితర ప్రాంతాల్లో మూడు రెట్లు కుళాయి పన్ను పరిధిలోకి వచ్చే వ్యాపార సముదాయాలు ఉండటంతో కాసుల పంట పండుతోంది.

**అనంత నగరపరిధిలో**

నివాసాల కుళాయి కనెక్షన్లు : 37,000
వ్యాపార కనెక్షన్లు : 541
అక్రమంగా... : 9,000
బకాయిలు : రూ.18 కోట్లు
మూడు రెట్లు పన్ను పరిధి వచ్చేవి : 150

# 'పురం'.. ఆదాయానికి ఆమడ దూరం



హిందూపురం : పాలకులకు అవగాహన ఉండదు.. మున్సిపల్ అధికారులకు ముందుచూపు ఉండదు... కన్సెల్‌టెంట్లకు కనీస ఆలోచన లేక పోవడంతో అందరూ కలిసి హిందూపురం మున్సిపాలిటీని నిండా ముంచేశారు. మున్సిపాలిటీకి పట్టణ నడిబొడ్డున ఉన్న రూ. కోట్ల విలువైన భూములను సద్వినియోగం చేసుకొని, సంపద సృష్టించాల్సింది పోయి, ఉన్న అరకొర నిధులను వాటిపై ఖర్చు పెట్టి వృథా చేశారు. ఇదీ హిందూపురంలో నూతన మార్కెట్, లేపాక్షి రోడ్‌లో మినీ మార్కెట్ల పరిస్థితి.

**రూ.30 కోట్లు ఖర్చు పెట్టి.. ఆరున్నరేళ్లుగా వదిలేసి...**

పట్టణ నడిబొడ్డున రూ.100 కోట్ల విలువైన మూడు ఎకరాల విస్తీర్ణంలో ఆరేళ్ల కిందట రూ.30 కోట్లు వెచ్చించి మార్కెట్‌ను నిర్మించారు. ఇందులో 321 గదులు ఉన్నాయి. గది కనీస అద్దె రూ. 8వేలు. ఎస్సీ, ఎస్టీలకు నామమాత్రపు అద్దెకు కేటాయించిన గదులను తీసివేసినా, అన్ని గదులను అద్దెకు ఇచ్చి ఉంటే నెలకు కనీసం రూ.25 లక్షలు ఆదాయం వస్తుంది. మార్కెట్‌ను సరైన ప్రణాళికతో నిర్మించక పోవడం, చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించకపోవడం, తోపుడు బండ్లను మార్కెట్‌కు దూరంగా ఉంచకపోవడం తదితర కారణాలతో మార్కెట్‌లో గదులను అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వచ్చిన వారు సైతం వ్యాపారాలు లేకపోవడంతో తీవ్రంగా నష్టపోయి వదిలేశారు.

**18 ఏళ్లుగా ఖాళీగా ..**

డీబీ కాలనీలో లేపాక్షికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన 18 ఏళ్ల క్రితం 2007లో రూ.50 లక్షలు వెచ్చించి 37 గదులతో మినీ మార్కెట్‌ను నిర్మించారు. గదులను బయట వైపుకు కాకుండా లోపలి వైపు ఉండేలా డిజైన్ చేసి కట్టడంతో వాటిని అద్దెకు తీసుకోవడానికి ఎవరూ ముందుకు రాలేదు. దీంతో చివరకు అద్దెను గదికి రూ.6 వేలు నుంచి రూ.3 వేలకు తగ్గించారు. ఇప్పటికి 20 సార్లు వేలం పాటలు నిర్వహించినా ఒక్క గదిని అద్దెకు ఇవ్వలేకపోయారు. నెలకు రూ.లక్షకు పైగా ఆదాయం వస్తుందనుకొంటే, పైసా రాలేదు. ఇప్పటి దాక అద్దె ఆదాయం రూ.2 కోట్లకు పైగా నష్టం వాటిల్లింది.

**చర్యలు తీసుకొంటున్నాం**

మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

పట్టణంలోని మార్కెట్లు ఖాళీగా ఉన్న మాట నిజమే. వాటిని సద్వినియోగం చేసుకోవడానికి చర్యలు చేపట్టాం. పెద్ద మార్కెట్ చుట్టూ ఇటీవల అక్రమణలను తొలగించాం. నాలుగు వైపులా రహదారులు ఏర్పాటు చేస్తాం. మినీ మార్కెట్‌ను పరిశీలించి, తగు ప్రణాళిక సిద్ధం చేస్తాం.

## తిరుపతి రైతుబజార్‌కు కొత్త కళ

తిరుపతి : వివాదాలకు నిలయంగా ఉన్న తిరుపతి రైతుబజార్‌లో ప్రక్షాళన ప్రారంభమైంది. రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికి ఒక్కో రైతుబజార్‌ను అందుబాటులోకి తెచ్చేందుకు యత్నాలు ప్రారంభించడంతో పాటు ఇప్పటికే సేవలందిస్తున్న రైతుబజార్లలోని సమస్యల పరిష్కారంపై దృష్టిసారించింది. ఈ క్రమంలో రాష్ట్రంలోనే అధిక ఆదాయం కలిగిన తిరుపతి రైతుబజార్‌ను మరింతగా విస్తృతం చేయాలని నిర్ణయించారు. స్థానిక రైతుబజార్‌లో ప్రస్తుతం వంద దుకాణాలు అండగా.. వాటిని రైతులు, డ్వాక్రా సంఘాలకు నెలవారీ అద్దె ప్రాతిపదికన కేటాయించారు.ప్రధాన ద్వారం వద్ద అక్రమ దుకాణాలు, లోనికి ప్రవేశించగానే దుకాణాలను వదిలి బయట దారుల నిండా సరకులతో నింపేసేవారు. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, మురుగునీరు, అపరిశుభ్రత, అడుగుపెట్టలేని విధంగా ఉన్న మరుగుదొడ్లతో గందరగోళంగా ఉండేది. దీనికితోడు వ్యాపారులు చెప్పిందే ధర అన్నట్లు సాగేది.



**మెరుగైన వాతావరణం**

రైతుబజార్‌లో ప్రస్తుతం పరిస్థితి మారింది. ఆవరణలో గుట్టలుగా ఉన్న వ్యర్థాలను తొలగించి, దుకాణాల పైకప్పులపై ఉన్న ఆకులు, ఇతర వ్యర్థాలను తరలించారు. రోడ్డుపైకి విస్తరించిన దుకాణాలను వారికి కేటాయించిన స్థలాలకే పరిమితం చేయాలని ఆదేశించారు. వ్యాపారులతో మాట్లాడి రైతుబజార్ నిబంధనలను వివరించారు. ప్రధానద్వారం వద్ద ఉన్న అనధికారిక వ్యాపారుల కట్టడికి చర్యలు చేపట్టారు. మరుగుదొడ్లు, శుద్ధి చేసిన నీటిని అందుబాటులోకి తెచ్చారు. ప్లాస్టిక్‌ను నిషేధిస్తున్నట్లు ప్రకటించారు. వినియోగదారుల్ని మోసగించినట్లు ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరికలు జారీ చేశారు.

**ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నదే లక్ష్యం: అనిల్‌కుమార్, ఎస్టేట్ అధికారి**

తిరుపతి రైతుబజార్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని, రైతు బజార్ నియమనిబంధనలు కచ్చితంగా అమలు చేస్తాం. వినియోగదారులకు అండగా నిలిచి వారి సహకారంతో వ్యాపారులు ఆర్థికంగా లాభపడేలా చేస్తాం. శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తున్నాం. అనధికార వ్యాపారుల్ని లేకుండా చూస్తాం.

## 'సంచి మార్చి' ముంచేస్తున్నారు!

అనకాపల్లి : ఎరువులు, క్రిమిసంహారక మందుల వ్యాపారులపై సరైన నిఘా లేకపోవడం అన్నదాతల పాలిట శాపంగా మారింది. ఖరీఫ్ పనులు ఒక్కసారిగా జోరందుకోవడంతో రైతుల అవకాశాన్ని, ఆరాటాన్ని కొందరు వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఇంతవరకు ఎరువులు అధిక ధరలకు అమ్మకం చేయడం, తూకంలో తేడాలు చేయడం వంటి పనులే చేసేవారు. ఇప్పుడు ఏకంగా కల్తీ ఎరువుల విక్రయానికి తెరలేపారు.

జిల్లాలో 92 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలతోపాటు 175 మంది ప్రైవేటు డీలర్లు, రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు విక్రయిస్తున్నారు. జిల్లాలో అనకాపల్లి, చోడవరం, నర్సీపట్నంలో ఎరువుల అమ్మకాలు ఎక్కువగా సాగుతుంటాయి. సీజన్‌లో తరచూ యూరియా ఎరువులకు కొరత ఏర్పడుతోంది. ఈసారి అదే పరిస్థితి ఏర్పడింది. తుపాను కారణంగా జిల్లా అంతటా భారీ వర్షాలు పడ్డాయి. దీంతో రైతులంతా ఒకేసారి వరి నాట్లు వేయడం ప్రారంభించారు. దమ్ములోనే రైతులు యూరియా, డీఏపీ ఎరువులు వేస్తుంటారు. దీంతో ఎరువులకు డిమాండ్ ఏర్పడింది. దీన్ని ఆసరా చేసుకొని కొందరు వ్యాపారులు బస్తాకు రూ. 30 నుంచి రూ. 50 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకొంతమంది బస్తాలో రెండు, మూడు కేజీలు తస్కరించి తక్కువ పరిమాణంలో విక్రయిస్తున్నారు. ఇప్పుడు చోడవరంలో ఓ వ్యాపారి ప్రముఖ కంపెనీ పేరుతో స్ంచిలు తయారుచేయించి దానిలో వేరే ఎరువు నింపి అమ్మకాలు చేస్తూ విజిలెన్స్ అధికారులకు అడ్డంగా దొరికిపోయారు.

**తేడాలుంటే సహించం**

దీనిపై జిల్లా వ్యవసాయాధికారి బి.మోహనరావును వివరణ కోరగా ఎరువులు అధిక ధరలకు అమ్మినా, తూకంలో తేడాలున్నా చర్యలు తప్పవన్నారు. దుకాణాలను తరచూ తనిఖీ చేస్తుంటామన్నారు. వచ్చినా చర్యలు తప్పవన్నారు. జిల్లాలో ఇప్పటికే యూరియా 2,256 టన్నులు, డీఏపీ ఇతర కాంప్లెక్స్ ఎరువులు 1,491 టన్నుల నిల్వలు ఉన్నాయన్నారు. మరో 661 టన్నులు యూరియా, వంద టన్నులు డీఏపీ జిల్లాకు వస్తున్నాయని తెలిపారు.




చోడవరంలో నకిలీ ఎరువులు విక్రయిస్తున్న వ్యవహారం విజిలెన్సు దాడుల్లో వెలుగుచూసింది. స్థానిక లక్ష్మమ్మ కోవెల సమీపంలో శ్రీ లక్ష్మీదేవి ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్ పేరిట సింహాద్రిపురానికి చెందిన పెన్నాడ శ్రీనివాసరావు, ఆయన కుమారుడు పవన్‌కుమార్ ఎరువుల వ్యాపారం చేస్తున్నారు. వీరికి ఎరువుల దుకాణంతో పాటు లైసెన్సు పొందిన రెండు గోదాములు ఉన్నాయి. అనధికారికంగా మరో గోదాంను నిర్వహిస్తున్నారు. తక్కువ ధరకు లభించే ఎరువును డీఏపీ, గ్రోమోర్ సంచుల్లో నింపి బస్తాకు అదనంగా రూ. 450 నుంచి రూ.550 దండుకుంటున్నారు. స్పిక్ ప్రోమ్ బస్తా ధర రూ. 800 కాగా దీన్ని రూ.1350లకు విక్రయించే డీఏపీ సంచిలో నింపి అమ్ముతున్నారు. రూ. 1300కు లభ్యమయ్యే 20.20.013 రకం ఎరువును, రూ. 1750లకు దొరికే 28.28.0 (గ్రోమోర్) సంచుల్లోకి మార్చి అన్నదాతలకు విక్రయిస్తున్నారు. అచ్చం అసలైనవాటిని పోలి ఉండే నకిలీ సంచులను తుని నుంచి కొనుగోలు చేస్తున్నట్లు అధికారుల విచారణలో తేలింది. వ్యవసాయాధికారిణి పావని ఫిర్యాదు మేరకు శ్రీనివాసరావు, అతని కుమారుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ అప్పలరాజు తెలిపారు.

## జీఎస్ఎల్వీ-ఎఫ్16 రిహార్సల్ పూర్తి

శ్రీహరికోట : భారత అంతరిక్ష ప్రయోగ కేంద్రమైన సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ (షార్)లో జీఎస్ఎల్వీ-ఎఫ్16 ప్రయోగంపై శాస్త్రవేత్తలు దృష్టి పెట్టారు. ఆదివారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ప్రయోగానికి సంబంధించిన రిహార్సల్ నిర్వహించారు. రాకెట్‌లోని ప్రతి అంశాన్ని సున్నితంగా పరిశీలించి, వాటి పనితీరును తెలుసుకున్నారు. అన్నీ శాస్త్రవేత్తల అంచనాలకు తగ్గట్లు ఉన్నట్లు గుర్తించారు. అనంతరం ప్రీ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఈ ఏడాది నిర్వహించిన రెండు రాకెట్ ప్రయోగాలు విఫలం కావడంతో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ప్రతి అంశాన్ని లోతుగా అన్వేషిస్తున్నారు. రాకెట్ సన్నద్ధత, లాంచ్ ఆథరైజేషన్ సమావేశాలు జరగనున్నాయి. ఇందులో రాకెట్ అనుసంధానంతోపాటు నిసార్ ఉపగ్రహం తదితర



వాటిపై శాస్త్రవేత్తలు చర్చించనున్నారు.

**కౌంట్‌డౌన్‌లో మార్పు**

ఇప్పటి వరకు ప్రయోగానికి 27.30 గంటల కౌంట్‌డౌన్ నిర్వహించాలని శాస్త్రవేత్తలు భావించారు. వాతావరణంలో మార్పులుంటే కౌంట్‌డౌన్ ప్రక్రియలో మార్పు చేయనున్నట్లు తెలుస్తోంది. రాకెట్ సన్నద్ధత సమావేశంలో దీనిపై ప్రకటన చేయనున్నారు. జీఎస్ఎల్వీ-ఎఫ్16 వాహకనౌక నాసా ఇస్రో సింథటిక్ ఎపర్చర్ రాడార్(నిసార్) ఉపగ్రహాన్ని మోసుకెళ్లనుంది. నిసార్ రెండు శక్తివంతమైన రాడార్ వ్యవస్థలను కలిగి ఉంది. దీని బరువు 2,392 కిలోలు. దీనికి రూ.12,500 కోట్లు ఖర్చు చేశారు.

## ప్రజల ప్రాణాలతో ఆటలా!!

పరవాడ : అనకాపల్లి జిల్లా పరవాడ జేఎన్ ఫార్మాసిటీ డెవలపర్‌గా వ్యవహరిస్తున్న విశాఖ ఫార్మాసిటీ లిమిటెడ్ (రాంకీ) యాజమాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఫార్మా వ్యర్థాల నిర్వహణలో నిబంధనలు అమలు చేయకుండా పర్యావరణానికి తూట్లు పొడుస్తోంది. తాడి కొండ ప్రాంతంలో రాంకీ ల్యాండ్‌ఫిల్ నిండిపోవడంతో మరో చోట భారీగా ఫార్మా ఘన వ్యర్థాలను నిల్వ చేయడంపై ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ) తీవ్రంగా పరిగణించి నోటీసులు జారీ చేసింది. ఎన్నో అంశాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తున్నా అధికారులు నోటీసులు ఇచ్చి సరిపెట్టేస్తున్నారని, చర్యలు మాత్రం లేవని 'ఫార్మా సిటీ' పరిసర ప్రజలు మండిపడుతున్నారు.

**ప్రత్యామ్నాయంపై దృష్టి:** గత వైకాపా ప్రభుత్వం తాడికొండపై మరో 'ల్యాండ్‌ఫిల్' కేంద్రం నిర్మాణానికి 50 ఎకరాలు కేటాయించింది. 2024 జనవరిలో పరవాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాభిప్రాయ సేకరణకు సభ నిర్వహించారు. ఇప్పటికే ఉన్న 'ల్యాండ్‌ఫిల్' నుంచి తీవ్ర దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని, మరో కాలుష్య కుంపటి తమపై పెట్టడం సరికాదని తాడి గ్రామం, పరిసర ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. అప్పటి నుంచి ఏడాదిన్నర గడిచినా, ఉన్న ల్యాండ్ ఫిల్ కేంద్రం నిండిపోతుందని తెలిసినా రాంకీ సంస్థ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఘనవ్యర్థాల సేకరణ ప్రక్రియను రాంకీ నిలిపివేయడం ఫార్మా కంపెనీలకు సమస్యగా మారింది. వ్యర్థాలను నెల్లూరులోని నిల్వ కేంద్రానికి తరలిస్తామని పీసీబీ అధికారులు చెబుతున్నా రవాణాభారం అవుతుందని పేర్కొంటున్నారు.

**తవ్విన చెరువును ఏం చేస్తారు?:** రాంకీ సంస్థ ఫార్మాసిటీ సమీపంలోని తానాం గ్రామం వద్ద దాదాపు ఎకరంపైగా భూమి కొనుగోలు చేసి



2022లో చెరువును తవ్వించింది. 'గ్రీన్‌బెల్టు' ప్రాంతంలో భూమి కొన్నా... మొక్కలు పెంచకుండా రసాయన వ్యర్థ జలాల నిల్వకు చెరువును తవ్వడం సరికాదని ప్రజలు మండిపడ్డారు. చెరువు తవ్వకం పనులు నిలిపేయాలని 2022లో తానాం పంచాయతీ పాలకవర్గ సభ్యులు గ్రామసభలో తీర్మానం చేశారు. తరువాత అధికారులకు ఫిర్యాదుచేశారు. చెరువు తవ్వకం పనులు ఆపాలని, తవ్విన మేరకు వెంటనే పూడ్చాలని రాంకీ సంస్థకు పీసీబీ అధికారులు నోటీసులు జారీ చేశారు. అయినా..ఇప్పటికీ పరిస్థితి మారలేదు. చెరువు నీళ్లు తాగిన పశువులు, మూగజీవులు మృత్యువాత పడుతున్నాయని రైతులు చెబుతున్నారు.

**వ్యర్థ జలాలతో భయంభయం:** వర్షాల సమయంలో ఫార్మాసిటీలో రసాయన వ్యర్థ జలాలను బయటికి విడిచిపెట్టేస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. దీంతో పరవాడ, భరణికం చెరువులు, గెడ్డలు కాలుష్యమయమై చేపలు మృత్యువాత పడుతున్నాయని వాపోతున్నారు. గత మే నెలలో రసాయన వ్యర్థ జలాలు బయటికి వదిలేయగా భరణికంలోని మొల్లోడు గెడ్డలోకి చేరాయి. రైతులు, స్థానికులు ఆందోళన చేసి కలెక్టర్, పీసీబీకి ఫిర్యాదు చేశారు. పీసీబీ సిబ్బంది గెడ్డలో నీటి నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. కెమికల్ ఆక్సిజన్ డిమాండ్(సీవోడీ) ఎక్కువ ఉన్నట్లు గుర్తించి గత నెలలో 'రాంకీ'కి నోటీసులు జారీచేశారు. తదుపరి చర్యలు నిమిత్తం పీసీబీ ప్రధాన కార్యాలయానికి నివేదిక పంపారు.

# ప్రగతి దారిలో పలుగురాళ్లు



తిరుపతి : కూటమి ప్రభుత్వం పెట్టుబడులను పెద్ద ఎత్తున ఆకర్షిస్తోంది. ఎంఎస్ఎంఈలు మొదలుకొని మెగా పరిశ్రమలు స్థాపించాలని ఔత్సాహికులను కోరుతోంది. సరిపడా భూమి, నీరు, ప్రోత్సాహకాలు అందిస్తామని ఇప్పటికే ప్రకటించింది. ఇదే సమయంలో ప్రస్తుతమున్న పారిశ్రామిక పార్కులపై దృష్టి సారించి మౌలిక వసతులు కల్పించాలి. కొత్తగా నెలకొల్పే పారిశ్రామికవాడలకు ఇవి ఆదర్శంగా నిలిస్తే మరింతమంది పరిశ్రమలు ఏర్పాటు చేయడానికి ముందుకొస్తారు. యంత్రాంగం ఈ దిశగా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. చిత్తూరు, తిరుపతి జిల్లాలు.. చెన్నై, బెంగళూరు మహానగరాలకు దగ్గరగా ఉన్నాయి. కర్మాగారాల స్థాపనకు అవసరమైన భూమి కూడా అందుబాటులోనే ఉంది. ఏ పక్క చూసినా జాతీయ రహదారులు, రైల్వే లైన్లు ఉన్నాయి. పొరుగునే కృష్ణపట్నం, చెన్నై నౌకాశ్రయాలున్నాయి. రేణిగుంటలో అంతర్జాతీయ విమానాశ్రయం ఉంది. ఇన్ని అనుకూలతలు.. మన జిల్లాల్లోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో ఈఎంసీలు విస్తరించాయి. వీటి వరకు మౌలిక సదుపాయాలు బాగానే ఉన్నా పాత పారిశ్రామిక పార్కుల్లోనే సమస్యలు తిష్ఠ వేశాయి. ఇక్కడ యూనిట్ల స్థాపనకు ప్లాట్లు ఉన్నా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదు. దీంతో పెట్టుబడులు పెట్టేందుకు పారిశ్రామికవేత్తలు వెనుకంజ వేస్తున్నారు. గంగాధరనెల్లూరులోని పారిశ్రామికవాడ 2014- 19 మధ్య ఓ వెలుగు వెలిగింది. భూమి తీసుకోవడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపారు. వైకాపా అధికారంలోకి వచ్చాక ఇటువైపు ఎవరూ కన్నెత్తి చూడలేదు. తెలుగుదేశం హయాంలో మౌలిక వసతుల కల్పనకు అడుగులు పడా. జగన్ ప్రభుత్వం పట్టించుకోలేదు. రహదారులు, మురుగునీటి పారుదల వసతి కల్పించాలి. తిరుపతి జిల్లాలో మేనకూరు పారిశ్రామికవాడకు వెళ్లే రోడ్డు సైతం గుంతలమయంగా మారింది. రేణిగుంట మండలంలో మూడు పారిశ్రామివాడలుండగా అన్నింటిలోనూ రోడ్లు సరిగా లేవు. వీధిదీపాలు వెలగడంలేదు. గాజులమండ్యంలో విశాలమైన రహదారులున్నా అంతా గుంతలు తేలాయి.

**మచ్చుకు గంద్రాజుపల్లెను పరిశీలిస్తే..**

గంగవరం మండలంలోని గండ్రాజుపల్లె పారిశ్రామిక పార్కు.. బెంగళూరుకు సమీపంలోనే ఉంది. ఈ ప్రాంతానికి చేరుకోవడానికి రెండు గంటలు కూడా పట్టదు. ఇంతటి సానుకూలత ఉన్నా అంతర్గత రహదారులు మాత్రం అధ్వానంగా ఉన్నాయి. దీనికితోడు విద్యుత్తు అంతరాయం వేధిస్తోంది. చిన్న చిన్న ఇబ్బందులను పరిష్కరిస్తే వందల కోట్ల రూపాయల పెట్టుబడులు వస్తాయి. స్థానికులకు ఉపాధి లభిస్తుంది.

**జిల్లా కేంద్రంలోనే అధ్వానంగా**

చిత్తూరు పారిశ్రామిక పార్కులో దశాబ్దాల క్రితం నిర్మించిన రోడ్లు ఛిద్రమయ్యాయి. వర్షం వస్తే రెండు- మూడు రోజులపాటు ఈ ప్రాంతం అంతా బురదమయమే. పారిశుద్ధ్య నిర్వహణ కూడా అధ్వానమే. మరోవైపు యూనిట్లు స్థాపించుకున్న వ్యక్తుల నుంచి మాత్రం డబ్బులు వసూలు చేస్తున్నారు. వైకాపా హయాంలో ఈ విషయమై గగ్గోలు పెట్టినా పట్టించుకోలేదు. ఇప్పుడైనా వీటన్నింటినీ సరిదిద్దాలి.

**నివేదికలు సిద్ధం చేసి పంపితే..**

రెండు జిల్లాల్లోని పారిశ్రామిక పార్కుల్లో ఎక్కడెక్కడ మౌలిక వసతులు అధ్వానంగా ఉన్నాయి? ఎంత ఖర్చవుతుంది? అని ప్రభుత్వానికి నివేదిస్తే ఫలితం ఉంటుంది. తీవ్రతను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళితే కనీసం ఆరు నెలలు- ఏడాదిలోనైనా నిధులు విడుదలవుతాయి. ప్రస్తుతం పీపీపీ విధానంలో నూతన పారిశ్రామిక పార్కులు నెలకొల్పుతున్నందున.. ఇక్కడ కూడా ప్రైవేటు వ్యక్తులతో కలిసి కనీస సదుపాయాలు కల్పించవచ్చు.

# ఆస్తుల ఆటో మ్యుటేషన్ వైపు అడుగులు



చిత్తూరు : నగరంలో ఖాళీ స్థలం, ఇల్లు కొనుగోలు చేసుకున్నవారు ఆ ఆస్తిని తమ పేరిట మార్చుకునేందుకు నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాలి. సచివాలయం ద్వారా రిజిస్టర్ దస్తావేజులు ఆన్‌లైన్‌లో పంపితే అధికారులు పరిశీలించి టైటిల్ మార్పు చేసి పన్ను విధిస్తారు. పాత విధానంలో ఆస్తుల మార్పిడికి నగరవాసులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ ఇబ్బందులు తీర్చాలని రాష్ట్ర ప్రభుత్వం సంస్కరణల్ని తీసుకొచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా రిజిస్ట్రేషన్ చేయించుకున్న వెంటనే ఆన్‌లైన్ విధానంలో ఆటో మ్యుటేషన్(యజమాని పేరు ఆన్‌లైన్‌లోనే మారడం)ను అమలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిత్తూరు నగరపాలక సంస్థ పరిధిలో ఆగస్టు ఒకటి నుంచి రిజిస్ట్రేషన్ చేసుకున్న దస్తావేజులకు ఆటో మ్యుటేషన్ విధానాన్ని అమలు చేయనుంది.

**మార్కెట్ విలువ ప్రకారం రుసుములు**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ కాగానే ఆ వివరాలు నగరపాలక అధికారులకు ఆన్‌లైన్ ద్వారా చేరతాయి. అక్కడ పరిశీలించి ఆమోదం పొందగానే ఆటో మ్యుటేషన్ పత్రం జనరేట్ అవుతుంది. ఈ ప్రక్రియ ముగిశాక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా కొత్త దస్తావేజులతోపాటు ఆస్తి బదలాయింపు పత్రం పొందేలా ప్రణాళిక సిద్ధం చేశారు. మార్కెట్ విలువ, స్థలం విస్తీర్ణం బట్టి మ్యుటేషన్ రుసుములు చెల్లించాల్సి ఉంటుంది. ఈ విధానంపై జిల్లా రిజిస్ట్రారు ఏవీఆర్ మూర్తి, నగరపాలక సంస్థ కమిషనర్ నరసింహప్రసాద్‌లు సబ్ రిజిస్ట్రార్లు, నగరపాలక అధికారులకు అవగాహన కల్పించారు.

**ఆస్తి పన్ను రసీదు తప్పనిసరి**

రిజిస్ట్రేషన్ సమయంలో గతంలో ఇంటికి చెల్లిస్తున్న రసీదు సమర్పించాలి. స్థలమైతే వీఎల్‌టీ (వేకెంట్ ల్యాండ్ ట్యాక్స్) రసీదు అందజేయాలి. రిజిస్ట్రేషన్ తర్వాత ఆటోమేటిక్‌గా నగరపాలక రికార్డుల్లో పేరు మారుతుంది. అవి లేని పక్షంలో పన్ను వేయాల్సిన అవసరాన్ని వివరిస్తూ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి నగరపాలక లాగిన్‌కు సమాచారం వస్తుంది. ఆ మేరకు పేరు మార్చి పన్ను విధిస్తారు. ఒకే ఆస్తిని ఇద్దరు, ముగ్గురు కలిసి కొనుగోలు చేసినా ఇదే విధానం వర్తించనుంది.

# కాలం మారేను మెల్లగా.. 'మెట్రో'లో వెళ్దాం చల్లగా!




విశాఖపట్నం: విశాఖలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి... మెట్రో రైలు ప్రాజెక్టును పట్టాలెక్కించే ప్రక్రియ వేగంగా సాగుతోంది. రూ.6,250 కోట్లతో మొదటి దశ పనులకు ఆంధ్రప్రదేశ్ మెట్రో రైలు కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీఎల్) టెండర్లు ఆహ్వానించింది. ఇంజినీరింగ్ పనులు, ఆకృతులు, వాటి నిర్మాణానికి అర్హులైన కంపెనీల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. ఆసక్తి ఉన్న బిడ్డర్లు సెప్టెంబరు 12వ తేదీ మధ్యాహ్నం 3 గంటల్లోగా దరఖాస్తులు సమర్పించాలి. ఏపీఎంఆర్‌సీఎల్ కార్యాలయంలో ఆగస్టు 12న ప్రీబిడ్ సమావేశం నిర్వహించనున్నారు. సెప్టెంబరు 5 నుంచి దరఖాస్తుల సమర్పణకు అవకాశం కల్పిస్తారు. అదే నెల 12న బిడ్లు తెరవనున్నారు. ఈ మొత్తం ప్రాజెక్టును ప్రారంభ తేదీ నుంచి 30 నెలల్లో పూర్తిచేసి అప్పగించాలని ఏపీఎంఆర్‌సీఎల్ స్పష్టం చేసింది. 'డబుల్ డెక్కర్' పైవంతెన పనులు ప్రారంభించిన రెండేళ్లలో పూర్తిచేయాలంది.

వీఎంఆర్‌డీఏకు అనకాపల్లి, విజయనగరం, విశాఖ జిల్లాల్లో 1,941.19 ఎకరాల భూసమీకరణకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రైతుల నుంచి సమీకరించిన భూములకు పరిహారంగా అభివృద్ధి చేసిన ప్లాట్లను ఇస్తారు. మిగిలిన భూములను వీఎంఆర్‌డీఏ విక్రయిస్తుంది. ఈ ప్రక్రియలో వచ్చిన నిధుల్లో కొంత మెట్రో ప్రాజెక్టుకు వెచ్చించనున్నారు.

అతి పొడవైనదిగా: నగరంలో ట్రాఫిక్ సమస్యల నివారణకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ పది పైవంతెనల నిర్మాణానికి ప్రణాళిక రూపొందించింది. అయితే ఆ వంతెనల స్థానంలో మెట్రోను డబుల్ డెక్కర్ తరహాలో తీసుకురానున్నారు. కొమ్మాది-స్టీల్‌ప్లాంటు మధ్య నిర్మించే 34.40 కి.మీ కారిడార్‌లోనే ఇది రానుంది. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 8 పైవంతెనలను అనుసంధానం చేసి ఒకే వంతెనగా నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య మరొకటి నిర్మించనున్నారు. మొత్తంగా 20 కిలోమీటర్లలో 'డబుల్ డెక్కర్' వస్తుంది. ఇక్కడ కింద రోడ్డు... దానిపైన నాలుగు వరుసల్లో పైవంతెన (ఫ్లైఓవర్), ఆపైన మెట్రో ట్రాక్ రానుంది. ఇది పూర్తయితే ఆసియా ఖండంలోనే పొడవైన డబుల్ డెక్కర్ మెట్రోగా గుర్తింపు పొందనుంది.

## ఎడాపెడా వాడేస్తున్నారు..!

రాజమహేంద్రవరం : వ్యవసాయంలో రైతులు మోతాదుకు మించి ఎరువులు, పురుగు మందులు వినియోగిస్తున్నారు. దీనికి సంబంధించి వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పరిగణనలోకి తీసుకుంటే నాణ్యమైన ఆహార ఉత్పత్తులతోపాటు .. నేలతల్లి సారాన్ని సంరక్షించవచ్చు. దేశంలో 2023-24 సంవత్సరంలో ఎకరాకు సగటున 56 కిలోలు యూరియా వాడితే..ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా రైతులు సగటున 90 కిలోలు వినియోగించడం గమనార్హం. ఒక్క తూర్పుగోదావరిలోనే ఎకరాకు 164 కిలోలు వాడారు. కాకినాడలో 55.2 కిలోలు వినియోగించగా.. బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాత్రం 50.8 కిలోల చొప్పున వాడి ఆదర్శంగా నిలిచారు. ఎరువుల అధిక వినియోగం నియంత్రించాలని కేంద్రం హెచ్చరికలు చేస్తున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. ఇటీవల వ్యవసాయ శాఖ ముఖ్య కార్యదర్శి కలెక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి పలు సూచనలు చేశారు.



**నేలకు చేటు**

తూర్పుగోదావరి జిల్లాలో జాతీయ సగటుకు మించి 200 శాతం అధికంగా ఎరువు వినియోగిస్తున్నారు. జిల్లాలో రబీలో 58 వేలు, ఖరీఫ్‌లో 72 వేల హెక్టార్లలో వరి సాగవుతోంది. దీనిలో దాదాపు 47 వేల ఎకరాల్లో ప్రకృతి సేద్యం జరుగుతోందని గణాంకాలు చెబుతున్నా సుమారు 7 వేల ఎకరాల్లోనే పూర్తిగా అమలవుతోంది. మిగిలిన 40 వేల ఎకరాల్లో కషాయాలతోపాటు అప్పుడప్పుడూ యూరియా వినియోగిస్తున్నారు.

సాధారణంగా పంటకు నత్రజని, భాస్వరం, పొటాష్‌లు నాలుగు, రెండు, పాళ్లు చొప్పున వేయాల్సి ఉండగా నత్రజని 8 నుంచి 13 పాళ్లు వాడుతున్నారు. దీంతో నేల సారం దెబ్బతింటోందని జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు తెలిపారు.

**ఇలా చేస్తే మేలు**

నాట్లు వేసేటప్పుడు 50 కిలోల డీఏపీ బస్తాకు 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ కలపాలి. దీనికి భిన్నంగా రైతులు బస్తాన్నర (దాదాపు 60 కిలోలు) యూరియా వేస్తూ పోటాష్, డీఏపీ వేయడం లేదు. పంట 30 రోజుల సమయంలో రెండో దఫా వేసినప్పుడు 25 కిలోల యూరియా సరిపోతుంది. లేకపోతే తక్కువ ధరకు లభించే నానో యూరియా పావు లీటరు పిచికారీ చేస్తే మేలు. 90 శాతం పంటకు ఉపకరిస్తుంది. పంట 45 నుంచి 50 రోజుల్లో 25 కిలోల యూరియా, 15 కిలోల పొటాష్ మాత్రమే వాడాలి. లేదంటే అరలీటరు నానో యూరియా వాడితే చాలు. విజయవాడలోని కార్యశాలలో నానో యూరియా వినియోగంపై రైతులకు అవగాహన కల్పించాలని సూచిస్తూ తూర్పుగోదావరిలో 1400, కాకినాడ, కోనసీమలో 1000 నుంచి 1200 లీటర్ల చొప్పన వినియోగించాలని లక్ష్యంగా నిర్దేశించారు.

## ఆ అధికారుల్లో ఎవరి పాత్ర ఎంత?

కాకినాడ : గత వైకాపా ప్రభుత్వంలో కాకినాడ నగరపాలక సంస్థలో జరిగిన అక్రమాలపై విజిలెన్స్ నివేదికలో పేర్కొన్న కొందరి అధికారుల పాత్రపై రాష్ట్ర ఇంటిలిజెన్స్ విభాగం ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది. 2019-2024 వరకు సాగించిన అక్రమాల పర్వంపై లోతుగా వివరాలు సేకరిస్తోంది. దీనిపై సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందించనున్నట్లు సమాచారం. వైకాపా హయాంలో నగరపాలక సంస్థ కమిషనర్(ఎఫ్ఏసీ)గా పనిచేసిన సీహెచ్.నాగనరసింహారావు, అప్పటి పర్యవేక్ష ఇంజినీరు పి.సత్యకుమారి, ఈఈ ఎస్.ప్రభాకరరావు, డీఈఈ కె.వెంకటరావు, ఎం.రమేశ్‌బాబులు మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డికి పూర్తిగా సహకరించారని, అడ్డగోలు నిర్ణయాలకు కౌన్సిల్ తీర్మానాలు చేసి రూ.కోట్లలో నిధులు లబ్ధి చేకూరేలా చేశారని విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ప్రాథమికంగా గుర్తించి, ఆ అధికారులపై చర్యలకు సిఫార్సు చేసింది. దీంతో గత



మూడు రోజులుగా కాకినాడ నగరపాలక సంస్థలో కలకలం రేగుతోంది. వారు ఎంత కాలం ఇక్కడ పనిచేశారు.. తీసుకున్న నిర్ణయాల్లేంటి, మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడికి ఏ విధంగా ఆయాచిత లబ్ధి చేకూర్చారు అనే కోణంలో ఇంటిలిజెన్స్ విభాగం ఆరా తీస్తోంది. గతంలో కాకినాడ నగరపాలక సంస్థలో పనిచేశారా..? తర్వాత ఎక్కడి బదిలీ అయ్యారు..? వైకాపా ప్రభుత్వం వచ్చాక.. ఇక్కడకు ఎలా వచ్చారు..? అక్రమాలకు ఏవిధంగా సహకరించారనే నివేదికను సిద్ధం చేస్తున్నారు. **పూడికతీతపై దుమారం**

ప్రధానంగా అరట్లకట్ట వేసవి జలాశయంలో పూడికతీత పనులకు డ్రెడ్జింగ్ కార్పొరేషన్ నుంచి కొటేషన్ తీసుకోకుండా, ఏకపక్షంగా ఇక్కడి అధికారులు వ్యవహరించారనే అంశం దుమారం రేపుతోంది. విజిలెన్స్ విభాగం చర్యలకు సిఫార్సు చేసిన అయిదుగురిలో సీహెచ్.నాగరసింహారావు మున్సిపల్ ఆర్డీగా రాజమహేంద్రవరంలో పనిచేస్తున్నారు. పి.సత్యకుమారి విజయవాడ నగరపాలక సంస్థలో పర్యవేక్షక ఇంజినీరుగా, ఈఈ ప్రభాకరరావు విజయవాడ, డీఈఈ కె.వెంకటరావు నూజివీడు, ఏఈ రమేశ్‌బాబు రాజమహేంద్రవరంలో పనిచేస్తున్నారు. వీరిలో సత్యకుమారి తన సర్వీసులో ఎక్కువ కాలం కాకినాడలో పనిచేసిన అంశంపైనా ఆరా తీస్తున్నట్లు తెలిసింది. మొత్తం మీద గత ప్రభుత్వంలో అధికారుల అడ్డగోలు వ్యవహారాలపై పూర్తిస్థాయిలో విచారణ చేసేందుకు సిద్ధమవుతున్నారు. విజిలెన్స్ పూర్తి నివేదికను బట్టబయలు చేస్తే మరిన్ని అక్రమాలు వచ్చే అవకాశం ఉంది.

**నేను ఒక సంతకమే పెట్టాను**

కాకినాడ మున్సిపల్ కమిషనర్(ఎఫ్ఏసీ)గా ఉన్న కాలంలో అరట్లకట్ట రిజర్వాయర్‌లో పూడికను తరలించే క్రమంలో రైల్వే అనుమతి కావాలంటే నేను ఒక సంతకం మాత్రమే చేశాను. మిగతా వ్యవహారాలతో నాకు ఎలాంటి సంబంధం లేదు. సీహెచ్.నాగనరసింహారావు, మున్సిపల్ ఆర్డీ,రాజమహేంద్రవరం

# గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లకు మహర్దశ

గుంతకల్లు : రైల్వే ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు, స్టేషన్ల గుండా సకాలంలో రైళ్లు బయలుదేరి వెళ్లేవిధంగా చూడడానికి గుంతకల్లు, గుత్తి రైల్వే జంక్షన్లలో అత్యాధునిక వసతులు సమకూర్చనున్నారు. దీనికి గాను రూ. 47.69 కోట్లు కేటాయించి గుత్తేదారులకు ఆయా పనులు అప్పగించే ప్రక్రియను పూర్తి చేశారు. గుంతకల్లు జంక్షన్‌లో అధునాతన సిగ్నలింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. పనులు పూర్తయితే గుత్తి, గుంతకల్లు జంక్షన్లలో మెరుగైన సౌకర్యాలు ప్రయాణికులకే కాకుండా రైల్వే సిబ్బందికి సమకూరనున్నాయి. స్టేషన్లలో పనులు చేపట్టడానికి అవసరమైన నిధుల కోసం గత 20 ఏళ్ల నుంచి నుంచి ఎదురు చూస్తుంటే రైల్వే బోర్డు ప్రస్తుతం నిధులు కేటాయించడం శుభపరిణామం.

**క్షేత్రస్థాయిలో చకచకా పనులు**



గుత్తి రైల్వే జంక్షన్‌లో ప్లాట్‌ఫాంల నిర్మాణం, షెల్టర్ల ఏర్పాటు, వంతెనల నిర్మాణం, అదనపు రైల్వేలైన్లు, గదుల నిర్మాణ పనులను చేపడుతున్నారు. గుంతకల్లు రైల్వే జంక్షన్‌లో యార్డు విస్తరణ, స్టేషన్ భవనాల నిర్మాణంతో పాటు స్టేషన్‌లోని అన్ని రైల్వేలైన్ల అనుసాధానం పనులు చేపడుతున్నారు. కొత్తదైన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ వ్యవస్థ అందుబాటులోకి రానుంది. ఇప్పుడు స్టేషన్‌లో ఉన్న మూడు సిగ్నలింగ్ క్యాబిన్లను తొలగించి వాటిని ఒకే గదిలో ఏర్పాటు చేయనున్నారు. ఇందుకుకోసం ఇప్పటికే స్టేషన్‌లో రూ. 3 కోట్లు ఖర్చు చేసి సిగ్నలింగ్ క్యాబిన్ భవాలను నిర్మించారు. యార్డుల విస్తరణ పూర్తయితే తప్పా సిగ్నలింగ్ వ్యవస్థలో మార్పులు చేయడానికి అవకాశం లేదని విస్తరణ పనులను చేపడుతున్నట్లు సంబంధిత అధికారులు చెబుతున్నారు.
కొత్త వ్యవస్థ ఏర్పాటైతే కంప్యూటర్ల సాయంతో సిగ్నళ్లు పనిచేస్తాయని అధికారులు పేర్కొన్నారు. రైలు ప్రమాదాలు జరగడానికి, రైళ్లు డేంజర్ సిగ్నళ్లను దాటే అవకాశం ఉండదని అధికారులు చెబుతున్నారు. లైన్ల అనుసంధాన పనులను చేయడానికి స్టేషన్‌లోని పాత బుకింగ్ కార్యాలయానికి చెందిన భవనాలు పూర్తిగా తొలగించనున్నారు.

# నైపుణ్యాభివృద్ధిమస్తు.. ఉద్యోగ ప్రాప్తిరస్తు..!

మద్దిలపాలెం : ఇంజినీరింగ్ చదివిన విద్యార్థులకే కొలువులు దొరకని రోజులివి. ఇక సాధారణ డిగ్రీ చేసిన విద్యార్థుల పరిస్థితి ఏమిటి..? వారికి ఉద్యోగాలు ఎలా వస్తాయి.. ఈ ప్రశ్నలకు జవహర్ విజ్ఞాన కేంద్రాలు (జేకేసీలు) సమాధానాలు చెబుతున్నాయి. డిగ్రీ విద్యార్థులకు ఇక్కడ శిక్షణ ఇచ్చి ఉద్యోగార్థులుగా తీర్చిదిద్దుతున్నారు. 2006లో రాష్ట్ర ప్రభుత్వం డిగ్రీ కళాశాలల్లో వీటిని ప్రారంభించింది. అందులో మద్దిలపాలెం డాక్టర్ వీఎస్‌కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని కేంద్రం కూడా ఉంది.

**ఒక్కో బ్యాచ్‌కు మూడు నెలలు:** ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎటువంటి ఫీజు చెల్లించకుండా జేకేసీలో శిక్షణ పొందవచ్చు. మూడు నెలలపాటు బ్యాచ్‌కి 60 మంది చొప్పున ఏడాదికి 240 మంది వీఎస్‌కృష్ణా కళాశాల జేకేసీలో శిక్షణ పొందుతున్నారు.
నిపుణులైన మెంటార్లు విద్యార్థుల్లో కమ్యూనికేషన్, విశ్లేషణాత్మక నైపుణ్యాల పెంపుదలకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. సాఫ్ట్ స్కిల్స్, రీజనింగ్, అర్థమెటిక్‌లో మెలకువలు నేర్పిస్తున్నారు. ఎంపిక చేసిన అంశంపై బృంద చర్చలు ఏర్పాటు చేసి ఆంగ్లభాష నైపుణ్యాలు పెంచుకునేలా, వేదికలపై భయం లేకుండా మాట్లాడేలా తర్ఫీదు ఇస్తున్నారు. రోజు రెండు గంటలపాటు తరగతులు ఉంటాయి. ఒక గంట థియరీ, మరో గంట ప్రాక్టికల్స్.
కంప్యూటర్ కోర్సులు, వ్యక్తిత్వ వికాస తరగతులు: ప్రస్తుతం యువత ఏ ఉద్యోగంలో చేరాలన్నా కనీసం కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం. అందుకే ఇక్కడ విద్యార్థులకు ఎం.ఎస్.ఆఫీస్, ఇంటర్నెట్, సీ లాంగ్వేజ్



లాంటి కోర్సులు నేర్పిస్తున్నారు. ఉద్యోగ సాధనలో వ్యక్తిత్వ వికాసం కీలకపాత్ర పోషిస్తున్న నేపథ్యంలో నిపుణులతో వ్యక్తిత్వ వికాస తరగతులు ఏర్పాటు చేస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వివిధ సంస్థలు ఉద్యోగాలు మేళాలు ఏర్పాటు చేస్తున్నాయి.

**పేద విద్యార్థులకు వరం..**

– సౌజన్య, వీఎస్‌కృష్ణా కళాశాల పూర్వ విద్యార్థిని

వీఎస్ కృష్ణా డిగ్రీ కళాశాలలో బీకాం చదువుతూ జేకేసీలో శిక్షణ తీసుకున్నా. ఉద్యోగ మేళాలో ప్రతిభ చూపడంతో బెంగళూరులోని ఫ్లిప్‌కార్టు సంస్థలో ఉద్యోగం వచ్చింది. జేకేసీలో శిక్షణతో నైపుణ్యాలు పెరిగాయి.

**గ్రామీణ ప్రాంత యువతకు ఉపయుక్తం**

– డాక్టర్ జి.శ్రీనివాసరావు, జేకేసీ కోఆర్డినేటర్

ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు జేకేసీ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతోంది. మూడు నెలల్లో వారిలో నైపుణ్యాలు పెరిగేలా తర్ఫీదు ఇస్తున్నాం. నమూనా ఇంటర్వ్యూలు నిర్వహించి ఆత్మవిశ్వాసం పెరిగేలా చూస్తున్నాం.

# తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తం!




అనంతపురం : ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు జరిగిన తర్వాత తల్లీబిడ్డను సురక్షితంగా వారి ఇంటికి చేర్చే తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఉమ్మడి జిల్లాలో ఆరు వాహనాలు మరమ్మతుకు గురైతే గుత్తేదారు సంస్థ పట్టించుకోవడం లేదు. ఉదయం ఆసుపత్రుల నుంచి తల్లీబిడ్డలను డిశ్చార్జి చేయకుండా ఆలస్యం చేస్తున్నారు. అప్పటి వరకూ వాహనాలను నిలుపుకొని ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వటం లేదని, కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వాహనాల కేటాయింపు ఇలా**

ఉమ్మడి జిల్లాలో 36 వాహనాలు కేటాయించారు. ఇందులో అధికంగా ప్రసవాలు జరిగే అనంత సర్వజన వైద్యశాలకు 13, తాడిపత్రి 2, కదిరి, 2, హిందూపురం 3, మిగిలిన ప్రాంతాల్లోని ఆసుపత్రులకు ఒకటి చొప్పున కేటాయించారు.
సర్వజన వైద్యశాలకు కేటాయించిన నాలుగు వాహనాలు, శింగనమల ఒకటి , గుత్తిలో మరో వాహనం మరమ్మతులకు గురైంది. ఇక్కడ సమీప ఆసుపత్రులకు కేటాయించిన వాహనాలను సర్దుబాటు చేస్తున్నారు. ఆసుపత్రుల్లో ఆయా వాహనాలకు సంబంధించిన నంబర్ల బోర్డులు ఎక్కడా ఏర్పాటు చేయలేదు. ఎవరికి ఫోన్ చేయాలో తెలియక కొంతమంది ప్రైవేట్ వాహనాల్లో ఇళ్లకు వెళ్లిపోతున్నారు.

**ఒకే వాహనంలో ఇద్దరు**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనంలో ఒక తల్లి, బిడ్డ, వారికి సాయంగా ఉన్న ఒకరిని గమ్యస్థానానికి తీసుకెళ్లాలి. కొన్ని వాహనాలు మరమ్మతుకు గురవటంతో ఒకే రూట్‌లో వెళ్లాల్సిన ఇద్దరు తల్లులు, బిడ్డలను, వారి సహాయకులను తీసుకెళ్తున్నారు. కొందరు డ్రైవర్లు వారి వద్ద వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

**వేతన బకాయిలు ఇప్పించేవారేరీ?**

తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహన డ్రైవర్‌కు నెలకు రూ.7,870 వేతనం ఇస్తున్నారు. ఈ మొత్తం కూడా నాలుగు నెలలుగా ఇవ్వకపోవటంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేతనాలు పెంచాలని, బకాయిలు విడుదల చేయాలని ఇప్పటికే వారు పలుమార్లు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించారు. ఇటీవల కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.

**వినియోగంలోకి తీసుకొస్తాం :** శంకర్, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల, ఉమ్మడి జిల్లాల కోఆర్డినేటర్ఆరు వాహనాల్లో నాలుగింటిని మరమ్మతులకు ఇచ్చాం. వాటిని వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. వేతనాలకు సంబంధించిన విషయం మా పరిధిలో లేదు. కాల్‌సెంటర్ నంబరును అన్ని ఆసుపత్రులోని కాన్పుల వార్డులో ఏర్పాటు చేస్తాం.ఉమ్మడి అనంత జిల్లాలో తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనాల సంఖ్య : 36 రెండు నెలల్లో గమ్యస్థానాలకు చేర్చిన వారి సంఖ్య : 1,739మరమ్మతుకు గురైన వాహనాలు : 6
మొత్తం డ్రైవర్లు : 36

# బినామీల పేరిట కట్టేసి.. అద్దెలు దోచేసి




అనంతపురం : జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) స్థలంలో నిర్మించిన వాణిజ్య దుకాణాల అద్దెల చెల్లింపు అస్తవ్యస్తంగా మారింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో డీసీఎంఎస్ కార్యాలయం ఎదురుగా 14 దుకాణాలు నిర్మించారు. వీటిని ఏడుగురు నిర్మించినట్లు గత అధ్యక్షుడు తన బంధువుల పేర్లను చేర్చారు. ఒక్కో దుకాణం నుంచి రూ.1.50 లక్షల వరకు అడ్వాన్సుల రూపంలో వసూలు చేశారు. కొందరు రూ.లక్ష చెల్లించారు. ఇలా.. రూ.10 లక్షలకుపైగా అడ్వాన్సులను అప్పట్లో వసూలు చేశారు. సహకార శాఖ అధికారుల ఆదేశాలను బేఖాతరు చేసి సొసైటీకి నష్టం వచ్చే విధంగా ఒక్కో దుకాణానికి రూ.10 వేలు అద్దె నిర్ణయించారు. ఇందులో రూ.4,500 డీసీఎంఎస్‌కు, రూ.5,500 మాజీ అధ్యక్షుడి ఖాతాకు చేరుతున్నాయి. అడ్వాన్సులు మాత్రం డీసీఎంఎస్‌కు చెల్లించకుండా కేవలం అద్దెలు మాత్రమే ఇస్తున్నారు.

**రూ.4 లక్షలకు చేరిన బకాయిలు**

దుకాణదారులు చెల్లిస్తున్న అద్దెలు కూడా బినామీల ఖాతాలకు చేరుతున్నాయి. డీసీఎంఎస్‌కు రూ.4 లక్షల వరకు బకాయి పెడుతున్నారు. ఇప్పటి వరకు సంబంధిత అధికారులు పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం ఇటీవలే కొత్త అధ్యక్షులను నియమించింది. ప్రస్తుతం అధ్యక్షుడిగా నెట్టెం వెంకటేష్ బాధ్యతలు స్వీకరించారు. అద్దెలు వసూలు చేయడమే కాకుండా అడ్వాన్సులు, దుకాణాల నిర్మాణం ఎలా చేశారన్న విషయం తేల్చాల్సిన అవసరం ఉంది. అంతేకాదు ధర్మవరంలో నిర్మించిన 8 దుకాణాల వ్యవహారం కూడా తేల్చాలి. గతంలో కారుచౌకగా కట్టబెట్టిన భవనాలపై కూడా ఆరా తీయాల్సి ఉంటుంది. ఇటీవల అద్దెకు ఉంటున్న వ్యాపారులతో చర్చించినట్లు తెలిసింది. ఇప్పటి నుంచి అద్దె మొత్తాలను డీసీఎంఎస్‌కే చెల్లించాలని హెచ్చరించినట్లు అధికారులు తెలిపారు.

**బకాయిలు వసూలు చేస్తున్నాం : విజయభాస్కర్, డీసీఎంఎస్ బిజినెస్ మేనేజరు** అద్దె బకాయిలు రూ.4 లక్షల వరకు ఉన్న విషయం వాస్తవమే. వచ్చే నెల నుంచి బకాయిలు వసూలు చేస్తాం. సొసైటీని లాభాల దిశగా నడిపించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నాం.

# త్వరలో లో ఓల్టేజి సమస్యలకు చెక్

చిత్తూరు : వైకాపా పాలనలో విద్యుత్తు శాఖ అవినీతి అక్రమాల్లో కూరుకుపోయింది. నూతన విద్యుత్తు ఉప కేంద్రాల నిర్మాణాలు కేవలం అప్పటి విద్యుత్తు శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రాతినిధ్యం వహించిన పుంగనూరుకే పరిమితమయ్యాయి. అవసరం లేనప్పటికీ.. ఇష్టానుసారంగా ఉప కేంద్రాలు నిర్మించి రూ.కోట్లు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి. ఇదిలా ఉంటే ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున కేంద్రాలు మంజూరు చేయాలని ప్రతిపాదనలు వెళ్లినా.. అవి ఆచరణలోకి రాలేదు.
జిల్లాలో విద్యుత్తు వినియోగం రోజురోజుకు పెరుగుతోంది. అందుకనుగుణంగా ఫీడర్లు, లైన్లు, ఉప కేంద్రాలు లేకపోవడంతో లో ఓల్టేజి, అధిక లోడు సమస్యలతో వినియోగదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధానంగా పూతలపట్టు, పలమనేరు, గంగాధరనెల్లూరు నియోజకవర్గాల్లో లో ఓల్టేజి, అధిక లోడు సమస్యలతో విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు ఏర్పడుతున్నాయి. నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్తు సరఫరాకు కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది.

**నియోజకవర్గానికి చొప్పున రెండు మంజూరు**

సీఎం సొంత నియోజకవర్గం కుప్పంలో నాలుగు ఉప కేంద్రాల నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. త్వరలో రెండు ఉప–కేంద్రాలు ప్రారంభం కానున్నాయి. అలాగే చిత్తూరు, పలమనేరు, గంగాధర నెల్లూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు రెండు చొప్పున, నగరి నియోజకవర్గానికి ఓ ఉప కేంద్రాన్ని మంజూరు చేశారు. స్థల ఎంపిక ప్రక్రియ పూర్తి చేశారు. త్వరలో నిర్మాణ పనులు ప్రారంభించడానికి విద్యుత్తు శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. అలాగే మరో విడతగా అధిక లోడు, లో ఓల్టేజి సమస్యలున్న ఫీడర్లను గుర్తించి అవసరమైన



చోట నూతన ఉప–కేంద్రాలు మంజూరు చేయనున్నారు.

**త్వరలో పనులు ప్రారంభం**

ఇప్పటికే కుప్పంలో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మిగిలిన తొమ్మిది ఉప–కేంద్రాల ఏర్పాటుకు స్థలాల ఎంపిక పూర్తయింది.. త్వరలో టెండర్లు ఆహ్వానించి పనులు ప్రారంభిస్తాం.
ఇస్మాయిల్ అహ్మద్, ఎస్ఈ
కొత్తగా తొమ్మిది విద్యుత్తు ఉప కేంద్రాలు
వైకాపా పాలనలో పుంగనూరుకే పరిమితం
జిల్లాలోని మొత్తం విద్యుత్తు సర్వీసులు: 7.33 లక్షలు
వ్యవసాయ: 1.90 లక్షలు
గృహ : 5.02 లక్షలు

# నీళ్లే.. కన్నీళ్లై..!

వరదయ్యపాళెం : నియోజకవర్గంలో ఆరేళ్లలో కురిసిన వరదల కారణంగా పలు కాలువలకు గండి పడి ఏళ్లు గడుస్తున్నా.. ఇప్పటివరకు మరమ్మతులకు నిధులు మంజూరు చేయకపోవడం రైతుల పాలిట శాపంగా మారింది. ఫలితంగా కళ్లముందు నీళ్లున్నా ఆ నీళ్లే వారికి కన్నీళ్లను మిగిలిస్తున్నాయి. దీంతో రైతులు ఏటా ఆర్థికంగా నష్టపోతున్నారు. వర్షాలకు వర్షపునీరు గండి ద్వారా పొలాలకు మళ్లుతుండటంతో వేసిన పంటలు నీట మునిగి నష్టం ఏర్పడుతోంది. దీంతో ఆ ప్రాంతాల రైతులు తమ జీవనాధారమైన సేద్యం చేయలేని పరిస్థితి నెలకొంది. వర్షాకాలం ఆరంభం కావడంతో ఈ సారైనా తమ కష్టాలు తీరుతాయని కోటి ఆశలతో ఎదురుచూస్తున్నారు.

**గండి పడి ఏడేళ్లు..**

2017 నవంబరులో కురిసిన వరదల కారణంగా నీటి ప్రవాహ ఉధ్ధృతికి మండలంలోని సంతవేలూరు సమీపంలోని పులిబొంద, మార్లమ



డుగు కాలువలకు గండి పడింది. 2018లో నాటి ప్రభుత్వం ఈ కాలువ మరమ్మతులకు నిధులు మంజూరు చేసింది. టెండర్ల ప్రక్రియ ఆలస్యం కావడం, ఇంతలో ఎన్నికలు సమీపించడంతో పనులు ఆగిపోయాయి. వైకాపా ఒక్కపైసా నిధులు మంజూరు చేయలేదు. ఏటా రైతులు వరి నార్లు వేసి సాగు చేయడం, వర్షాలకు గండి కారణంగా నీట మునగడం రివాజుగా మారింది. దీంతో రైతులు అప్పులతో ఆర్థికంగా నష్టపోతున్నారు. బీఎన్‌కండ్రిగ మండలం పల్లమాల వద్ద కాళంగి నది ఆనకట్ట దెబ్బతిని అయిదేళ్లు గడుస్తున్నా, మరమ్మతులు చేపట్టలేదు. గతేడాది నవంబరులో కురిసిన వరదలకు పొలాల్లో ఇసుక మేటలు ఏర్పడిన విషయం తెలిసిందే.
ఈ విషయమై జలవనరుల శాఖ ఏఈ నాగరాజు మాట్లాడుతూ గండి పడిన కాలువల మరమ్మతులకు నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తయిందన్నారు. ప్రస్తుతం వర్షాల కారణంగా నీరు నిల్వ కావడంతో పనులు చేపట్టలేక పోతున్నామని, తగ్గాక పూర్తి చేస్తామన్నారు.

**ఏటా నష్టం.. అన్నదాతకు కష్టం**

అన్నదాతలకు పొలం ఉన్నా సాగు చేయలేని దుస్థితి నెలకొంది. పులిబొంద, మార్లమడుగు కాలువలకు పక్కనే పొలాలు ఉండటం వారి పాలిట శాపంగా మారింది. ఏటా సాగు చేయడం వరదలకు గండి పడిన కాలువల నుంచి వరదనీరు పొలాలకు మళ్లడంతో రూ.వేలు వెచ్చించి వేసిన పంట నిలువునా నీట మునిగి ఏటా రైతులు నష్టపోతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో గండ్లు పడిన కాలువలు, చెరువులకు మహర్దశ ఏర్పడింది. కాలువల మరమ్మతులకు రూ.9లక్షలు చొప్పున నిధులు మంజూరు చేయడంతో ఏడేళ్ల తర్వాత రైతుల ఆశలకు ఊపిరొచ్చింది.

# తప్పులు మార్చరు.. తిప్పలు తీర్చరు!!

విశాఖ : విశాఖ నగరంలో నివాసితులు తమ డోర్ నెంబర్ మార్చుకోవడానికి అవస్థలు పడుతున్నారు. జీవీఎంసీ పరిధిలో సుమారు 5,46,732 అసెస్‌మెంట్లు ఉన్నాయి. 7 లక్షలకు పైగా గృహాలు ఉన్నాయని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రతి ఇంటికి డోర్ నెంబర్ కేటాయించి, దాని ఆధారంగా జీవీఎంసీ ఆస్తి పన్ను విధిస్తుంది. ఆ నంబర్‌నే ప్రామాణికంగా తీసుకుని ఆస్తుల క్రయవిక్రయాల్లో రిజిస్ట్రేషన్ చేస్తుంటారు.

**కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు:** కొన్ని సందర్భాల్లో ఆస్తుల రిజిస్ట్రేషన్ పత్రాల్లో, ఆస్తి పన్ను పుస్తకాల్లో జీవీఎంసీ కేటాయించిన డోర్ నెంబర్ కాకుండా..పొరపాటుగా తప్పు నెంబర్ పడుతుంటుంది. సరి చేసుకుంటేనే ఆస్తిపై లావాదేవీలు జరుగుతాయి. గృహ నిర్మాణానికి అవసరమైన రుణాలు, నిర్మాణంపై మరో అంతస్తు వేసుకోవడానికి అవసరమైన ప్లాన్ మంజూరవుతాయి. ప్రస్తుతం తప్పుగా ముద్రితమైన తమ డోర్ నంబర్లు మార్చుకునే వీల్లేక చాలా మంది ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా సమస్య పరిష్కారం కావడం లేదని బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

**గతంలో ఇక్కడే...** కొన్నాళ్ల కిందట రాష్ట్ర ప్రభుత్వం ఈఆర్‌పీ (ఎంటర్‌ప్యూనర్ రిసోర్స్ ప్రోగ్రాం) తీసుకొచ్చింది. అప్పటి వరకు మహా విశాఖ నగరపాలక సంస్థకు సంబంధించిన ఆస్తుల




వ్యవహారాలన్నీ జీవీఎంసీ డేటాలోనే నిక్షిప్తమై ఉండేవి. ఎలాంటి సమస్య వచ్చినా.. అధికారులు తమ లాగిన్ ద్వారా పొరపాట్లను సులువుగా సరి చేసేవారు. ప్రస్తుతం నగర పరిధిలోని ఆస్తుల వివరాలను రాష్ట్ర ప్రభుత్వం వద్దకు పంపించేయడంతో, అక్కడ అనుమతి ఇస్తేనే గాని జీవీఎంసీ అధికారు లు ఎలాంటి మార్పులు చేర్పులు చేయలేరు. జీవీఎంసీ ఆస్తి పన్ను విధింపు, ఆస్తి మార్పిడి (మ్యుటేషన్) అన్నీ ఈఆర్‌పీలోనే చేయాల్సి ఉంటుంది.

**పెండింగ్‌లో దరఖాస్తులు:** తప్పుగా ముద్రితమైన డోర్ నెంబర్‌ను సరి చేయాలని గత ఆరు నెలల కాలంలో జీవీఎంసీకి పలువురు దరఖాస్తు చేశారని రెవెన్యూ ఉప కమిషనర్ సత్తారు శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమస్యపై మున్సిపల్ శాఖకు లేఖ రాశామని, మున్సిపల్‌శాఖ అధికారులు ఈఆర్‌పీలో మార్పులు చేసుకోవడానికి అనుమతి ఇచ్చే వరకు దరఖాస్తుదారులు వేచి ఉండాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. మున్సిపల్‌శాఖ అనుమతి ఇవ్వగానే ప్రజలకు సమాచారం అందిస్తామని ఆయన స్పష్టం చేశారు.

# తమన్నా ఏమి చేసింది నేరం.. ఆమెపై ఎందుకు కన్నడ కోపం?

మైసూర్ శాండల్ సోప్ ఎంతో ప్రసిద్ధి చెందిన సంగతి తెలిసిందే. అలాంటి సోప్ బ్రాండ్ అంబాసిడర్ గా నటి తమన్నా ఎంపికయ్యారు. ఈ మేరకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం తీసుకోగా.. రెండేళ్ల కాలానికి రూ.6.2 కోట్లు చెల్లించేలా "కర్ణాటక సోప్స్ అండ్ డిటర్జెంట్స్ లిమిటెడ్ సంస్థ" (కే.ఎస్.డీ.ఎల్) ఆమెతోఒప్పందం చేసుకుంది. ఇప్పుడు ఈ విషయం కన్నడ నాట కొత్త రచ్చకు తెరలేపింది. అవును... మైసూర్ శాండిల్ సోప్ కు బ్రాండ్ అంబాసిడర్ గా తమన్నాతో కే.ఎస్.డీ.ఎల్. ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సోప్ తో పాటు ఆ సంస్థకు చెందిన ఇతర ఉత్పత్తులకు కూడా ఆమె ప్రకటనలు చేయనున్నారు. దీంతో.. కన్నడనాట వివాదానికి తెరలేచింది. కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎందుకు ఎంచుకున్నారంటూ విమర్శలు మొదలయ్యాయి. ఈ సమయంలో సోషల్ మీడియా వేదికగా కొంతమంది ఆమెను అభినందిస్తుంటే.. మరికొంతమంది మాత్రం కర్ణాటక ప్రభుత్వంతో పాటు ఆమెపైనా విమర్శలు గుప్పిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం.. కన్నడ ప్రజల మనోభావాలను



దెబ్బతీసిందంటూ విమర్శిస్తున్నారు. కర్ణాటకలో ఉన్న ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ప్రభుత్వానికి కనిపించడం లేదా అని ప్రశ్నిస్తున్నారు. దీంతో... కర్ణాటక వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి ఎంబీ పాటిల్ స్పందించారు. ఈ సబ్బులపై రాష్ట్రంలో ఇప్పటికే మంచి డిమాండ్ ఉందని.. ఈ నేపథ్యంలో ఈ ప్రొడక్ట్ ని దేశ వ్యాప్తంగా విస్తరించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరణ ఇచ్చారు. పలువురు వాణిజ్య నిపుణుల సలహాతోనే తమన్నాను ఎంపిక చేసినట్లు మంత్రి క్లారిటీ ఇచ్చారు. అయితే.. ఈ వివాదంపై తమన్నా ఇంకా స్పందించ లేదు! కాగా... 1990 సంవత్సరంలో మైసూర్ రాజు కృష్ణరాజ్ వడియార్-4.. మైసూర్ శాండిల్ సోప్ సంస్థను బెంగళూరులో స్థాపించారు. ఈ క్రమంలో 1916లో సబ్బుల తయారీలో వేగవంతమైన ఈ సంస్థ... కర్ణాటకతో పాటు దక్షిణ భారతదేశంలో ఎంతో పేరు తెచ్చుకుంది. అలాంటి చరిత్ర కలిగిన సంస్థకు తమన్నాను బ్రాండ్ అంబాసిడర్ గా ఎంపిక చేయడం.. అమె కెరీర్ లో మైలురాయి అని అంటున్నారు. అయితే... ఈ ఎంపికను కొంతమంది కన్నడిగులు మాత్రం జీర్ణించుకోలేక పోతున్నారు! కర్ణాటకలో ఎంతో మంది టాలెంటెడ్ వ్యక్తులు ఉన్నప్పటికీ.. ఇతర రాష్ట్రానికి చెందిన తమన్నానే ఎంచుకోవడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

# మిల్కీబ్యూటీ మరో బోల్డ్ అటెంప్ట్!

మిల్కీబ్యూటీ తమన్నా తప్పొప్పులను తెలుసుకుని జర్నీని ఎలా ప్లాన్ చేసుకుందో తెలిసిందే. ఆరంభంలో గ్లామర్ పాత్రలకు నో చెప్పడంతో తానెంతగా నష్టపోయిందన్నది ఓపెన్ అయింది. అటుపై తనను తాను మార్చుకుని గ్లామర్ పాత్రల పరంగా చెరిపేసిన హద్దులు ప్రేక్షకులకు తెలిసిందే. సన్నివేశం డిమాండ్ం చేసిందంటే తనలోని బోల్డ్ యాంగిల్ ని తట్టిలేపిన సందర్భాలెన్నో. తెలుగు సినిమా అయినా? హిందీ చిత్రమైనా సీన్ డిమాండ్ చేసిందంటే చేలేరగడం తమన్నా ప్రత్యేకతగా మారిపోయింది.

**తమన్నా ప్రత్యేకత అదే:** ఆ మధ్య లస్ట్ స్టోరీస్ లో మాజీ ప్రియుడు విజయ్ వర్మతో ఇంటిమేట్ సన్నివేశాలతో కాక పుట్టించిన సంగతి తెలిసిందే. అ్మడు కిచెన్ రూమ్ లో చెలరేగిన వైనం? కుర్రకారు గుండెల్లో ఇప్పటికీ పదిలమే. లస్ట్ స్టోరీస్ తర్వాత తమన్నా? క్రేజ్ కూడా రెట్టింపు అయింది. సరిగ్గా టాలీవుడ్ లో అవకాశాలు తగ్గుతోన్న సమయంలో వచ్చిన ఛాన్స్ ఇది. అవకాశం రావడం...సిరీస్ సక్సెస్ అవ్వడం అన్ని తమన్నాకు కలిసొచ్చిన అంశాలు. తమన్నా ఇంత అప్ డేట్ గా ఉంది



కాబట్టే నేటి తరం హీరోయిన్లతో పోటీగా అవకాశాలు అందుకుంటోంది. బాలీవుడ్ కి పోటీగా ఎదురీదుతోంది. టాలీవుడ్ అటెన్షన్ డ్రా చేస్తుంది.

**కండీషన్స్ కి ఒకే:** తాజాగా తమన్నాకి బాలీవుడ్ హారర్ అండ్ బోల్డ్ కంటెంట్ లో ఛాన్స్ వచ్చినట్లు తెలుస్తోంది. రాగిణి ఎమ్ ఎమ్ ఎస్ ఫ్రాంచైజీ తమన్నాని వెతుక్కునీ మరి వచ్చినట్లు కనిపిస్తోంది. రాగినీ ఎమ్ ఎమ్ ఎస్ థర్డ్ ఇన్ స్టాల్ మెంట్ కోసం మిల్కీ బ్యూటీకి మేకర్స్ టచ్ లో కి వచ్చారుట. నేరుగా ఏక్తాకపూర్ తమన్నాతో టచ్ లో ఉందని తెలిసింది. తమన్నా కూడా హిట్ ఫ్రాంచైజీ కావడంతో సానుకూలంగా స్పందించిందిట. ఈ సమయంలోనే ఏక్తా కపూర్ తన కండీషన్స్ అన్నింటిని ఓపెన్ గా తమన్నా ముందు ఉంచిందిట.

**బోల్డ్ సన్నివేశాల్లో తమన్నా పీక్స్:** కమిట్ అయిన తర్వాత మధ్యలో ఏ కారణంగానూ తప్పుకోకూడదని..పూర్తిగా దర్శకులకు సహకరించాలని..ముఖ్యంగా బోల్డ్ సన్నివేశాల విషయంలో పూర్తిగా తమకు అనుకూలంగా ఉండాలని కండీషన్ ఉందిట. అందుకు తమన్నా కూడా అభ్యంతరం చెప్పలేదని కండీషన్ ప్రకారం ముందుకెళ్దామని చెప్పిందిట. ఈ సిరీస్ తో తమన్నా బోల్డ్ సన్నివేశాల పరంగా పీక్స్ చూసే అవకాశం ఉందని అప్పుడే సోషల్ మీడియాలో చర్చా మొదలైపోయింది.




# ఓజీ - అఖండ 2.. క్లారిటీ వచ్చేదెప్పుడో?



ఓజీ వర్సెస్ అఖండ 2.. గత కొద్ది రోజులుగా సినీ వర్గాలతోపాటు సోషల్ మీడియాలో దాని కోసమే డిస్కస్ చేసుకుంటున్నారు. ఇప్పటి వరకు వచ్చిన ప్రకటనల ప్రకారం.. దసరా పండక్కి రెండు సినిమాలు ప్రేక్షకుల ముందుకు రానున్నాయి. సెప్టెంబర్ 25వ తేదీన గ్రాండ్ గా రిలీజ్ చేయనున్నట్లు ఆయా చిత్రాల మేకర్స్ వెల్లడించారు. రిలీజ్ కు మరో నెల రోజుల సమయం ఉంది. అయితే ఏంటి అనుకుంటున్నారా? ఇప్పటి వరకు రిలీజ్ ప్లాన్ పై క్లారిటీ లేదు. రెండు భారీ సినిమాలు కాబట్టి ఏదో ఒక మూవీ తప్పుకునే అవకాశం ఉందని ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. కానీ ఏ సినిమా మేకర్స్ కూడా క్లారిటీ ఇవ్వడం లేదు. అఫీషియల్ గా ప్రకటించడం లేదు. ముఖ్యంగా అఖండ 2 వాయిదా పడుతుందని కొద్ది రోజులుగా వార్తలు వస్తున్నాయి. ఇంకా పెండింగ్ పనులు ఉన్నాయని.. అందుకే దసరాకు రిలీజ్ అవ్వడం కష్టమేనని సోషల్ మీడియాలో మాట్లాడుకుంటున్నారు. ఇప్పటికే ఓజీ షూటింగ్ పూర్తి కాగా.. ఒక సాంగ్ కూడా విడుదల చేశారు. కానీ అఖండ సీక్వెల్ సందడి మాత్రం లేదు. అదే సమయంలో పవన్ , బాలయ్య ఇద్దరూ ఆంధ్రప్రదేశ్ లో ఒకే సంకీర్ణ ప్రభుత్వానికి చెంది నవారు. వారిద్దరి మధ్య ఉన్న స్నేహాన్ని బట్టి చూసినా రెండూ ఒకే రోజు బాక్సాఫీస్ వద్ద తలపడే అవకాశం లేదు. కాబట్టి ఏదో ఒక మూవీ డ్రాప్ అవ్వడం పక్కా అని అంటున్నారు. అది అఖండ-2నే అవ్వవచ్చని చెబుతున్నారు. కానీ క్లారిటీ కోసం వెయిటింగ్. కాగా, ఓజీ మూవీని ముంబై బ్యాక్ డ్రాప్ లో గ్యాంగ్ స్టర్ డ్రామాగా సుజిత్ దర్శకత్వం వహిస్తున్నారు. ప్రియాంక అరుల్ మోహన్ హీరోయిన్ గా నటిస్తుండగా.. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మి కీలక పాత్ర పోషిస్తున్నారు. డీవీవీ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై దానయ్య భారీ బడ్జెట్ తో నిర్మిస్తుండగా.. తమన్ సంగీతం అందిస్తున్నారు. మరోవైపు, బాలయ్య బ్లాక్ బస్టర్ హిట్ మూవీ అఖండ సీక్వెల్ గా అఖండ-2 రూపొందుతోంది. బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తున్న ఆ మూవీలో ఆది పినిశెట్టి విలన్ గా కనిపించనున్నారు. 14 రీల్స్ ప్లస్ బ్యానర్ పై గోపి ఆచంట, రామ్ ఆచంట నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు కూడా తమనే వర్క్ చేస్తున్నారు. మరి రాబోయే కొద్ది రోజుల్లో ఏం జరుగుతుందో.. ఎప్పుడు క్లారిటీ వస్తుందో వేచి చూడాలి.

# బీస్ట్ మోడ్ లో శివాత్మిక



హీరోయిన్ అంటే ఎవరైనా సరే తప్పనిసరిగా ఫిట్‌నెస్ మెయిన్‌టెయిన్ చేయాల్సిందే. ప్రస్తుతం సినిమాల్లేవు కదా అని ఇష్టమొచ్చినట్టు తిని కూర్చోడానికి లేదు. అందుకే హీరోయిన్లు ప్రతీరోజూ జిమ్ చేస్తూ తమ బాడీని ఫిట్ గా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూ ఉంటారు. టాలీవుడ్ లో ఎంతోమంది ఫిట్‌నెస్ ఫ్రీక్స్ ఉండగా ఇప్పుడు ఆ లిస్ట్ లోకి యాంగ్రీ హీరో రాజశేఖర్ కూతురు శివాత్మిక కూడా చేరింది. ఆనంద్ దేవరకొండతో కలిసి దొరసాని సినిమాతో వెండితెర అరంగేట్రం చేసిన శివాత్మిక రాజశేఖర్ చివరిగా రంగ మార్తాండలో కనిపించింది.


ఆ సినిమా తర్వాత శివాత్మిక మరో సినిమాను అనౌన్స్ చేసింది లేదు. అయితే శివాత్మిక సిల్వర్ స్క్రీన్ కు దూరంగా ఉన్నప్పటికీ సినీ ఇండస్ట్రీకి మాత్రం దూరం కాలేదు. తాజాగా శివాత్మిక షేర్ చేసిన జిమ్ వీడియో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. బ్లాక్ షార్ట్, బ్లాక్ కలర్ ఫుల్ స్లీవ్స్ టీ షర్ట్ వేసుకుని శివాత్మిక జిమ్ వీడియోను పోస్ట్ చేస్తూ దానికి ప్రెట్టీ లిటిల్ జిమ్ మర్డర్ అనే క్యాప్షన్ ను రాసుకొచ్చింది. ఈ వీడియోలో శివాత్మిక బీస్ట్ మోడ్ లో బరువులతో స్క్వాట్స్ చేయడం పెద్ద విషయమేమీ కాదన్నట్టు చేసి అందరినీ ఆకర్షించింది. వీడియోలో శివాత్మిక ఎనర్జీ, తన ఫోకస్ అందరినీ తన వైపు తిప్పుకునేలా చేస్తున్నాయి. దాంతో పాటూ లెగ్ మెషీన్ తో మరో క్లిప్ ను కూడా శివాత్మిక దానికి జోడించి జిమ్ లో తను పడే కష్టాన్ని అందరికీ తెలిసేలా చేసింది. అయితే శివాత్మిక జిమ్ వీడియో మనం రెగ్యులర్ గా చూసే బాలీవుడ్ భామల జిమ్ వీడియోలా లేదు.

ఈ వీడియోలో శివాత్మిక ఎలాంటి మేకప్, గ్లామరస్ లుక్ లో కాకుండా పూర్తిగా చెమటలతో కనిపిస్తూ తన పోస్ట్ ను మరింత స్పెషల్ గా మార్చింది.

# రెండేళ్ల దాకా భాగ్య శ్రీ బిజీ బిజీ..!

ఏ ముహూర్తాన తెలుగు తెరకు పరిచయం అవ్వాలని అనుకుందో కానీ ఇప్పుడు ఆమె నెక్స్ట్ స్టార్ హీరోయిన్ గా అవతరించబోతుంది. వరుస స్టార్ ఛాన్స్ లు ఆమెకు వస్తున్నాయి. ఇంతకీ ఎవరా లక్కీ హీరోయిన్ అని అనుకుంటున్నారు కదా ఇంకెవరు ఆమె మన భాగ్యం అదే అండి భాగ్య శ్రీ బోర్స్. బాలీవుడ్ లో ఒక సినిమా చేసిన ఆమె మన డైరెక్టర్ హరీష్ శంకర్ దృష్టిలో పడింది. ఆయన సినిమాల్లో హీరోయిన్స్ కి మంచి క్రేజ్ ఉంటుంది. అంతేకాదు హరీష్ శంకర్ హిట్ ఇచ్చిన హీరోయిన్స్ కెరీర్ టాప్ రేంజ్ కి వెళుంది. శృతి హాసన్, పూజా హెగ్దే లాంటి హీరోయిన్స్ కి మొదటి బ్రేక్ ఇచ్చిన డైరెక్టర్ ఆయనే. భాగ్య శ్రీ ని కూడా మిస్టర్ బచ్చన్ సినిమాతో పరిచయం చేసిన హరీష్ శంకర్ ఆమె లోని గ్లామర్ యాంగిల్ తో ఆడియన్స్ ని ఫిదా చేశాడు. ఐతే మిస్టర్ బచ్చన్ సినిమా కమర్షియల్ గా వర్క్ అవుట్ కాలేదు. అయినా సరే భాగ్య శ్రీకి వరుస అవకాశాలు వచ్చాయి. ప్రస్తుతం అమ్మడు మూడు క్రేజీ సినిమాలతో బిజీగా ఉ





ంది. అందులో ఒకటి విజయ్ దేవరకొండ కింగ్డమ్ కాగా మరోటి ఎనర్జిటిక్ స్టార్ రామ్ తో చేస్తున్న ఆంధ్రా కింగ్ తాలూకా ఉంది. ఈ రెండిటితో పాటు దుల్కర్ సల్మాన్ రానా నటిస్తున్న కాంత సినిమా కూడా తెలుగు, తమిళ భాషల్లో బైలింగ్వల్ మూవీగా వస్తుంది. ఈ 3 సినిమాలతో భాగ్య శ్రీ ఆడియన్స్ కు మరింత దగ్గర కానుంది. ఐతే ఈమధ్య ఒక సినిమా కోసం భాగ్య శ్రీని దర్శక నిర్మాతలు కలిస్తే మరో ఆరు నెలల దాకా ఏమి చెప్పలేనని అన్నదట. ఆల్రెడీ అమ్మడికి మరో రెండు సినిమాలు లైన్ లో ఉన్నాయి. సో హిట్ లేకపోయినా సక్సెస్ ఖాతా తెరవకపోయినా కూడా భాగ్య శ్రీ డిమాండ్ అలా ఉంది. భాగ్య శ్రీ మూమెంట్ చూస్తుంటే తప్పకుండా టాలీవుడ్ లో టాప్ హీరోయిన్ గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. స్టార్ మెటీరియల్ అయిన ఈ అమ్మడిని మన మేకర్స్ ఏమేరకు ఆమె టాలెంట్ వాడుకుంటారన్నది చూడాలి. రాబోతున్న మూడు సినిమాల్లో ఒక్కటి హిట్టు పడినా కూడా భాగ్య శ్రీని ఆపడం ఎవరి వల్లా కాదని చెప్పొచ్చు.

# ర్యాంప్ షో కోసం స్టైలిష్ట్ ఛార్జ్ రోజుకు లక్ష!

ముంబైలో రెడ్ కార్పెట్ ఈవెంట్లు, జోష్ ఉన్న పార్టీలకు ఎటెండవ్వాలంటే ఒక్కొక్క స్టార్ ఎంత ఖర్చు చేస్తారో తెలుసా? తెలిస్తే నోరెళ్లబెడతారు. పెళ్లిళ్లకు తినడానికి వెళితే సరిపోదు.. షో చేయడం కూడా చాలా ఇంపార్టెంట్. ప్రముఖులందరి కళ్లు మనవైపే ఉంటాయి గనుక, అక్కడ మనం ధరించే దుస్తుల ఖరీదు, మేకప్, లుక్, చేతికి ధరించే హ్యాండ్ బ్యాగ్, సెల్ ఫోన్ ఇలా ప్రతిదీ లగ్జరీగా కనిపించడం ముఖ్యం. అల్ట్రా స్టైలిష్ గా, లగ్జరియస్ గా ఉంటే సరిపోదు.. బ్రాండ్ కూడా చాలా ముఖ్యం. పార్టీ క్రౌడ్ దూరం నుంచే అది ఏ బ్రాండ్? అనేది కనిపెట్టేస్తారు. దానిపైనే అందరి కళ్లు ఉంటాయి. ఇక ఏదైనా బ్రాండ్ కి ప్రమోషన్ చేయాలంటే కథానాయికలకు అర్హత ముఖ్యం. ఏదైనా ఈవెంట్ కి వెళితే షో స్టాపర్ గా నిలవాలి. అందరి కళ్లు మనవైపే ఉండాలి. ఈ అనుభవాలన్నిటినీ తాజా ఇంటర్వ్యూలో రకుల్ ప్రీత్ సింగ్ చెప్పుకొచ్చింది. కెరీర్ ఆరంభం ఒక ర్యాంప్ షోకి వెళితే మన వెంటే ఒక స్టైలిష్ట్ ఉండాలన్న జ్ఞానం కూడా తనకు లేదని చెప్పుకొచ్చింది. అంతేకాదు... స్టైలిష్ట్ కోసం లేదా మేకప్ మేన్ ఇతర



టీమ్ కోసం ఖర్చు చాలా ఉంటుందని కూడా రకుల్ చెప్పుకొచ్చింది. ఈవెంట్ ని బట్టి రూ.20,000 నుంచి దాదాపు రూ.1,00,000 వరకూ స్టైలిష్ట్ కోసం చెల్లించుకోవాల్సి ఉంటుందని కూడా వెల్లడించింది. స్టైలిష్ట్ కి తెరవెనక సిబ్బంది, ఇతర వ్యాపకాలు చాలా ఖరీదైనవి. ఏదో ఒక ఈవెంట్ కోసం అంత పెద్ద మొత్తం అవసరమా? అనుకోవడానికి లేదు. అక్కడ వారికి ఫిక్స్ డ్ గా భత్యం అందించాల్సిందే. లేదంటే ఆ రోజు, ఆ షోలో లుక్ పరంగా చిక్కుల్ని ఎదుర్కోవాల్సి ఉంటుంది. రెడ్ కార్పెట్ ఈవెంట్ కోసం సెలక్టివ్ గా స్టైలిస్ట్, ఫోటోగ్రాఫర్, హెయిర్ డ్రెస్సర్, మేకప్ బృందం తప్పనసరి. వారి రేంజ్ పై మనకు అయ్యే ఖర్చు ఆధారపడి ఉంటుంది. బాలీవుడ్‌లో ఇమేజ్ కీలక పాత్ర పోషిస్తుంది. ముంబై చిత్ర పరిశ్రమలో భాగం కావడం కేవలం నటనకు మించినదని రకుల్ అన్నారు. వ్యక్తుల మధ్య సంబంధాలు, లుక్, మన పొజిషన్ ఎలాంటిది? ప్రచారం చేసే బ్రాండ్ ఏమిటి? అనేవి డిసైడ్ చేస్తాయి. వీటన్నిటి ఆధారంగా మనల్ని అంచనా వేస్తారు. నా కెరీర్ ప్రారంభ రోజుల్లో ప్రమోషనల్ ఈవెంట్లలో స్టైలిస్ట్ అవసరం చూసి ఆశ్చర్యపోయానని రకుల్ ప్రీత్ సింగ్ తెలిపారు. ప్రమోషన్ల సమయంలో నేను స్టైలిస్ట్‌ని తీసుకోవాల్సి ఉంటుందని నాకు తెలీదు ప్రమోషన్లు ప్రారంభించే ముందే అన్నీ తెలుసుకున్నాను.. ఇది చాలా ఖరీదైన వ్యవహారమని అర్థమైందని రకుల్ తెలిపారు.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536